# మహావాక్యం

(కవిత్వం)

(అహం బ్రహ్మాస్మి నుంచి సర్వోహం విముక్తోహం వరకు)

(I am that I am to I am all I am free)

మనసే మహాకావ్యం
మనమే మహావాక్యం

డాక్టర్ లంకా శివరామప్రసాద్

Dr. Lanka Siva Rama Prasad

# మహావాక్యం (కవిత్వం)

## (Maha Vaakyam - Poetry)

✧✧✧————————————✧✧✧

by

**Dr. Lanka Siva Rama Prasad**

December 2021

Copyright @ 2021

**Dr. Lanka Siva Rama Prasad**

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442, 6305677926
Email: lankasrprasad@gmail.com
**www.anuvaadham.com**
**www.prosetry.in**

Copies available at :

**All branches of Vishalandhra**

Price : ₹ **200 $ 5**

Cover Design & Post Script :

**Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

# ప్రస్తావన

"మనసే మహాకావ్యం. మనమే మహావాక్యం"

వేదాంతపు అద్వైత భావనలో "వేదాలు-ఉపనిషత్తుల"లోని నాలుగు వాక్యాలు జీవాత్మ, పరమాత్మల అభేదాన్ని సూచిస్తాయి. అవి ప్రజ్ఞానం బ్రహ్మ (ఐతరేయ ఉపనిషత్ - ఋగ్వేదం నుంచి); తత్త్వమసి (ఛాందోగ్యోపనిషత్ - సామవేదం నుంచి); అహం బ్రహ్మాస్మి (బృహదారణ్యకోపనిషత్ - యజుర్వేదం నుంచి); అయమాత్మా బ్రహ్మ (మాండూక్యోపనిషత్ - అథర్వణవేదం నుంచి) గ్రహింపబడినాయి.

ఇవికాక - ఏకం ఏవాద్వితియం బ్రహ్మ (ఛాందోగ్య), సోహం (ఈశ), సర్వం ఖల్విదం బ్రహ్మ (ఛాందోగ్య); ఏతద్ వైతత్ (కఠ) - అనేవి కూడ మహా వాక్యాలుగా వేదాంతులు భావించారు. శివ పురాణంలో మొత్తం 22 మహా వాక్యాలు చెప్పబడినాయి. ఆ ఇరవై రెండిటికి ఏ తద్ వైతత్, ఏకం ఏవాద్వితీయం బ్రహ్మ వాక్యాలను జోడించి ఈ కవిత్వ పుస్తకానికి ఇరవై నాలుగు మహావాక్యాలను శీర్షికలుగా తీసుకున్నాను. (కొన్ని ఉపనిషత్ గ్రంథాలలో నక్షత్రాల సంఖ్యలా 27 మహావాక్యాలు, కొన్నిటిలో 108 మహావాక్యాలు చెప్పబడినాయి).

అద్భుతమైన కథాద్వీపాలు, తత్త్వవిచారణా తీరాలు, విరోధభాసా విశేష విహంగాలు, వేదాంత దీపస్తంభాలు, విద్యుల్లతా దీపాలు, అపరిచిత పరిచిత జంతు వృక్ష చరాచర ప్రపంచపు తీరు తెన్నులను ప్రత్యక్ష పరోక్ష అన్యాపదేశ దారులలో పరిశీలిస్తూ సాగే అలౌకిక నౌకా ప్రయాణం ఈ కావ్యం.

తెలుగు సాహిత్య కాలరేఖలో ప్రపంచ సాహిత్యాన్ని ప్రవేశపెట్టిన సృజనలోకపు 178వ గ్రంథం అహంతో మొదలై అహంతో ముగుస్తుంది- "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా".

**- డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయసూచిక

1. అహం బ్రహ్మాస్మి ........ 5
2. ప్రజ్ఞానం బ్రహ్మ ........ 10
3. తత్త్వమసి ........ 15
4. అయమ్ ఆత్మా ........ 20
5. ఈశావాస్యం ఇదం సర్వం ........ 25
6. ప్రాణోస్మి ........ 30
7. ప్రజ్ఞాత్మా ........ 35
8. యదేవేహ తదాముత్ర యదా ముత్ర తదాన్విహ ........ 40
9. అన్యద్ ఏవ తద్ విదితమ్ అథో అవిదితద అపి ........ 45
10. ఏసాత్ ఆత్మాంతర్యామ్య మర్తః ........ 50
11. సయశ్చాయం పురుషే, యశ్చాసావా ఆదిత్యే స ఏకః ........ 55
12. అహమస్మి పరంబ్రహ్మ పరమ్ పరపరాత్పరమ్ ........ 60
13. వేదశాస్త్ర గురుతత్ స్వయమానంద లక్షణం ........ 65
14. సర్వ భూత స్థితం బ్రహ్మ ........ 70
15. తత్త్వస్య ప్రాణోహం అస్మి ........ 75
16. అపంచ ప్రాణోహం అస్మి తేజస్వ ప్రాణోహం అస్మి ........ 80
17. వాయోశ్చ ప్రాణోహం అస్మి ఆకాశస్య ప్రాణోహం అస్మి ........ 85
18. త్రిగుణస్య ప్రాణోహం అస్మి ........ 90
19. సర్వోహం సర్వాత్మా కోహం ........ 95
20. సర్వం ఖల్విదం బ్రహ్మ ........ 100
21. ఏ తద్ వై తత్ ........ 105
22. ఏకం ఏవాద్వితీయం బ్రహ్మ ........ 110
23. యసౌ సోహం హంస సోహం హస్మి ........ 115
24. సర్వోహం విముక్తోహం ........ 120

# 1. అహం బ్రహ్మాస్మి

అహంతప్పు ఏమీ మిగలని అశాశ్వతపు మనుషుల మధ్యలోకి,
థెసియస్ నౌక నుంచి దిగింది అనాత్మ తాతగారి గొడుగుతో;
తలపైన గొడుగు, తనదేదీ లేని తనువు, ఆ బయోనిక్ యువతి,
కృత్రిమ మేధస్సుతో నిలబడిందామె ఆత్మ-అనాత్మ సరిహద్దు వద్ద.

తన రెండు కళ్లనూ తీసి నిలబెట్టింది క్షితిజరేఖపై
వాటి రెటినాలపై ఉన్మత్త నాట్యం చేస్తున్నాయి అణు శకలాలు
క్వార్క్‌లు, గ్లువాన్లు, న్యూట్రినోలు, బొసాన్ల మధ్య అదుగో
కనిపించీ, కనిపించనిదదే దైవకణం, కాసేపు సైతాను కణం.

అంతిమ వాస్తవాన్ని నేను, నేనే బ్రహ్మను, ఆత్మను, అనాత్మను నేనే
వేదాల పురుషుడిని, సూఫీల స్త్రీని, అర్ధనారీశ్వరుడిని,
అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిని, అర్థం కానివాడిని,
నన్ను నేనే రక్షించుకోలేక, నన్ను నేనే శిక్షించుకునేవాడిని, నేనే!

గొరిల్లాలరుస్తున్నాయి భీకరంగా ఛాతీలు చరుచుకుంటూ
మానవుడు కాజేసాడు వాటి ఢంకాను, పాటను, స్థలాన్ని
నడక మొదలయ్యాక భూమధ్యస్థ రేఖ దగ్గర వీరంగం
జీవన ప్రదేశం కావాలంటూ మోగుతున్నది మరణమృదంగం.

*****

## 2

నడక అందరికీ ఇష్టమే నడతతో పనిలేనప్పుడు
అందరూ దేవతలే ఆనందంగా బతికినపుడు
నీకు వచ్చిన పని నీవు చేయి, నాకు నచ్చినది నేను చేస్తాను.
అందరం రాత్రి గొడుగు కింద కలల్ని చెప్పుకుందాం

ఖర్జూరం, జీడిమామిడి, ఇప్పపూలు, ద్రాక్షలు, బియ్యం
బాగా పులియబెట్టు, వళ్లు పులిసినాక మొదలుబెట్టు
అతడు చెట్టెక్కి నెలవంకను వంచి అమృతం తెస్తున్నాడు
నెగడు ఆరేలోపు వేళ్లూ, దుంపలూ, పిట్టల్ని కాల్చిపెట్టు

కులాల చక్రం తిరుగుతున్నది, గొణుగుతున్నాడు కులాలుడు
శరీరాలు ఎవరైనా చేయవచ్చు, తలలతోనే వచ్చింది చిక్కు
దోసిళ్ల నిండా విషం తాగాక ఆలోచనామృతం గుర్తుకురాదు.
చెప్పిన సమయానికి తలలివ్వకపోతే సృష్టికర్తకు బహు చిరాకు

దివి నుండి తల్లిగర్భంలోకి వచ్చేప్పుడు ఎవరి తల వాళ్లే తెచ్చుకోవాలి
తాగుబోతు కులాలుడు తలకుండల్ని సరిగా చేయడం లేదీ మధ్య
నేలమీదికి వచ్చే దారిలో పిడుగులు, ఉరుములు, వానలు, ఉల్కలు
ఓటికుండతో వచ్చినవాళ్లకు జీవితమంతా ఖర్చే మరమ్మత్తులకు

*****

## 3

కాస్పియన్ సముద్రం వద్ద కాచుకుంటున్నారందరూ చలి
నాలుగు దిక్కులకూ నలుగురూ పోకపోతే కరుస్తుంది ఆకలి పులి.
ఉత్తర దిక్కు సంచారులకు కానవచ్చింది యగ్డ్రాసిల్ విశ్వవృక్షం
దక్షిణ దిక్కున మేస్తున్నది అగ్ని మధ్య ఓ వృద్ధ ఒంటె.

గుర్రాలు, గోవులుంటే చాలు గ్రహణాలు సరిహద్దులలో
మీ దేవతలు మాకు రాక్షసులు, మీకు మేమే మ్లేచ్ఛులం
ఎన్నో నాగ, ద్రావిడ, అశ్వ, నరమేధాలు జరిగాక జనపదాల కేక
ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములవాడిదే పతాక

వాళ్లు వీళ్లని, వీళ్లు వాళ్లని చంపాక, అయిదు రక్తపు మడుగులు
యుద్ధం మధ్యలో శాంతి బోధన వేపు రాజనీతిజ్ఞుని అడుగులు
దుఃఖాన్ని చూసి భరించలేనివాళ్లు బోధిచెట్టు నీడ నాశ్రయిస్తారు
రాముని అడుగుజాడలలో బహరాములనేకురు ప్రయాణిస్తారు.

ఖైబర్ కనుమ కుత్తుక తొక్కి స్వర్ణభూమిని చేసారు మరుభూమి
సైరస్, దరియస్, జెంఘిజ్ఖాన్, దువా, ఖ్వాజా, కెబెక్‌లు
గజని, ఘోరీల, అశ్విక దళాల పదఘట్టనలతో కుంగింది అవని
డ్రాగన్ దంతాలు మెరిసాక మత కత్తెరతో కత్తిరించారు భరత భూమిని.

*****

## 4

ఇప్పటి థెసియస్ నౌకలో ఏ భాగమూ ఆనాటిది కాదు
స్థాన్‌లూ, నాడులూ ఏర్పడ్డాక ఏదీ నీ స్థానం కాబోదు
కులం గోత్రం, భాషలతో కుత్తుకలు కోసుకుందాం, రా,
నీ ఛాతీకి బాంబుల కోటు, నా దేవుడికి చెవిపోటు

ఒంటిచేత్తో పరశువు బట్టి వేయ్యి చేతులు నరికాడో రాముడు
బాణాలు నేర్చుకున్నవాడు పదితలల వాడిని పడగొట్టాడు
రక్తపు మడుగుల వద్దే ధర్మక్షేత్రం రక్తికడుతుంది
పద్ధెనిమిది అక్షౌహిణులు చావడమే పద్ధెనిమిది పర్వాలవుతుంది.

మూడో రాముడికి కల్లుముంత, నాగలిచ్చి చక్రం తిప్పేవాడు కృష్ణుడు
ఆయుధం పట్టకుండా అణ్వస్త్రాల నాపేవాడు బొటనవేలు చూసుకోలేదు.
కాలిదా, చేతిదా బొటనవేలనేది కాదక్కడ తాత్పర్యం
అవతారం పరిసమాప్తి కావాలంటే బొటనవేళ్లు చాలా ముఖ్యం.

ఆకుపచ్చ చీకటి కమ్ముకొచ్చినపుడు మరింత క్రుంగిపోయాయి గుళ్లు
సర్వేజ్జనా స్సుఖినోభవత్ గర్భగుడి నిండా లెక్కలేనన్ని పగుళ్లు
ఒకరినొకరు లోకువగా చేసి చూడడానికే ఒకే కుల కాలపు రహస్య పదం
నిచ్చెనలు పాములున్నచోట పాచికలాట పరమపద సోపానపథం

*****

## 5

పరువు సంపద బరువుతో పడి ఉన్నాడతడో పక్కన
చుట్టూ చూసాడు, ఎవరూ కానరాలేదు, ఎటుచూసినా తానే!
ఇంత బరువూ నేనే ఎందుకు భరించాలని విడిపోయాడు
పరమాత్మ కాస్తా వర్ణాత్మ, మతమాత్మ, కులాత్మ శకలాలుగా

యహ్వేషెర్ యహ్వే, అయామ్ దట్ అయామ్ – అహం బ్రహ్మోస్మి
అయితే ఏమిటి? కాకపోతే ఏమిటి? పోట్లాడుకున్నాయి
కదిలించకుండా కదిలేవాడు, కదలకుండా కదిలించేవాడెవడు?
అణువో, అచ్ఛిన్నుడో, ఆదిమధ్యాంత రహితుడో అవన్నీ నేనే!

కారణరహిత కారణం, పరబ్రహ్మ స్వరూపం, పరువు రూపం
అనుపాదక  తలంపై అనుత్పాదక పర నిర్వాణ విరూపం
ధ్యానమంతా బ్రహ్మాండాండ పిండాల పరువు మంట గలిసిందని
కవచాలూ, కచ్ఛడాల తాళాలు కట్టి తాళం చెవులు పారేయడం.

పేరుకు చివరో ముందో తగిలించుకున్నాక ఇంకా రహస్య పదమేమిటి?
పరపతి పరంపరంతా ప్రతిరోజూ చమక పారాయణంం చేయడం
కాలపు కత్తి అంచుపై నడిచేటప్పుడు కులరక్తం బొట్లు కారతాయి
థెసియస్ రక్తబీజ రహస్యం తెలుసుకోవడమే ‘ప్రజ్ఞానం బ్రహ్మ’

*****

# 2. ప్రజ్ఞానం బ్రహ్మ

## 1

'ప్లేటో' మహాశయుడికి గడ్డం మీసాలున్నాయా?
'ఒఖామ్' రేజర్‌తో వాటిని కత్తిరించగలమా?
ఉన్నదో లేదో తెలియని దానిపై చర్చ అవసరమా?
అవసరమున్నా లేకున్నా ఆలయ నిర్మాణమే ప్రజ్ఞానం బ్రహ్మ!

ఛెకొవ్ తుపాకీ కళ్లముందు కదిలింది అడుగు పెట్టగానే
గుండు ఎటుపోతుందో తెలియకుండా గురిపెట్టరాదు
మూర్ఖుడికి కూడా తెలిసిన దానికి కుట్ర ముచ్చట దండగ
ఏదైతే తేలికగా ప్రవచిస్తామో దానిని తేలికగానే వదిలేస్తాం

నొక్కి వక్కాణించేవాడు ఋజువు చెయ్యాలి, కాదనేవాడు కాదు
దివ్య మధుపాత్రలో అమృతముందో లేదో ఎవరు చెప్పాలి?
అమృత కలశం అందుకోవాలంటే గిలెటిన్ ద్వారం దాటాలి
డెమొక్లిస్ కత్తి ఎప్పుడు మెడపై పడుతుందో చెప్పగలవారెవరు?

ఒక్క వెంట్రుక కట్టి కొండను లాగేవాడు మహాజ్ఞాని
అదే వెంట్రుకతో వేలాడుతున్న కత్తి కింద, అతడు కూర్చోలేడు
విధి దేవతలు క్లాథొ, లాఖెసిస్, దారాన్ని పేని కొలిచారు
అట్రొపస్ చేతి కత్తెర కదలిక తెలియడమే ప్రజ్ఞానం బ్రహ్మ.

*****

## 2

స్వర్గం నుంచి బొడ్డుతాడుతో వేలాడుతూ వచ్చేవారు టిబెట్టు ప్రభువులు
కత్తియుద్ధాల్లో తెగిపోతాయవి బొడ్డుతాళ్లు, మొలతాళ్లు, పుస్తె తాళ్లు
మంగోలు ఖాన్ మిడతల ధాటికి ఏ మగపురుగూ మిగల్లేదు
యుద్ధానంతర సంబంధాలన్నీ అంతే, స్థానిక ఆడవాళ్లు, పరాయి మగవాళ్లు

స్పానిష్ ఈగలు ముసిరి సర్వనాశనం కాలేదా అమెరికా ప్రజలు
ఇప్పుడక్కడున్నవాళ్లలో ఎక్కువమంది అక్కడివాళ్లు కాదు
వాళ్లకు ముందు వాళ్లు, అంతకు ముందు వాళ్లూ, మనమూ, అంతే
వలస జీవులమే మనమంతా, కాళ్లకు ఆకలి బలపాలు కట్టుకుంటాం

డేవిడ్ వొడిసెల రాయి దెబ్బకు నేలకూలినాడు గొలియాత్
పిజారొ తుపాకి దెబ్బలకు తల ఒగ్గాయి 'ఇంకా' ఒడిసెలరాళ్లు
అమెరికా అణుబాంబు దెబ్బకు అణిగిపోయాయి జపాన్ తుపాకులు
దెబ్బలు శాశ్వతమా, గాయాలు, మచ్చలు శాశ్వతమా, దెబ్బతిన్నవాడికి తెలుసు.

బతికున్న మనిషి గుండె పీకి బంగరు సూర్యుడికిచ్చేవాడొకడు
బంగారం కోసం వాడి పాదాల కింద మంటపెట్టేవాడు మరొకడు
బందీగా దొరికిన ప్రభువు నోట్లో బంగారం పోసి తినమన్నాడొక సుల్తాను
బంగారు పాత్ర కప్పి పెడుతున్నది నీ సత్యవదనాన్ని, దాన్ని తొలగించు, ఓ సూర్యుడా!

*****

## 3

పిలాతె అడిగాడు క్రీస్తును – సత్యమంటే ఏమిటి?
దైవవాక్యం అర్థం కాక శిలువ వేసారు దైవపదాన్ని.
'సత్యమంటే దైవం, అహింసామార్గం దైవ పథం'
ఆచరించినందుకు కాల్చి చంపారు ఓ అర్ధనగ్న సాధువును

కాలపు కుమార్తె సత్యం, అబద్ధం పడవేసిందామెను అగాధంలో
చేతిలో అద్దం, కొరడాతో బయటకు వస్తుంది నగ్న సత్యం
సహస్ర సూర్యకిరణ కాంతులతో అబద్ధపు కోటను కాల్చివేస్తుంది,
అసత్యం కమ్మిన యురిమ్, ధుమ్మిమ్‌లకిస్తుంది సత్యధర్మ ప్రకాశం

బృహదారణ్యమైనా దోమలు కుడుతుంటే వేదాంతం వస్తుంది
అబద్దపు చలిజ్వరానికి, సింకోనా సత్య కషాయమొక మందు
దాచలేనిది సత్యం, సంవృతి, పరమార్థ సత్య ద్వయమది
'సత్యం వద, ధర్మం చర' వత్తి పలికితే హత్యతో సమానం

హరిశ్చంద్రుడటుగా పోతూ వరుణుడిని చూసి అడిగాడు వాయిదా
కొడుకు మీద ప్రేమతో కడుపుబ్బి, జలోదరమైంది
అతడి తండ్రి సత్యవ్రతుడు – తప్పులు చేసి త్రిశంకుడైనాడు
రాజే కింకరుడైనా సత్యాన్ని వదలక చరితార్థుడైనాడు హరిశ్చంద్రుడు

*****

## 4

చంద్రుడు రెండుగా చీలినట్లు అందరికీ కనిపించకపోవచ్చు
జ్ఞాన విభజన రేఖను గమనించగలవా అవిశ్వాసి భౌతిక నేత్రాలు?
అరిజోనా చంద్రపుష్ప వికాసం, ఆరుగంటల పాటు ఏడాదికోసారి
పన్నెండేళ్ల కోసారి కురింజి పూలు నీలగిరులను కప్పే పూల వస్త్రాలు

చంద్రనాభి నగరం దారుల్లో పొడుగాటి దీపపు సెమ్మెల్లా సెంచురీ మొక్కలు
చాక్‌లెట్, అవొకాడొ, టొమాటొ, మొక్కజొన్న, వెనిల్లా
సపోటా, బీన్స్, హబరినొ-జలాపినొ మిరపకాయలు ఇచ్చింది మెక్సికో
దోపిడీ పూర్తయ్యింది కదా గోడ కట్టాలి ఆకలి రాకుండా మనవేపుకు!

'ఇంకా' శిథిలాల్లో 'పుమా' అరుస్తోంది, మెరుస్తున్నాయి జాగ్వర్ కళ్లు
రాతి కోడిపెట్ట ఎగిరి పోయింది, 'లామా' గుంపుల మధ్యకు
నెరుడా నడుస్తున్నాడు స్వేచ్ఛా దీపం చేతబట్టి మచ్చు-పిచ్చులోకి
అనాది నగరంలో సూర్యుడిని కట్టేసిన ఇంతిహువాతన్ శిల దగ్గరకు

గది నిండా బంగారం నింపి ఇచ్చినా, పిజారొ స్పానిష్ గుండెకు సరిపోలేదు
అతాహువాల్పా సత్యపు గొంతుకు తాడు బిగిసి, ఒక సామ్రాజ్యం ముగిసింది
దైవవాక్య నగరం 'లిమా' అధ్యక్ష భవనం అడుగున ఉంది అతాహువాల్పా శిరస్సు
ఆ శిరస్సు అరుపులకు భూకంపాలతో, దద్దరిల్లుతుంది పెరూ సరస్సు!

*****

## 5

కొత్త ప్రపంచాన్ని కనుక్కున్నావా, కొత్త దుఃఖాల్ని తెచ్చిపెట్టావా?
మూడు వందలేళ్ల మృత్యు నడకతో, కొత్త రంగు పంచిపెట్టావా?
శ్వేతవర్ణం, గుర్రాలు, కుక్కల్ని చూసి దేవతలు, దిగి వచ్చారనుకుంటే
మశూచి, మీజిల్స్, తుపాకి మందుతో తెగబడ్డాయి తెల్ల భూతాలు!

బలవంతంగా ఆక్రమించుకోవడమే కోడిపుంజులా, కొండముచ్చులా,
భూమైనా, ఆడపిల్లైనా, కసుగాయైనా, ఆకలేసినపుడు కోసుకుతినడమే,
ఎదురు తిరిగితే రెండు కత్తులు, ఒకటి గుండెలో, రెండోది లోయలోకీ
అనక పాత రంగుల్ని తుడిచేసి, తెల్లరంగేసి, చీకటి గదుల్లోకి తెచ్చారు ఆఫ్రికాను

అంతా వ్యాపారమైనాక అమ్మడం, కొనడం, అనేది వ్యావహారిక నిత్యభాష
మనుషులు సరకులయ్యాక చావు బతుకుల్ని తూనిక వేసేది లాభఘోష
అరటికాయలు, ఉల్లిపాయలు కూల్చివేస్తాయి ప్రభుత్వాలను
మనుషుల్ని జోంబీలుగా నడిపించేది పెట్టుబడిదారీ వ్యవస్థ.

అత్యున్నత జ్ఞానమంటే ముఖపుస్తకంలో ముడతలు లెక్కబెట్టడం
బనానా రిపబ్లిక్కులకు బ్రహ్మజ్ఞానంతో పనిలేదు
ప్రజ్ఞానులందరూ అమెరికా నిఘా సంస్థల్లో పనిచేస్తుంటారు
ఉద్దాలకుడన్నాడు తన కుమారుడు శ్వేతకేతుతో– 'తత్త్వమసి'.

*****

# 3. తత్త్వమసి

## 1

'అదియే నీవగుచున్నావు!' ఏది?, నేనా, సమాజమా?
వాళ్లు ఉప్పును బంధించి అమ్ముతున్నారు ఉప్పుబాలికగా ముద్రవేసి.
ఉప్పుబాలిక తప్పించుకుని సముద్రం దగ్గరకు వెళ్లింది ఒంటరిగా
ఒక్కొక్క అడుగు వేసి తల్లితో కలిసి తానే సముద్రమయ్యింది.

'అదియే నీవగుచున్నావు!' కావచ్చు, కాని 'నేను బురిడాన్ గాడిదను'
భౌతిక, ఆధ్యాత్మిక గడ్డిమోపుల మధ్య కదలకుండా పడి ఉన్నాను
– స్వేచ్ఛా నిర్ణయం తీసుకునే హక్కు నీకున్నది, ప్రయత్నించు'–
చచ్చిపడున్నట్లున్న దాని మీద కాకి వాలగానే కదిలింది గాడిద

'అదియే నీవగుచున్నావు!' – అవును, ఎటుచూసినా అనంత స్వేచ్ఛ.
ఏమిటిది, నాకందుబాటులో ఎప్పుడూ బక్కగుర్రాలే ఉంటాయి?
ప్రకృతి అందరికీ అన్ని అవకాశాలనూ అందుకొమ్మని ఇస్తే,
నా కంటగట్టిన బక్కగుర్రం, అగ్ర ఉగ్రాశ్వంతో పోటీబడగలదా?

'అదియే నీవగుచున్నావు!' – కావచ్చు, కాని నేను 'డాన్ క్విక్సొటీ'ని
నా గుర్రం 'రొసినాంతి'కి గాలి మరలన్నా, కమ్యూనిష్టులన్నా భయం.
నా సహాయకుడు శాంఛో పాంజాకు కాపిటలిస్టు పొట్ట
వేదాంతుల మీద దండయాత్రకు పోతున్నా– 'తత్త్వమసి' అన్నాడతడు.

*****

## 2

తల మబ్బుల్లో ఉన్నపుడు మబ్బులు తలలోకెక్కుతాయి
సాధారణుడి గాలిమరల్లో వేదాంతి చూస్తాడు మహాకాయుల్ని
పుస్తకాలు, ప్రేమ తలలో దూరాక వీరుడికి విశ్రాంతి ఉండదు
ఒరొబొరస్ సర్పం తన తోక తానే మింగుతూ కనిపిస్తుంది.

బుర్రలో గాలి–వాన పడుతున్నపుడు ప్రజ్ఞానపు అడుసులో పాదాలు
కడుక్కోవడానికి నూతి నీళ్లు చాలవు, కావాలి నదులు, సముద్రాలు
నీరే ప్రాణాధారం, అదే ప్రాథమిక మూలకం అన్నాడు థేల్స్
సప్త సాధువులదీ ఒకేమాట – 'నీ గురించి నీవు తెలుసుకో!'–

థేల్స్, పిత్తాకస్, బయాస్, సొలొన్, క్లియొబులుస్, మైసన్, షిలాన్
వీళ్లది గ్రీకు పడవ – ఏడుగురికీ – 'ఎంత తరచినా చాలదు',
జ్ఞాన వరదల్లో మరో పడవను మీనావతారం లాగుతున్నది తీరానికి
అగస్త్య, అత్రి, భరద్వాజ, గౌతమ, జమదగ్ని, వశిష్ఠ, విశ్వామిత్రుల్ని!

హిమవత్ పర్వతాన నవబంధనం దగ్గర ఆగింది సత్యవ్రతుడి నౌక
గోత్రాలను సృష్టించుకుంటూ నచ్చిన దిక్కుకు వెళ్లారు సప్తర్షులు
సత్యవ్రతుడు వైవస్వతుడై ఈనాటి ఏడవ మన్వంతరపు అధినేత
సూర్య సంతానం వైవస్వతుడు, యముడు, శని పాలిస్తారు మనుషుల్ని

*****

## 3

మరణశయ్యపై పడుకున్నపుడు మనిషి ప్రాగ్రూపుడవడం సత్యం
డాన్ క్విక్సోటి కన్నుమూసేప్పుడు పోతుంది పాత గ్రంథాల ప్రభావం
నిన్ను నీవు తెలుసుకున్నాక బయటపడ్తుంది అసలు తత్త్వం
గుహ అనుకుని సొరంగంలో ప్రవేశించినట్లుగా జీవన ప్రయాణం

మృత్యువు ఇంటిముందు మూడురోజులు ఉపవాసమున్నాడు నచికేతుడు
నిన్ను చూసాక నేనేమైపోతానని అడిగాడా బాలుడు మృత్యువును
–'నీ బొటన వ్రేలంత ఉంటుంది నీ అంతరాత్మ, దానికి చావులేదు'
మృత్యు కరవాలం కంఠానికానేంతవరకే జీవన ప్రలోభాలు

తత్త్వమసి – అదియే నీవగుచున్నావు – అన్నాడు మృత్యువు సాలోచనగా
పదివేల కోట్లమంది మనుషులిప్పటికే మట్టిలో కలిసారు ఇప్పుడున్నవాళ్లు కాక,
వీళ్లూ పోతారు ఇట్లాగే కొట్టుకు చస్తుంటే, త్వరలోనే,
నేనే మొదట చనిపోయిన మానవుడిని, యముడిని, 'తత్త్వమసి'–

బాధారహితం, సూక్ష్మత, లాఘవం, స్పష్టత పునరుత్థాన లక్షణాలు
'ఫ్రాషా కెరితి' అంతిమ తీర్పు దినపు రోజున సజీవులౌతారందరూ
ప్రచండాగ్ని ప్రజ్వలంగా మండుతూ నాలుకలు చాస్తూ ఉంటుంది
అగ్నిలో కలిసేది అగ్నిలో, పంచభూతాల్లో కలిసాక, మొలుస్తాయి కొత్త మొలకలు

*****

## 4

మరణమనేది ప్లాటో గుహలోని ఖైదీల అనుభవం
గుహ మధ్యలో జీవితపు శిలువలకు కట్టేయబడ్డారు జనం
ఎదురుగా తెరలా ఖాళీగోడ. వెనక బలిపీఠం వద్ద హోమాగ్ని
వాళ్లకు కనబడేది గోడపైన పడే నీడలే, వాళ్లకవే వాస్తవాలు.

వాళ్లకా జీవితం చాలు, శిలువల మీదనో, బలిపీఠం మీదనో,
సొరంగపు ఈ చివర్నుంచి ఆ చివరకు, నడక ఒకవేపే!
వెనక్కి రావడం నిషేధించబడింది, అందుకే ఇన్ని కథలు, కలలు
శిలువ నుంచి పునరుత్థానం చెందినవాడు 'దేవుని మాట' అవుతాడు.

మరణం కన్నా వేగంగా నిన్ను నీవు సృజించుకుంటే అదే అమరత్వం
వాళ్లు మెదడును తీసి సాంకేతిక జీవజలంలో భద్రపరచారు
కృత్రిమ మేధస్సుతో మరణాన్ని జయిస్తే వస్తుందా సమానత్వం?
మనిషిని సృష్టించిన దేవుడు, దేవుడినికలగన్న మనసుండేది ప్లాటో గుహలోనేనా?

నచికేతుడన్నాడు మృత్యువుతో– ఈ మూడు వరాలు ప్రసాదించు–
–'నా తండ్రి సూర్యుడి కోపాగ్నిని తగ్గించు, ఊరికే మండిపడుతున్నాడు
– యుద్ధాగ్నిని శాంతపరచు, మరణాగ్నిని నిత్యజీవనంగా మార్చు'–
పిల్లల కోరికలన్నీ అలానే ఉంటాయి, త్రేతాగ్నులను తగ్గించడమంత తేలిక కాదు.

*****

## 5

మరణం తొలి గురువని మనలో చాలామందికి తెలియదు
ఆఖరి మజిలీగా పడ్డ ముద్రను చెరపడం చాలా కష్టం
చీకటిలోంచి వెలుగు వచ్చినట్లు, మరణంలోంచి జీవనం వస్తుంది
రెండు మరణాల మధ్య కాలమే కనిపించీ కనిపించని జీవితం.

ఒక్క జీవితకాలంలో మనం అనేకసార్లు మరణిస్తూ ఉంటాం
రెండు మరణాల మధ్యన పునరుజ్జీవనాలను పొందుతాం
బతికి చావడం గొప్ప విద్య కాదు, మరల మరల చచ్చి బతకడమే జీవితం
అనేక రకాల చావులకన్నా కొన్ని రకాల బతుకులు ఘోరాతి ఘోరం

విధి, మృత్యువు చెట్టాపట్టాలేసుకుని నాటకం నడిపిస్తుంటాయి.
గ్రీకు దేశంలో గొప్ప విషాదాంత నాటక రచయిత ఎస్కిలస్
డెబ్బై నుంచి తొంభై నాటకాలు వ్రాసాడు, ఏడు మిగిలాయి– 'ఒరిస్టియా'లా
తలమీద ఏదో పడి చస్తావన్న జోస్యాన్ని నమ్మి తిరిగేవాడతడు ఊరిబయట

అతడి పేరుకన్నా ఎక్కువగా మెరిసేదా ఖర్వాటుడి గుండ్రటి బట్టతల
బండరాయనుకుని అతడి గుండుమీద పడేసింది తాబేలును ఓ రాబందు
విషాదాంత నాటక రచయిత కథ అలా విషాదాంతమయ్యింది జగన్నాటకంలో
బట్టతల నీదే కావచ్చు, రాబందు ఆలోచన వేరు, నీ ఆలోచన వేరు, – అయమ్ ఆత్మా!

*****

# 4. అయమ్ ఆత్మా

## 1

మూడు రంగులు, నాలుగు పాదాలు, అంతటా ధ్వనించే అయమాత్మ
మెలకువ నీదే అన్ని వికారాలు, సకారాల స్వేచ్ఛాస్థితి
రా, కలలు కందాం మధ్య మధ్యన, మరణాల మధ్య జీవితాన్ని
సుషుప్తి అనేది తాత్కాలిక మరణం, సాగదీస్తే తురీయానందం బ్రహ్మ

ఈ ప్రపంచమే 'కల'కాల నిర్మితం ఆ అనాది ప్రజలకు,
ప్లాటిపస్‌లు, కోలా ఎలుగుబంట్లు, కంగారూ, ఎము పక్షులు,
సింకోనా, మెలాల్యుకా, హకియా, కుంజియా చెట్లూ, పూలూ
కూకాబుర్రా పిట్ట నవ్వుతున్నది ఆశపోతు మనుషుల్ని చూసి

ఇంద్రధనుస్సు సర్పం బుసగొడ్తున్నది కొండలు, లోయల్లో
బైయామి సృష్టికర్త ప్రజలకు నేర్పాడు పాటలు, జీవన సూత్రాలు
యోవి, బున్యిప్ భూతాలు అల్లరి పిల్లల్నెత్తుకుపోయేవి
డింగో కుక్క ఎంత జాగ్రత్తగా ఉన్నా, వాళ్లు రానే వచ్చారు.

పడమట తీరాన డచ్, స్పానిష్ నౌకలు లంగర్లు వేసాయి
తూర్పు తీరాన్ని జేమ్స్‌కుక్ బ్రిటన్‌కు రాసిపెట్టాడు
ఫస్ట్ ఫ్లీట్‌లో చిరుదొంగల గుంపు ఆస్ట్రేలియా చేరింది ప్రవాసానికి
పదకొండువేల ఏళ్ల స్వప్నకాలాన్ని కొత్త భూతాలు కొల్లగొట్టాయి.

*****

## 2

'సర్వం మిథ్యా బ్రవిమి' – అన్నాడు భర్తృహరి 'నేను చెప్పేదంతా అబద్ధం'
ఈ వాక్యమూ అబద్ధమయితే, అతడు చెప్పింది అబద్ధమా, సత్యమా?
బ్రహ్మసత్యం జగత్ మిథ్య అయితే బ్రహ్మ నుంచి అశాశ్వత జగత్తెలా సాధ్యం?
కనిపించే దానిని కాదని, కనిపించని దానిని అవుననడమే వాస్తవమా?

శాంత సముద్రంలో హవాయి ప్రజలు, నమ్ముతారు నలుగురు దేవుళ్లను
వాళ్ల జీవితాల్లోకి జేమ్స్‌కుక్ వచ్చి సృష్టించాడు అశాంతి సముద్రాలను
'లొనొ' దేవుడొచ్చాడు పండుగ కాలంలోనని సంబరపడ్డారు వాళ్లు
వారిస్తున్నా వినకుండా దేవతామూర్తుల కొయ్యల్ని ఎత్తుకుపొయ్యారు వీళ్లు

దారిలో ప్రచండమైన తుఫాను చెలరేగి విరిగింది తెరచాప స్తంభం
వెనక్కి వచ్చిన వాళ్లను విరోధులుగా, బుసలు కొట్టింది స్థానిక జనం
నిద్రపోతున్న 'కలాని ఒపూ' ప్రభువుతో నౌక దగ్గరకు జేమ్స్‌కుక్
'కనెకపొలి' చూసి కేకలు పెట్టింది, 'పెనిమిటీ, ఆగిపో' అని!

కహునా పూజారి కొబ్బరికాయ పొగతో గొణుగుతున్నాడు మంత్రాలు
ఇసుక వేస్తే రాలనంత జనం తుఫాను మబ్బుల్లా వస్తున్నారు అరుస్తూ
'కుక్'ను చంపి కొండపైకి తీసుకెళ్లి, ముక్కలు చేసి ఉడకబెట్టారు
ఎముకల్ని శుభ్రం చేసి యుద్ధదేవుడి ముందు పెట్టారు నైవేద్యంగా.

*****

## 3

పరమగురువు గౌడపాదుడు గురువులకే గురువు
–'మెలకువలోని వైశ్వానరుడు, కలలుగనే స్వాప్నికుడు
సుషుప్తిలో ఏమీ పట్టించుకోనివాడు ముగ్గురూ ఒక్కరేనా?
వాస్తవం నుంచి వైతథ్యాన్ని, అద్వైతస్థితిని దాటడమే తురీయం'–

కుండలోని నీరు, కట్టెలోని అగ్ని వాటి విచ్ఛిన్నానంతర స్థితి
సగుణ, నిర్గుణ బ్రహ్మలను దాటిన అనంత, అభేద శుద్ధచేతన
ఇంద్రియానుభూతుల అవాస్తవాన్ని దాటే అజాతి శాశ్వతత్వం
పరమగురువు ప్రాతిపాదించేది మరణానంతర పరమానందమేనా?

మౌఖిక న్యాయ సూత్రాలు, రక్తశుల్కం స్థానే వచ్చింది లిఖిత చట్టం
'డ్రాకొ' శాసనాలుగా 'ఏథెన్సు ఏక్సొన్లు'గా కనిపించేవి ఎక్కడ చూసినా
ఏ తప్పు చేస్తే ఏ శిక్ష విధించబడుతుందో ఇప్పుడందరికీ తెలుసు
'డ్రాకొ'ను అందరూ మెచ్చుకున్నారు న్యాయపు కళ్లగంతలు తీసినందుకు

చిన్న పండు దొంగిలించినా, బహిరంగ స్థలాల్లో నిద్రపోయినా మరణదండనే
అప్పు చెల్లించలేని సామాన్యుడు వెట్టిచాకిరీ చెయ్యాల్సిందే
డ్రాకొను మెచ్చుకుంటూ టోపీలు, వస్త్రాలు విసిరారు ఒక్కుమ్మడిగా
పూలగుత్తుల కింద చిక్కుపడిన తుమ్మెదలా కన్నుమూసాడు డ్రాకొ

*****

## 4

ఈ నాలుగు పాదాల ఆత్మకు వెట్టిచాకిరీ చేస్తుందా దేహం?
సుషుప్తిలో ఆత్మ దేహాన్ని వీడి, మరల చేరినపుడు వస్తుందా మెలకువ?
కనురెప్పల కింద కదుల్తున్నాయి కళ్లు, మారుతున్నాయి ముఖ కవళికలు
అవ్యక్త వాంఛా పూరణాలా, అతీంద్రియ సందేశవాహనాలా కలలు?

పీడకలలు రాత్రి గుర్రాలనెక్కి కల్లోలపరుస్తాయి మనోయవనికను
మగపిశాచి ఇంకుబస్ ఆడవాళ్లనాక్రమించి విత్తుతాడు దెయ్యపు విత్తుల్ని
కామపిశాచి సక్కుబస్ మగవాళ్ల పక్కలో చేరి పీల్చేస్తుంది యవ్వనాన్ని
ప్రతి పీడకల ప్రకటిస్తుంది పీడకుల అణచివేత, లేదా భయ విహ్వలతను

ప్రతి ఘర్షణా ధ్వంసం చేస్తుంది ప్రశాంత నిద్రనూ, కలలనూ
ప్రతి కలా కోరికల ప్రతీకలా, ఏదో చెబుతున్నట్లుంటుంది
జాకబ్ నిచ్చెనా, త్రిజటా స్వప్నం, బుద్ధుని తల్లి మాయాదేవి కలా,
కోట్లాది మంది పీడిత జనపు కలలూ, ఎవరి కలలు వారివి.

మేరిషెల్లి–ఫ్రాంకెన్ స్టీన్, కాలరిడ్జి–కుబ్లాఖాన్, హొవె–కుట్టుమిషను
కెకులె–బెంజిన్ వలయం, పాల్ మెక్‌కార్టనీ – యెస్టర్‌డే పాట,
నీల్స్‌బోర్ – అణు నిర్మాణం, మెండెలివ్–పిరియాడిక్ టేబుల్, స్వప్న నిర్మితాలు
లింకన్, సీజర్, హిట్లర్, మార్టిన్ లూథర్‌కింగ్ లన్నారు– 'నేనొక కలగన్నాను'

*****

## 5

అసిబికాషి – సాలీడు అమ్మతల్లి కాలరహిత రక్షకదేవత
పిల్లల్ని, దేశాన్ని కాపాడే పెద్దవ్వ, సాకారం చేస్తుంది కలల్ని
అవ్వా, రా, కడదాం పిల్లల ఊయలపై రెండు కలల వలల్ని!
నిద్రపో, బుజ్జాయీ, నిద్రపో, నీ కలలన్నీ నీవే; అవి పారిపోలేవిక!

పధ్నాలుగు వందల తొంభైరెండు అచ్చిరాలేదు అమెరికా స్థానికులకు
కొలంబస్సులతో పాటు వచ్చాయి మృత్యుదూతలు మశూచి, మీజిల్స్
నూరేళ్లలో తొంభైశాతం అనాది ప్రజలకు నిండాయి నూరేళ్లు
కృతజ్ఞతలు తెలుపుకునే రోజున, కుత్తుకలు కోసింది గుర్తుకురాదు

కరుణామయుడైన క్రీస్తు పతాక కింద కదిలాయి కరకు పాదాలు
కోటి కలల ఊయలలు, వలలు ధ్వంసమై, కన్నీటి 'కివా' పెద్దవ్వ
వేళ్లమీద లెక్కపెట్టవచ్చు అనాది ప్రజల్ని వాళ్ల రక్షిత స్థలాల్ని.
వాళ్ల కలల వలల్ని తొక్కి కర్మాగారాలూ, సిలికాన్ లోయలూ

ఓంకారమైనా, అమ్మ మమకారమైనా అది బృహత్ బ్రహ్మ విదితాలు
కాలరహిత కాలంలో కలలు కాని కలలు, జీవనం ఉన్న జీవితాలు
కాని, ప్రపంచ శిశువు ఊయలపైన కాపిటలిస్టు కలల వలల పర్వం
స్వప్న బేహారుల సామ్రాజ్యాల చుట్టూ ఈశావాస్య మిదం సర్వం!

*****

# 5. ఈశావాస్యం ఇదం సర్వం

## 1

పరిపాలించే ఈశుడిదే ఈ సమస్త విశ్వం
ఈశు, ఏసు పదాలలో ఏదో మహత్తుంది
మననమే మంత్రమయినపుడు ఈ పదమేదో మహామంత్రం
'ఈశుడు, మాటా, ఆత్మ అన్నీ ఒకటే – అన్నదేనా అద్వైతం?

రా, దగ్గరగా కూర్చో, ఇద్దరం నేర్చుకుందాం ముఖాముఖీ
ఆత్మ, ప్రాణం, మనసు కనిపించవు, కాని ఏడిపిస్తాయి మరీ మరీ
సత్యమూ అంతే, దానిని కనిపించనీకుండా స్వర్ణకాంతులు,
సత్యం దోచుకోబడదు, స్వర్ణాన్ని దోచుకోవచ్చు, అందుకే స్పర్థలు

స్వర్గం నుంచి వృద్ధ ఒంటె తెచ్చింది సైప్రస్ వృక్ష శాఖను,
విష్తస్పా ప్రభువు నాటినాడు కష్మార్‌లో ఆ నల్లచీకటి మానును.
అగ్ని దేవాలయం ముందు ఆ వృక్షం విస్తరించింది అన్నిదిక్కులా
జరాతుష్ట్రుడి శత్రువు కరపాణుడి కత్తి కూల్చింది వృద్ధ ఒంటెను

అబ్బాసిద్ ఖలీఫా భవనానికి అవసరం పడింది నల్ల చీకటిమాను కలప
కష్మార్ నుంచి రాజధాని సమర్రాకు దూరం పన్నెండు వందల మైళ్లు
ఇరానియన్ల విజ్ఞప్తులను లెక్కచేయక నరికించాడా మహావృక్షాన్ని,
కలప 'సమర్రా' చేరిన రాత్రే, తుర్కిష్ సైనికుడి కత్తి కూల్చింది ఖలీఫాను.

*****

## 2

ధర్మో రక్షతి రక్షః, వృక్షోరక్షతి రక్షః అంటూనే ఉంటాం
ధర్మాన్ని చెరలో పట్టి, సత్యాన్ని, వృక్షాలను వధిస్తుంటాం
ధర్మం లానే చెట్లు కరుణామయులు, ప్రాణవాయువును ఇస్తాయవి
ధర్మపు శాఖలతో ధర్మాన్ని, చెట్ల శాఖలతో చెట్లను నరుకుతాం!

సింధూర వృక్షం కన్నీటిమయమై ప్రార్థించింది కులదైవం జూపిటర్‌ను
-'నీవు విలువైన దానివి గనుకనే నిట్టనిలువునా కూల్చేస్తారు' అన్నాడు దేవుడు
బొనిఫేస్ సాధువు గొడ్డలి అంచు తగలగానే నేలకూలింది సింధూరం
చెట్టును పూజించే వాళ్లందరూ శిలువను ప్రేమించిన కథాసారం.

అరిమాథియా జోసెఫ్ చేతికర్ర నేలలో పాతితే గ్లాస్టన్‌బరీ థొర్న్ వృక్షమయ్యింది
ప్యూరిటన్లు నరికే సారు ఆ చెట్టును కాథలిక్కుల చిహ్నమని;
ఎటుచూసినా రెండు వందలమైళ్ల దూరంలో ఏ చెట్టూలేని నైగర్ ఎడారి
ఒకే ఒక తుమ్మచెట్టుంటే, తాగుబోతు డ్రైవరు గుద్ది కూల్చేస్తాడు

బుద్ధగయలోని బోధి చెట్టు చుట్టూ అశోకుడు కట్టించాడో విహారం
రాణి తిష్యరక్షితి అసూయతో నాటింది మందు ముళ్లహారం
చనిపోయిన బోధిచెట్టు స్థానంలో పెరిగిన చెట్టును నరికాడు పుష్యమిత్రుడు
మరల నాటగా పెరిగిన వృక్షాన్నీసారి నరికించాడు రాజు శశాంకుడు.

*****

## 3

చెట్లు, ధర్మం నరికితే నశించేవి కావనేది సత్యం
కట్టెను కాల్చడానికో, పెట్టెలో పెట్టి పాతడానికో కట్టెలవసరం
అనగనగా ఒక అడవుండేది, చెట్లు, పిట్టలు, జంతువులుండేవి.
ఇప్పుడేదీ లేదు, అన్నీ వలసపోయాయి బొమ్మలుగా, జ్ఞాపకాలుగా.

వన వృద్ధుడికి సాయంచేసాడో రైతు అడవులను నరకకుండా,
వృద్ధుడతడికో విత్తనాన్నిచ్చాడు; 'మామూలు విత్తనం కాదిది.
మొలకెత్తే వరకు నీ స్వేదజలం, మొలకెత్తాక పొయ్యాలి నీ రక్తం'
రైతు చెమట రక్తంతో పెరిగిన చెట్టుకు వెండిపూలు, బంగారు పళ్లు

భూమి నాదియన్న భూమి ఫక్కున నవ్వినట్లు, నవ్వుతాయి జిన్‌మెనెజు ఫలాలు
మనిషి ముఖం పళ్లు, ఎదురు నవ్వితే ఠపీమని నేలరాలతాయి
జపాన్‌లోనే మరోచెట్టు జుబొక్కొ కబంధ వృక్షం
తన పొడుగాటి శాఖల్తో పట్టి పీల్చేస్తుంది మాంసం, రక్తం.

థాయ్‌లాండ్ హిమవంతి అరణ్యంలోని నారిఫన్ వృక్ష ఫలాలు
ఎనిమిదంగుళాల మోహినీ కన్యలుగా పీల్చేస్తాయి పురుషుల జవసత్వాలు
వీటికి విరుద్ధం మన అరటి, తాటి, కొబ్బరి, ఇప్ప చెట్లు
కల్పవృక్షాలై మనుషుల అవసరాలను మౌనంగా తీర్చే వనదేవతలు.

*****

## 4

మనిషి చెట్టై పుట్టిఉంటే ఎంత బాగుండునో అనిపిస్తుందొక్కోసారి,
మరి, చెట్టు మనిషైతే ధర్మం నాలుగు పాదాలా నడిచేదా?
నైమిశారణ్యంలో చెప్పినవన్నీ అడవి దాటాక జ్ఞాపకముండవు.
నారాయణుడు చెప్పినదేదీ యుద్ధం ముగిసాక నరుడికి గుర్తులేదు.

అన్ని వృక్షాల్లోకెల్లా నేను అశ్వత్థ వృక్షాన్నన్నాడు భగవానుడు
స్వస్థత కూర్చే అశ్వత్థం, బోధివృక్షం కాగా బుద్ధగయలో నాటినాడు అశోకుడు
'ఊర్ధ్వ మూలమధః శాఖ అశ్వత్థ ప్రాహురవ్యయమ్' – అన్నాడు యముడు
'అదే వేదవృక్షం, వేళ్లు పైన వేద శ్లోకాలైన ఆకులు భువిలోన' – అన్నాడు పరమాత్మ

రా, పోగుచేద్దాం, ఎండిన అశ్వత్థ చిదుగులను, జ్ఞానాగ్నిని రగిల్చేందుకు;
విశ్వ వృక్షాలను దర్శిద్దాం – నార్డిక్ ప్రజలకు యగ్గ్రాసిల్, సింధూరం స్లావిక్ ప్రజలకు,
ఎగిగ్ ఎరొపా–హంగేరియన్లకు, అగాక్ అనా–టుర్కులకు, మొదున్ చెట్టు మంగోలులకు,
ఇరొకొ–'యొరుబా'లకు, జియాన్ము–చైనా ప్రజలకు, ఇర్మిన్‌సుల్–జర్మనీ వాళ్లకు.

వొరుసాకా సముద్రం మధ్య దీవిలో హవొమా వృక్షం
దానిపై నివసిస్తుంది దివ్య విహంగం సిముర్గ్
ఫరిదుద్దిన్ అత్తర్! నీ పక్షులన్నీ బయల్దేరాయి దాని సన్నిధికి
అన్ని లోయలూ దాటినాక అర్థమైంది ఆత్మల సమూహమే 'పరమాత్మ' అని

*****

## 5

పురాత్తు (యూఫ్రటిస్) నది ఒడ్డున ఉండేది పురాన విల్లో చెట్టు
ఇనాన్నా దేవత దానిని మార్చింది తన ఉరుక్ ఉద్యానవనంలోకి
దాని నాక్రమించాయి భయంకర సర్పం, అంజు పక్షి, లిల్లిత్ భూతం
వాటిని పారద్రోలి గిల్గామేష్, చెట్టు చెక్కలతో చేసాడు గద్దె, మంచం

'కుర్'లో ప్రేమఫలం తిన్న ఇనాన్నాకు తెలిసాయి శృంగార రహస్యాలు
రైతు, గొర్రెలకాపరిలో ఎన్నిక చేసుకుంది గొర్రెలకాపరి 'దుముజిద్'ను
ఎరిడు పట్టణం నుంచి పవిత్ర 'మి' శాసనాలను తెచ్చింది 'ఉరుక్'కు
ఒంటరిగా నిద్రిస్తున్న ఇనాన్నాను బలాత్కరించాడు తోటమాలి సుఖలేతుడు

అతడిని వెంటాడి, వేటాడి చంపి పగ తీర్చుకున్నది ఇనాన్నా.
దుముజి–గొర్రెలకాపరితో గడిపింది, అత్యద్భుత శృంగార జీవితాన్ని.
దురదృష్టవశాత్తు దుముజి, స్టెప్పె మైదానాల్లో చిక్కుకుపోయాడు
పాతాళలోకం వెళ్లింది ఇనాన్నా, తన సోదరి ఎరెష్కిగల్‌ను కలిసేందుకు

–'నీవు భూలోకంలో బతకాలంటే, నీకు బదులు పాతాళంలో ఎవరో ఒకర్ని ఉంచాలి'–
ఇనాన్నా పాతాళానికి వెళ్లి వచ్చేసరికి, తనను మరచి గద్దెపై సుఖంగా 'దుముజి'
తనకు బదులు దుముజిను, అతడి సోదరిని ఏడాదికి చెరో ఆర్నెల్లు పాతాళ ప్రవాసం
ఈ ప్రేమ జగత్తంతా ఇనాన్నాదే, ప్రేమే ఊపిరి, ప్రాణం – ప్రాణోస్మి!

*****

# 6. ప్రాణోస్మి

## 1

–'ఎవరు నీవు? కాలానివా? ప్రదేశానివా? కాంతి ప్రవాహానివా?'
–'నేను కాలాన్ని, కాలంలో ఇమడ్చబడిన ప్రతి విషయాన్ని నేను–
విశ్వగర్భ జనిత స్వయం ప్రకాశ పాంచభౌతిక తత్వాన్ని,
నీవెవరివో నేనూ అదే'– 'మరి నేనెవరు?' – నీవే సత్యం!

ప్రాణం, ఊపిరి, జీవశక్తి, పంచ ప్రాణాలు; పంచ ఉపప్రాణాలూ నేనే!
నేను లోపలికి వెళ్లి శిరస్సు, గుండె, ఊపిరితిత్తుల్ని శుభ్రపరుస్తానన్నది ప్రాణం
నేను బయటకు పోతేనే కడుపుబ్బు తగ్గుతుందన్నది అపానం
వెక్కిళ్లు, సంభాషణలతో ఊర్ధ్వంగా నడుస్తానన్నది ఉదానం

నాభినాదన్నది సమానం; నరాల్లో నాళాల్లో ప్రయాణిస్తానన్నది వ్యానం
మేము ఉప ప్రాణాలమన్నాయి, కూర్మ, దేవదత్త, కృకాల, ధనంజయులు
డెబ్భై రెండువేల నాడులు, నూట ఒక్క హృదయ నదులు
ప్రాణశక్తుల షట్చక్ర కేంద్రాలు, కోసిచూస్తే కనిపించేవి కావు

'క్విమెన్ దుంజియా' అనేది చైనా ఖగోళ జ్యోతిష వేదాంత ప్రక్రియ
యిన్–యాంగ్; అయిదు మూలకాలు, ఎనిమిది 'త్రిగ్రామ' రేఖలు,
పది స్వరకాండాలు, పన్నెండు భూశాఖలు, ఇరవై నాలుగు సూర్యకాలాలు
చైనా కుండలినీ రాశిచక్రంలో భవిష్యత్ నిర్ణయ దివ్య–ఛి–ప్రాణశక్తులు.

*****

## 2

విశ్వ ఘటాంతర్గత మూలాధారాన ముడుచుకుని ఉన్నదో సర్పం
మూడున్నర వలయాల భూతత్వంతో బుసకొడ్తుంది కదిలిస్తే,
నీళ్లలో ఈది మణిపట్టణం దాటి, జఠరాగ్నిలో స్వాధిష్ఠానానంతరం
హృదయపద్మంలో ప్రాణవాయు పరిష్వంగంతో విశుద్ధాకాశస్వరం

స్వరపేటికను దాటి కనుబొమల మధ్య ప్రజ్ఞాన బ్రహ్మానుభవం
విస్ఫోటనమది సహస్రారమున సహస్ర సూర్యకాంతి సుందరరూపం
సుషుమ్నా ప్రవాహాన ఆధారం నుంచి శిఖరం వరకు ప్రాణశక్తి ప్రయాణం
సూర్యనాడి పింగళ, చంద్రనాడి ఇడా, ఎండా–వెన్నెల మధ్య కరుణాయానం.

అన్నీ ప్రతీకలే మాయా అద్దాల్లా, మన ప్రతిబింబమే కాలానుగుణం,
వేయి వెండిచేపలు మెరుస్తూ వస్తున్నాయి నిర్మల జలధిలో పెద్ద అద్దంలా
క్షణంలో చెదిరిపోతాయి వేయి అద్దాల్లా భయం బెదరగొట్టినపుడు
వేయి అద్దాలున్న గదిలో నీవు నవ్వితే నవ్వులు, నీవు అరిస్తే ఉరుముల చప్పుడు.

ప్రతి మనసూ అడుగుతుంది అద్దంలోని ప్రతిబింబాన్ని,
'అందంగా లేనా?' – అద్దం మౌనంగా కాలపు పేజీలను ప్రతిఫలిస్తుంది.
వేడి ఊపిరి చల్లబడేలోపు, తుడుస్తూ ఉండాలి అద్దాన్ని.....
ఆఖరి అద్దంలోంచి బయటపడలేము, అక్కడంతా నిశ్శబ్దం

*****

## 3

అందరం కోరుకుంటాం మాయా వస్తువుల్ని, కృత్రిమ మేధస్సును
ఎగిరే చెప్పులు లేదా కీలుగుర్రం, కనబడకుండా కోటు లేదా ఉంగరం
అరచేతిలో అంజనం లేదా స్ఫటికగోళం లేదా మాయాదర్పణం,
అక్షయ తూణీరాలు, కామోద్దేపనాలు, ప్రేమ కషాయాలూ, పిల్సూ-నీడిల్సూ

అందరం అల్లాద్దీన్ ఆలీబాబాలమే, పైకి చెప్పుకోము కాని,
మనకి కావాలి మాయాలాంతరో లేక ససేమ్ మంత్రమో,
కష్టపడకుండా నిధులు దక్కేందుకు, బలిపశువుల్ని వెదుకుతాం
ఎంత వింత భూతాలైనా మూడుసార్లు కంటే ఎక్కువ పని చేయవెందుకో!

మూడు వందలేళ్ల స్థానికుల్ని చంపి, బానిసల్ని తెచ్చుకున్నాయి వలస రాజ్యాలు
అరవై ఏళ్లలో హస్తకళల్ని హస్తగతం చేసుకున్నాయి యంత్రాలు
సైరన్ కేక వినబడగానే జోంబీలు కదుల్తాయి వరుసలుగా
మానం, ప్రాణం, వేగం, కాలం, దూరం, ప్రదేశం అన్నీ తెరలు తెరలుగా పొగచూరిన!

అంగవస్త్రం సరిపోయే వేడి ప్రదేశాల్లో ఆరు ముక్కల యూనిఫారంలు
పత్తిమొక్కకు వస్త్రానికి మధ్య అనేక రకాల ఫ్యాషన్లు, రిఫారంలు
వ్యాపారపు పాదం పెట్టిన ఒంటె, గుడారాన్ని ఆక్రమించుకుంది.
బానిసత్వ భావజాలం నరాల్లో ఇంకినాక పెట్టుబడి బడిలో తల ఊగింది.

*****

## 4

సర్వశక్తివంతుడైన దేవుడు తాను కూడా తప్పించుకోలేని జైలు నిర్మించగలడా?
నిర్మించగలడు కనుకే చరాచర ప్రపంచంలో బందీగా ఉంటాడు, విడుదల అవుతాడు
తాను మోయలేనంత బరువును సృష్టించి మోయగలడు కూడా,
అందుకే పేదరికాన్ని సృష్టించి బడుగులకా బాధ్యతనప్పగించాడు.

దేవతల శ్రమ తట్టలను మోయడానికే సృజించబడ్డారు మానవులు
పాపం, నల్లవాళ్ల భారాన్ని మోయాలి తప్పదన్నారు తెల్ల కిప్లింగులు
వాళ్లకు గుళ్లూ గోపురాలు కట్టి తాము గుడిసెల్లో బతికారు చానాళ్లు
దేవుడి పేర ఆక్రమణలు చేసి, ఆనక రాశారు నీతిచంద్రికలు.

రంగుతెరల వెనక రావణ కాష్ఠాలు రగులుతూనే ఉంటాయి
విభజించి పాలించేవాళ్ల మొసలికన్నీళ్లు వరదలై పారతాయి
అన్నిటిలోనూ వేలుపెట్టే పెద్దన్నలకు కణుపులు తెగుతాయి
బాబెల్స్ కట్టే నిమ్రాదుల చెవిలో దోమలు దూరి చంపుతాయి

గడ్డకట్టే చలిగాలి వీస్తున్నపుడు ముళ్లపందులన్నీ చేరాయి ఒక దగ్గరకు
ఒకదానికొకటి దగ్గరకు రాగానే ముళ్లు గుచ్చుకుని జరుగుతున్నాయి పక్కకు
ముళ్లు గుచ్చుకోకుండా, వేడి తగ్గకుండా బతకడమే సమాజం
ముళ్ల పందుల్లా కూడా బతకలేకపోతున్న మనుషులతోనే ప్రమాదం!

*****

## 5

మట్టినుంచి మానవుడిని తనరూపంలో చేసి ఊపిరినూదాడు దేవుడు
దేవుడి ఊపిరి రువాష్, సకల జీవులలో చేరి మారింది ప్రాణశక్తి– నెఫెష్!
అతుమ్ అంటే ఊపిరి, హెత్మో–ఊపిరి, ప్రాణాలకు మూలపదం
దేహమనే పంజరంలో బందీగా, ఆత్మ ఉండే కాలమే ఆయుర్దాయం.

పరిణామంతో ప్రాణం వచ్చిందా, ద్యులోకపు దేవుడిచ్చాడా అనేది కాదు ముఖ్యం
ఎందుకు మనమిలా కొట్టుకు చస్తున్నామనే దానికి వెదకాలి సమాధానం
శరీరం–జిస్మ్; ఆత్మ–రుహ్, మనసు–నఫ్స త్రిగుణత్వం
నఫ్స అనేది మానవుడి వ్యక్తిత్వం, మనస్సు, అతడి తత్వం.

రూపస్థితుల వల్ల శరీరం, ఉద్వేగ హావభావాలతో మనసు గోచరం
ఆత్మ లేదా, ప్రాణం, లేదా ఊపిరి అగోచరం, అది శాశ్వతం
కనిపించకుండానే కదిలిపోతుంది కాలప్రవాహంలా ప్రాణం
కనిపిస్తూనే కరిగిపోతుంది దేహం, దానితోపాటు మనో నేత్రం

ప్రాణమున్నంత వరకే దేహికి సత్య, కాల, ప్రదేశాలవసరం,
ఊపిరి నిష్క్రమించాక, దీపం ఆరిపోయాక ఉండదే ప్రయాణం,
చేసే కర్మకాండలన్నీ బతికున్నవాళ్లు జ్ఞాపకాలకై చేసే వ్యవహారం
ఊపిరున్నంత వరకూ పనిచేస్తాననేవాడి 'ప్రజ్ఞాత్మా' ప్రయాణమే!

*****

# 7. ప్రజ్ఞాత్మా

## 1

ప్రాణమే ప్రజ్ఞ, ప్రజ్ఞే ప్రాణం; మండించాలి అంతరాగ్నిని.
ఏదన్నా తెలుసుకోవాలంటే ముందు నిన్ను నీవు తెలుసుకోవాలి
సంభాషణకన్నా వక్తను, రచనకన్నా రచయితను గమనించు
బయటి అగ్ని వెలుగులో ఇతరులను, అంతరాగ్నిలో నిన్ను చూస్తావు.

నిన్ను నీవు తెలుసుకోవడం, మితగుణం; ప్రమత్తత వల్ల అపాయం–
ఈ మూడూ డెల్ఫి సూర్యదేవాలయ ప్రాంగణపు మహావాక్యాలు
స్పార్టా నుంచి డెల్ఫికి వచ్చాడు లైకర్గస్, ధూమాల మధ్య పలికింది పూజారిణి–
'నీ ఆలోచనలు మంచివి, ఒక్క ధనం తప్ప ఇంకేదీ నాశనం చేయలేదు స్పార్టాను'–

స్వావలంబన, పొదుపు, మితం, కఠోర శిక్షణ స్పార్టా మతమయ్యింది
ఆడా మగా తేడా లేకుండా అందరూ సైనికులే, శ్రామికులే
– 'నేను తిరిగివచ్చే వరకూ మీరు ఈ న్యాయసూత్రాలను పాటించాలి'
ప్రజలందరూ వాగ్దానం చేసాక, డెల్ఫి వెళ్లి లైకర్గస్ మరల తిరిగిరాలేదు.

సూర్యచంద్ర గమనానికే అడ్డం వచ్చేంతగా పెరిగిన పర్వతుడు
సముద్రాన్ని పుక్కిట పట్టిన అగస్త్యుడిని చూసి ప్రణమిల్లాడు వింధ్యుడు
నేను తిరిగి వచ్చేవరకు తగ్గి ఉండమని దక్షిణదేశం చేరాడు అగస్త్యుడు
సమస్యలనేవి మనం ప్రజ్ఞతో పరిష్కరించాల్సిన పర్వతాలుగా చూడు!

*****

## 2

మృతసంజీవని తెలిసిన వాడిని కూడా మృత్యువు కెరజేస్తాయి కోరికలు
'వాతాపీ అత్రగచ్ఛా' అని కేకపెట్టాడు ఇల్వలుడు, 'జీర్ణోభవ' అన్నాడు అగస్త్యుడు
సమస్యను సృష్టించే వాడొకడు, దానిని జీర్ణం చేసుకునేవాడు ప్రజ్ఞావంతుడు
మర్మస్థానాలు తెలిసిన మావటివాడి చేతి అంకుశం ఏనుగును లొంగదీస్తుంది.

గొప్పగొప్ప వాళ్ల పుట్టుకలు గోత్రాలు గోప్యంగా గమ్మత్తుగా ఉంటాయి
అగస్త్యుడు-వశిష్ఠుడు, ద్రుపదుడు-ద్రోణుడు కుంభయోని ఉద్భవులు
కుండల నుంచి పుట్టారు, సోదరి దుశ్శలతో సహా నూరుగురు కౌరవులు
గర్భస్థ పిండమార్పిడితో గట్టెక్కాడు సంకర్షణ బలరాముడు

కాలధర్మాలను బట్టి మారుతూ ఉంటాయి ప్రయోగ నాళికలు
కాలోహ్యయం నిరవధిః విపులాచ పృథ్వీ - పుడుతూనే ఉంటారు ప్రయోగశీలురూ.
ఆలోచనలతోనే పరిణామం-నేను ఆలోచిస్తున్నాను కనుక ఉన్నాను
ఆలోచించి, ఆలోచించి వేదాంతులందరూ ఆగిపోయారు అవిద్య దగ్గర

అవిద్య అనే పెంజీకటి కావల ఏకాకృతిని వెలిగేదెవరు?
ఒకరినొకరు నీచంగా చూసే పద్ధతిని మించిన అవిద్య ఉన్నదా?
మనుషులున్నారు కాని మనుషులుగా ఉన్నదెపుడు? ఏ కాలంలో?
దేవుడున్నాడో లేడో ఆ పెంజీకటి కావల, ఆ చీకటి పరిమాణమెంత?

*****

## 3

అనిచ్చ, దుఃఖ, అనత్తలను అర్థం చేసుకునేదే ప్రజ్ఞాసర్గం
శుద్ధ, చింత, భావనామయ ప్రజ్ఞల దారి విశుద్ధ మార్గం
ప్రజ్ఞ, కపటత్వాలతో మాయ, కర్మ ప్రజ్ఞలతో క్రతు ప్రతిజ్ఞ
సుషుప్తి స్థితిలో ప్రాణంతో కట్టిపడవేయబడిన ఆత్మయే ప్రజ్ఞ

మద్రభూపాలుడి కుమార్తె క్షేమ, ఖెమ అంటే రక్షణ, నిర్వాణ
ఆమె మగధరాజు బింబిసారుడి భార్య స్వర్ణమేనిఛాయ, నడిచే వీణ,
అందాన్ని లెక్కచేయని బుద్ధుడిని లెక్కచేయనన్న నెరజాణ
ఒకరోజున ఆశ్రమ అందాలను తిలకిస్తూ బుద్ధుని చూసిన క్షణాన

కానవచ్చిందామెకు తనకన్నా అద్భుత సౌందర్యవతి వింజామర వీస్తూ
ధ్యాన నిమగ్నుడై ఉన్నాడు బుద్ధుడు, నిశ్చల సమాధిలో, చూస్తూ ఉండగానే
ఆ సౌందర్యవతి వృద్ధురాలై, కంకాళమై, రేణువులై కలిసిపోయింది కాంతిలో
మనోదర్పణమెప్పుడూ మాయాదర్పణమే, ఆలోచనను బట్టి ప్రతిబింబం.

నీలి కలువ కన్య ఉత్పలవర్ణ మొదటి భర్త, తన తల్లికి ప్రియుడైనాడు
రెండవ భర్త తన కుమార్తెను భార్యగా తెచ్చుకున్నాడని తెలిసాక
ఉత్పలవర్ణకు కలిగింది సాంసారిక జీవనంపై అత్యంత విరక్తి
భిక్కునిలై క్షేమ, ఉత్పలవర్ణలు తథాగతుని ముఖ్య అనుచరులై పొందారు ముక్తి.

*****

## 4

సర్వశక్తిమంతుడు, కరుణామయుడు, సర్వవ్యాపకుడు దేవుడు,
అన్నీ తానే అయినప్పుడు దుష్కార్యాలకు హేతువేది? దుఃఖ కారణమేది?
అన్నీ తెలిసినవాడికి బాధ, దుఃఖం, కన్నీళ్లు, మరణం తెలియదా?
బాధలో కనిపించే దైవం, సుఖంలో కనిపించే దైవం ఒక్కరేనా?

జ్ఞానదేవత దివ్యులను ప్రసవించినా, పురిటినెప్పులు తగ్గలేదు ఆమెకు
ఎంతో వేదననుభవిస్తూ వెలుగులోకాన్ని వీడి వచ్చింది, మబ్బుల చాటుకు
ఆమె గర్భగుడి నుంచి బయటపడింది మాయ – డెమి అర్జ్‌గా
మబ్బులలో దాచిన ఆ మాంసపు ముద్ద మహాభూతమై పెరిగింది.

తాను స్వయంభువుననుకుని సృష్టించాడు డెమిఅర్జ్ ఏడులోకాలు
భౌతిక సంపదలను, క్రూర ప్రవృత్తిని నింపాడు ఇష్టం వచ్చినట్లు
జ్ఞానదేవత శక్తులన్నీ కప్పబడినాయి నిత్యభౌతికావసరాలతో
మనిషి మనిషికి, మనసు మనసుకు మధ్య అనంత దుఃఖం

జ్ఞానదేవత గజగజా వణికింది తన పుత్రుడి అరాచకాలను చూసి
భూదేవత కూడా గజగజా వణికింది తన పుత్రుడు నరకుడిని చూసి
అందరికీ తండ్రి దైత్యధ్వంసి కృష్ణావతారంలో కూల్చగలిగాడతడిని
అసంఖ్యాకులైన రాజుల్ని, పదహారువేలమంది స్త్రీలను విడిపించిన ఘట్టమది.

*****

## 5

రామావతారంలోని బాణపు ములికి కృష్ణావతారంలో గుచ్చుకుంటుంది
వాలిని, శంబూకుడిని చంపిన పాపం కాలి బొటనవేలిని చీల్చేస్తుంది
తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు మండుతున్న అగ్నిలాంటిది
ఎన్ని అవతారాలెత్తినా శిక్ష పూర్తయ్యేవరకు కక్ష వెంటాడుతూనే ఉంటుంది.

పిలాతె చేతులు కడుక్కున్నాక దైవకుమారుడికి శిలువ వేసినారు
దైవపదాన్ని చేతబట్టి అపొస్తలులు తలోదిక్కుకేగినారు
జీసస్ బతికి ఉన్నపుడే ద్రోహి యూదా ఉరివేసుకున్నాడు
మనుషుల జాలరులు పీటర్, ఆంద్రూ సోదరులు శిలువ నెక్కినారు.

జేమ్స్ తల పగలగొట్టి చంపారు; బార్తొలూమ్యూను తోలు వలిచి తల నరికారు
ఫిలిప్‌ను ఉరిదీసారు, జేమ్స్ జెబెడికి తలనరికారు, మాథ్యూను చంపేసారు గొడ్డలితో
డౌటింగ్ థామస్‌ను ఇండియాలో పొడిచి పొడిచి చంపినారు ఈటెలతో
సైమన్‌కు శిలువ, థాడ్యూస్‌కు బాణాల దెబ్బలు, సహజంగా చనిపోయింది జాన్ ఒక్కడే!

సెయింట్ లారెన్స్ అనే రోమ్ చర్చి డీకన్‌ను ఇనుపకడ్డీలపై కాల్చినారు
ఈపక్క బాగానే కాలింది, రెండోపక్కకు తిప్పమన్నాడతడు చనిపోతూ!
లారెన్స్ స్పానిష్ దేశస్థులే వెయ్యేళ్ల తరువాత 'ఇంకా' ప్రభువుల కాళ్లకింద
కట్టెలు కాల్చి మంటలు పెట్టారు స్వర్ణం కోసం – యదేవేహా!

*****

# 8. యదేవేహ తదాముత్ర యదా ముత్ర తదాన్విహ

## 1

ఇక్కడ ఉన్నదే అక్కడా ఉన్నది, అక్కడ వున్నదే ఇక్కడ ఉన్నది
ఇక్కడేమీ లేదు, ఇది ఒట్టి మాయైతే, అక్కడ ఉన్నదీ మాయేనా?
చినమాయను పెదమాయ, పెదమాయను పెనుమాయ, పెనుమాయను
తిమి మింగితే, తిమిని మింగే తిమింగలమే పెంజీకటి కావలి వెలుగా?

'ఇక్కడ వెలుగు ప్రసరించును గాక' – అని చీకట్లో బాణం వేసాడు దేవుడు
బాణం దీపాలయ్యాక తనను తాను చూసుకున్నాడు మళ్లీ మళ్లీ
ఏమీ కనబడలేదు, తనకే తాను కనబడనప్పుడు, కనపడాలనే కోరిక ఏమిటి?
అందుకని తనను తాను మథించి, సృజించాడు చరాచర ప్రపంచాన్ని

ఉన్నది తానొక్కడే, చేయడానికింకేమీ లేక జారుకున్నాడు యోగనిద్రలోకి
దూరం నుంచి సముద్రపు అలలు కనిపిస్తాయి వేలాది పాము పడగల్లా
సముద్రము అతడే, మహా సర్పమూ అతడే, సర్వమూ అతడే
అతడి నాభి నుండి వెలువడింది తామరతూడు, దాని చివర సహస్రదళ పద్మం

పద్మమూ అతడే, విశ్వవిహంగమూ అతడే, హిరణ్మయ గర్భుడూ అతడే
స్వయంభువుగా ప్రవేశించాక బద్దలయ్యింది బంగరు బ్రహ్మాండం
చతుర్ముఖ బ్రహ్మకు ఏమీ అర్థం కాలేదు, చుట్టూ బంగరు పద్మపు రేకలు
లోతు తెలియరాక ధ్యానించగా, తన హృదయంలోనే కనిపించాడు పరంజ్యోతి రూపుడు

*****

## 2

తనలో ఉన్న సూక్ష్మజ్యోతి, విశ్వపు పరంజ్యోతి ఒక్కరే అన్నది బ్రహ్మజ్ఞానం
ఆ బ్రహ్మకు మానసపుత్రులు పదహారుగురు, పుత్రిక శతరూప;
బ్రహ్మజ్ఞానం కలిగాక ప్రణవశబ్దం నుంచి సృష్టించాడు వాక్కును
వాగ్దేవతను అనంత సరస్వతీ ప్రవాహంగా మలచి చేసాడు తన వాణిగా.

తొలి మానవుడు యముడు ఇతడి కవల సోదరి యమి, ఇద్దరూ ఒకరే
అక్కడ తొలి మానవుడు ఆదాము, అతడి పక్కఎముక ఈవ్, ఇద్దరూ ఒకరే.
అర్ధనారీశ్వర స్వరూపం అర్ధమైతే యిన్-యాంగ్ లర్ధమవుతాయి
అమరత్వం నుంచి ఆయుర్దాయం వేపు నడక అవగతమవుతుంది.

అగ్నిసూక్త కర్త అంగీరసుడు; అనసూయాదేవి భర్త అత్రి;
కుబేర, రావణుల తాత పులస్త్యుడు; దేవాసురుల తాత మరీచి;
కింపురుషుల తండ్రి పులహుడు; క్రతు, భృగు, వసిష్ఠ, దక్ష
నారద, చిత్రగుప్త, కర్దమ, హిమాలయ, సనకాది కుమారులు నలుగురు.

వీళ్లందరూ మానసపుత్రులు కాబట్టి ఎవరెప్పుడు పుట్టారనేది కాదు ముఖ్యం
మత విశ్వాసం, తత్వచింతన హిందూ జనజీవన స్రవంతిలో భాగం
ఎంత నరికినా చావని కులగోత్ర ఉచ్ఛనీచ ప్రాముఖ్యం
ఈ వేదజ్ఞానంలోనే నిర్వేదం, 'ఇక్కడ ఉన్నదే అక్కడా ఉన్నది'.

*****

## 3

అందరికీ అన్నీ ఇచ్చేస్తున్నావు నాన్నా, నన్నెవరికిస్తున్నావన్నాడు నచికేతుడు,
మూడుసార్లు రెట్టించేసరికి 'నిన్ను మృత్యువుకిచ్చేస్తా, పో' అన్నాడు తండ్రి
మూడు రోజులు తన గుమ్మం ముందున్నందుకు మూడు వరాలిచ్చాడు మృత్యువు
కోపాగ్ని, జఠరాగ్ని మరణాగ్ని రహస్యాలను మృత్యుముఖాన తెలుసుకున్నాడు నచికేతుడు

ధాన ధర్మాలు స్వీకరించడానికి అలవాటు పడితే పనిచెయ్యబుద్ధి కాదు
దొంగ స్వాములకు, ఆషాఢభూతులు శిష్యులైతే నిరంతర సంశయవాదాలే
పనిచేసే వాళ్లందరూ నీచకుల సంజాతులై పనికిమాలిన వారవుతారు
ధర్మపన్నాలు వల్లించే దెయ్యాలు మాటలమ్ముకుని శ్రమను దోచుకుంటారు.

శ్రమ చేసేవాడికి తెలుస్తుంది కత్తి అంచుపై నడిచేవాడి కష్టం
శరీరమనే బండి తోలే సారథికి, బండిలో కూర్చున్నవాడికి సయోధ్య ముఖ్యం
సారథి, రథికుడు ఒక్కడే అయినపుడు జాగ్రత్తగా నడపాలి రథాన్ని
గర్భిణీ స్త్రీలు గర్భాన్ని రక్షించుకున్నట్లు, జీవాగ్నిని అరణులతో కాపాడుకోవాలి

వెలుగు దేవుడికి కూడా ముందాలోచన ఇష్టముండదు
పండొరా కిచ్చిన కలశంలో ఏమున్నాయో ఎవరూ చెప్పరు.
అన్నీ తెలిసినవాడు అమాయకురాలిలో పెంచుతాడు కుతూహలం
మూత మూసేలోపు బయట పడ్డాయి, వ్యాధులు, ముసలితనం, మృత్యువు

*****

## 4

అందరికీ కావాలి యవ్వన జలధారలూ, కల్పవృక్షాలూ, కామధేనువులూ.
పట్టుకున్నదల్లా బంగారమయ్యే 'మిదాస్' స్వర్ణస్పర్శలూ.
పరశువేది నీ దగ్గర లేదా, పద వెదుకుదాం యురిమ్, థుమ్మిమ్‌లు
ప్రతి వరంలోనూ అంతర్గత శాపంలా దాగి ఉంటాయి విష సర్పాలు.

వానర-మత్స్య మెర్‌మెయిడ్ (సముద్రకన్య) 'నింగ్యో' తెస్తుంది యుద్ధాలు, సునామీలు
ఓ జాలరి వేసిన హార్పూన్ తగిలి నింగ్యో మాంసం ముక్క హార్పూన్ కంటుకుంటుంది
దానిని తిన్న జాలరి కూతురు బతికింది ఎనిమిది వందలేళ్లు
ఎందరో భర్తలు, పిల్లలు కళ్లముందే చనిపోగా బౌద్ధ భిక్కునిగా పొందింది నిర్వాణం

అమృతం, ఆంబ్రోసియా, బంగరు ఏపిల్స్, శాశ్వత పీచ్ ఫలాలు,
దేవతల సోమలత, గిల్గామేష్ మృత్యులత, తావొయిస్టుల సిన్నబర్
– పాదరసమున్న హువందన్‌ను అమృతమని తాగి మృత్యులైన టాంగ్ చక్రవర్తులు
లింగ్‌షి పుట్టగొడుగులు, ఫీనిక్స్ పక్షుల్ని తిని మరణాన్ని జయించాలనే వృథా తపనలు.

నెక్-మృత్యువు, తర్-జయించడం అదే నెక్తార్; న-మృతో-అమృతం
చైనా మొదటి చక్రవర్తి క్విన్‌షి 'హువాంగ్' జీవజలాన్వేషణ ఫలించలేదు
క్రీస్తు రక్తాన్ని స్వీకరించిన పవిత్ర కలశం 'హోలీ గ్రెయిల్' ఎంత వెదికినా దొరకలేదు
స్టాలిన్ కోసం అలెగ్జాండర్ బొగొమొలెట్ ఆయుర్దాయ పరిశోధనలు ఒక కొలిక్కి రాలేదు.

*****

## 5

ఏమిటీ జీవితం? దేనికోసమీ తండ్లాట? బతుకును వదలవెందుకీ బరువులు?
కొండపైన ఉండని బండరాయిని నిరంతరం తోసుకుంటూ పోయే 'సిసిఫస్' కష్టం
నోటి దగ్గరకు వచ్చిన నీరూ, ఆహారం తినలేని 'టాంటాలస్' దురదృష్టం
అన్నీ పాతకర్మల ఫలితాలేనా? ఈ శాశ్వత శిక్షల నుంచి విముక్తి ఎప్పుడు?

అశ్వత్థామ చిరంజీవి కావచ్చు, కలియుగాంతం వరకు తిరుగుతూనే ఉండాలి
ప్రజల పాపాలు తన దేహపు సలుపుతున్న పుండ్ల నుండి స్రవిస్తుండగా!
శిలువను మోస్తున్న జీసస్‌ను 'నడువు, నడువు' అని సతాయించాడు కార్టొఫిలిస్
'నేను మరల వచ్చేవరకూ ఇలా తిరుగుతూనే ఉండు' అన్నాడా సంచారయూదుడిని క్రీస్తు

జియుశుద్రుడు, అత్రాహాసిస్, ఉత్నాపిస్తిమ్‌లకు లభించింది అమరత్వం
జల ప్రళయాన్ని దాటినా అమరత్వాన్ని అంటుకుని వచ్చింది ఒంటరితనం
ఎండెమియాన్ అమరుడే కాని ఏం లాభం, శాశ్వతనిద్ర అతడికి శాపం
టిథొనస్, వొలుంబా వొలుంబా, ముగ్గురు నెఫైట్ల ముదుసలి జీవనం

కౌంట్ సెయింట్ జర్మన్, సర్ గలహద్, మంత్రవేత్త మెర్లిన్, నికొలాస్ ఫ్లామెల్,
సప్త చిరంజీవులు – మార్కండేయ, బలి, విభీషణ, అశ్వత్థామ, కపాచార్య, వ్యాస, పరశురాములు
కొన్ని కథలు, కొన్ని కథనాలు, ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు
అక్కడ ఉన్నదే ఇక్కడ ఉన్నది – అమరత్వం కావాలన్నదే, అన్యద్ ఏవ తద్ విదితమ్

*****

# 9. అన్యద్ ఏవ తద్ విదితమ్ అథో అవిదితద అపి

## 1

మనకు తెలిసిన దానిలో దొరకడు, మనకి తెలియని దానిలోనూ లేడు
ఏమిటది? ఎవరిచేత మనసులో ఈ ఆలోచనలు పరుగులిడుతున్నాయి?
ఎవరు, దేనివల్ల ఈ ప్రాణం, ఇంద్రియ వ్యాపారాలు సజావుగా సాగుతున్నాయి?
అగ్ని, వాయువు, ఇంద్రులకే కానరాని ఆ పరబ్రహ్మ శక్తి ఎవరు?

గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరం గురుసాక్షాత్ పరబ్రహ్మం,
'గు' అనే చీకటిని 'రు' తొలగించే వెలుగు, ఆ గురుశక్తిదేనా ధర్మం?
తొలి వెలుగు నుంచి పుట్టిన గురు బృహస్పతి, అతడి వింటినారి ఋతం
సత్యస్థాపిత దివ్యయానాన దర్శిద్దాం, సత్యమేవ జయతే, నానృతం!

ఋతం అనేది గతి, సంఘటన, నియతిల సమాహార స్థితి
ఋత రథపు సారథి వరుణుడు వానదేవుడు సముద్రాధిపతి,
ప్రపంచాన్ని చుట్టివుండే దివ్య సముద్రాన్ని ఋతంతో బంధిస్తాడు
మకరంపై సంచరిస్తూ పాశహస్తుడై విశ్వనియతి నిర్దేశకుడు

వరుణుడిని స్నేహంతో బంధించిన వాడు 'మిత్రుడు' – ఇద్దరూ ఆదిత్యులే.
మిత్రా–వరుణుల్లాంటి మరో జంట స్నేహితులు నర నారాయణులు.
వారి తపస్సు భగ్నం చేసేందుకు రంభ మేనక, తిలోత్తమలు
తొడనుంచి పుట్టిన ఊర్వశిని చూసి తొలిగాయి ఇంద్ర భ్రమలు.

*****

## 2

–'ఇంద్ర పదవి మాకక్కర్లేదు, ఊర్వశిని కూడా నీకే ఇస్తున్నాం' అన్నారు వాళ్లు
నర నరాయణుల ఔదార్యానికి తలవంచిన ఇంద్రుడి కంట కన్నీళ్లు
తొడలు చరిస్తే మనకి మిగిలేది మంట, ఊర్వశి వెళ్తుంది ఎదుటివాడి వెంట.
ఊర్వశిని చూసిన మిత్రావరుణులకు స్ఖలనమై పుట్టారు అగస్త్య వశిష్ఠుల జంట

బ్రహ్మమానస పుత్రుడైన అత్రి మహాముని భార్య అనసూయాదేవి
త్రిమూర్తులను పసిపిల్లల్ని చేసి ఊయలలూపిన మహాసాధ్వి
శైవాంశ దూర్వాసుడు, వైష్ణవాంశ దత్తాత్రేయుడు, బ్రహ్మాంశ చంద్రుడు
గురువు భార్య తారతో చంద్రుడు కలిస్తే పుట్టాడు బుధుడు

బుధుడు–ఇలాదేవి కుమారుడు ప్రయాగ (ప్రతిష్ఠాన) ప్రభువు పురూరవుడు
పురూరవుడు ప్రేమించాడు ఊర్వశిని – అదో గొప్ప ప్రేమకథ
ఈ చంద్రవంశపు రాజులే యాదవ, కౌరవ, పాండవులు
బుధుడి భార్య ఇలాదేవి తల్లిదండ్రులు శ్రాద్ధాదేవి, వైవస్వత మనువులు.

వైవస్వతుడి తండ్రి వివశ్వనుడు (సూర్యుడు), తల్లి శరణ్య
సూర్యుడి తల్లిదండ్రులు అదితి–కశ్యపులు; కశ్యపుడి తండ్రి మరీచి
మరీచి బ్రహ్మమానసపుత్రుడు. మరీచి భార్య కళ
వైవస్వతుడి కుమారుడు ఇక్ష్వాకుడు, సూర్యవంశపు పాలకుడు.

*****

# 3

మానసపుత్రులతో ఇదే గొడవ, మనం చెప్పేది వినరు, వినాలనుకున్నది చెప్పరు.
వశిష్ఠుడూ అంతే. మొదట బ్రహ్మమానసపుత్రుడతడు
దక్షయజ్ఞంలో చనిపోతే బ్రహ్మ బతికించగా రాజగురువైనాడు 'నిమి'కి
పరస్పర శాపాలతో 'నిమి' నిమేషుడైతే, వశిష్ఠుడు మిత్రావరుణుల వీర్యమైనాడు.

అగస్త్యుడితో పాటు కుండలో పుట్టినవాడు వశిష్ఠుడు; అతడి భార్య అరుంధతి
వారి కుమారుడు శక్తి; శక్తి, అదృశ్యంతిల కుమారుడు పరాశరుడు
మత్స్యగంధితో వ్యాసుడిని కని పరాశరుడు ఆమెను చేసాడు యోజనగంధిగా
ఆ తరువాత యోజనగంధి వివాహమాడింది శంతన మహరాజును సత్యవతిగా.

అంతకు ముందే శంతన మహరాజు–గంగకు దేవరాతుడనే కొడుకు
సత్యవతి కొడుకులదే రాజ్యం, నేను పెళ్లి చేసుకోనని ప్రతిజ్ఞ చేసి భీష్ముడైనాడతడు
ఆమె కొడుకుల్లో చిత్రాంగదుడు ముందే చనిపోయాడు, మిగిలింది విచిత్రవీర్యుడు
కాశీరాజు కుమార్తెలు అంబిక, అంబాలికలనిచ్చి పెళ్లిచేసాడు భీష్ముడు

పెళ్లైన ఏడేళ్లకు పుత్రులు లేకుండానే పుటుక్కుమన్నాడు విచిత్రవీర్యుడు
ఇంత రాజ్యం ఏం కావాలి, సత్యవతి తలుచుకుంది మొదటి కొడుకు వ్యాసుడిని.
కార్యం రోజు కళ్లు మూసుకున్న అంబికకు పుట్టాడు అంధ ధృతరాష్ట్రుడు
పాలిపోయిన అంబాలికకు పాండురాజు, పరిశ్రమ అనే దాసికి జన్మించాడు విదురుడు.

*****

## 4

'నేను చెబుతూనే ఉంటాను, నీవు గంటమెత్తకుండా వ్రాస్తూనే ఉండు'
అన్నాడు వేదవ్యాసుడు తన వ్రాయసకాడైన గణేశుడితో.
అలా పూర్తయ్యాయి, జయ భారతం, ఉపనిషత్తులు, అష్టాదశ పురాణాలు
తన వంశ కథను ఓ పెద్ద ఇతిహాసంగా మలచిన ఏకైక రచయిత వ్యాసుడు.

తెలిసిన దానిలో దొరకనిది, తెలియని దానిలో దొరికేట్టు చేస్తుంది పుస్తకం
పుస్తకమనేది అవిద్య, విద్యల మధ్యన ఇంద్రధనుస్సు వంతెన
చైనా మొదటి చక్రవర్తి 'క్విన్‌షి హువాంగ్', అతడి మంత్రి 'లిషి'
మోసం చేసిన రసవాదుల్ని సజీవంగా పాతిపెట్టి, దహనం చేసారు పుస్తకాలను.

'నేను సర్వం సహా చక్రవర్తిని, నా పాలన ఇతరుల పాలనతో పోల్చరానిది
చరిత్ర నాతోనే మొదలవుతుంది, నా మాటే శాసనం, నా ఆజ్ఞలే ప్రామాణికం'-
నాలుగు వందల అరవైమంది పండితులను చేసారు సజీవ సమాధి
వేలాది పుస్తకాలను, జ్ఞాపికలను చేసారు అగ్నికి ఆహుతి.

కాలం దగ్గర పడేసరికి చక్రవర్తికి పట్టుకున్నది ప్రాణభయం
పాదరసపు కషాయాలు పనిచెయ్యలేదు, వెయ్యేళ్ల వృద్ధుడు అంక్విషెంగ్ ఆచూకి దొరకలేదు
దాక్కోవడానికి రెండు వందల భవనాలు నిర్మించుకున్నా మృత్యువు విడిచిపెట్టలేదు
చైనా గోడను కట్టి చక్రవర్తిగా బతికినవాడి సమాధి రహస్యాలింకా పూర్తిగా బయటపడలేదు.

*****

## 5

అక్షరాన్ని అణచివేయడం ఏ రాజ్యానికీ, ఏ దేశానికీ కొత్తకాదు
'నీకు తెలియదు, నోరు మూసుకో' అనేది సాధారణ మహావాక్యం
నూరు ఆలోచనలు మొలకెత్తడం, వేల పూలు వికసించడం, నియంతల కిష్టముండదు
సరస్వతీ ప్రవాహాన్ని అజ్ఞానపు ఎడారుల్లో ఆసాంతం ఇంకింపచేస్తారు.

నెస్టోరియస్, అరియన్ వ్రాసిన తొలి క్రైస్తవ రచనల్ని మంటల్లో పడేసారు
ఇరవై నాలుగు గుర్రపుబళ్ల తాల్ముడ్ గ్రంథాలను తగలబెట్టారు ఫ్రెంచివాళ్లు
అజ్టెక్, మాయన్ వ్రాతప్రతులను స్పానిష్ వాళ్లు, కాథలిక్కుల పుస్తకాల్ని ప్రొటెస్టంట్లు
మార్క్స్ పుస్తకాలను నాజీలు, సాంస్కృతిక చైనీయులు వాళ్ల పాత గ్రంథాల్ని

ఖాండవ వన దహనంలా పుస్తకవన దహనాలు, వెర్రెత్తినట్లు తగలబెట్టడమే
అక్షరాలు కార్చే కన్నీళ్లకు రచయితల ఆత్మలు క్షోభిస్తాయి.
ఆడంబరాలను చలిమంటలో పడవేయాలన్న భావనతో కాలిపోయాయనేక కళా ఖండాలు
'గిరొలామొ సవొనరొలా' శిలువపై కాల్చివేయబడ్డాడు తాను తగలబెట్టిన వస్తువుల్లా

తొంభైలక్షల పుస్తకాలను తగలబెట్టాడు బఖ్తియా ఖిల్జీ నలందా విశ్వవిద్యాలయంలో
అలెగ్జాండ్రియా, బాగ్దాద్, తింబుక్తు, కైరో, శ్రీలంక, వార్సా, ఆఫ్ఘనిస్తాన్,
అన్ని కాలాల్లో అన్ని యుద్ధాల్లో మేధావుల్ని చంపు, అక్షరం గొంతు పిసుకు
మనకు తెలిసిందే నిజం, తక్కినదంతా తగలబెట్టడం – ఏ సాత్ ఆత్మా!

*****

# 10. ఏ సాత్ ఆత్మాంతర్యామ్య మర్త్యః

## 1

అతడుంటాడు కాని ఉన్నట్లు తెలియదు, అన్నిటికీ సాక్షీభూతుడు
కనిపించకుండా కర్త కర్మ క్రియలకు కావలివాడు, ఆవలివాడు
అంతశ్చేతన, అవగాహనా శక్తి, స్మారక స్థితుల రూపస్థితుడు
ప్రార్థనలతో ప్రత్యక్షమై అద్భుతాలను సృష్టించే సర్వవ్యాపకుడు

ఇది నా తొలి అడుగు, విరిసిన పద్మవదనాన విద్యుత్ వెలుగు
దుఃఖాన్ని చూసి ధ్యాన నిద్రలోనున్న నాపై నిలబడింది వృక్షపు నీడ
గాలిలో నిశ్చలమైన శిరోజాలు, ప్రవాహానికెదురీదిన స్వర్ణపాత్ర
అడుగో యాసుడు, ఇక్కడ ఉరుము సర్పపు తగ్గిన ఉధృతి

గాలిలో తేలగలిగినవాడు, వానలో తడవకపోవడం వింత కాదు
అంగుళ మాలి పరిగెడ్తూనే ఉన్నా ఆగివున్న బుద్ధుడిని చేరలేడు
క్షేమ నడుస్తూనే ఉన్నది తన ప్రతిబింబ నిర్వాణాన్ని చూస్తూ
అద్భుతాలన్నీ అంతే, అంతర్యామి కలిగించే పొగమంచు చిత్రాలు

కొరియాలో సిల్లా ప్రభువు 'బియొఫెయుంగ్'కు కొత్తదారి తెలుసు
అద్భుతాలు జరిగితేనే అక్కడి పెద్దలు అంగీకరిస్తారు
ఇఖడాన్ మంత్రి తెగిన తల ఎగిరింది వంద అడుగుల ఎత్తు
రక్తపు వర్షం కురిసాక శాంతి మతపు ద్వారం తెరుచుకుంది.

*****

## 2

ఎక్కడున్నావు నీవు? డమాస్కస్ దారిలో మెరుపు మెరిసింది?
–'మూడు రోజులు అంధుడిగా వంపులు లేని దారి పక్కన ఇంటిలో'–
టార్సస్ ప్రాంతపు 'సాల్' కళ్లు తెరచుకున్నాక కనిపించింది కొత్తదారి
మాట్లాడే పెదాలను, ధిక్కరించే శిరస్సును భరించలేరు 'నీరో'లు

బాప్టిస్టు జాన్, అపోస్తలూ పాల్‌గా మారిన సాల్ ల తెగిన తలలు
దైవవాక్య నిర్మాణ సముద్రపు తొలి హోరులో ఎగసిపడిన అలలు
ఎవరూ మిగలరు అపోస్తలులు, 'నీరో'లు, సీజర్‌లు, ఇస్కందర్‌లు
అంతటా వ్యాపించే అదృశ్య భావనలా, మిగిలేవి కరుణా వల్లరులు

అతడు పఠించాడు దేవుడు తనకు తెలియజేసిన వాక్యాలను
చంద్రుడు రెండుగా చీలడం చూసాడు, అందరికీ తెలియజేసాడు
ఇస్రా–మిరాజ్ ప్రయాణాలతో ఏడు స్వర్గాలను సందర్శించినాడు
అతడక్కడే ఉన్నాడు కాని కత్తులు దూసిన వాళ్లకు కనిపించలేదు.

అతడు నీడ నివ్వని కాంతి, అబు జాల్ చేతులు తాకలేని మెరుపు
సంచార అరబ్బు తెగలను ఏకం చేసి, ప్రపంచ విజేతలను చేసిన గెలుపు
కనిపించకుండానే కదలికలను నియంత్రించే అంతర్గత శక్తి
లోపలికి వెళ్లడం, బయటకు రావడం, ఎక్కడో ఆగిపోయి ఇంకెక్కడో వెలగడం.

*****

## 3

భ్రమ, భ్రమణాల ఇంద్రజాలం మధ్య అంతర్లోక ప్రయాణం,
ఆత్మను పరిశుద్ధి చేసే జలధార, జ్యోతిపుంజం ఎక్కడుంది?
దేహంలో చేరినందుకు ఆత్మ మలినమయ్యిందా, ఎక్కడ ఆ ద్వారం?
ద్వారపాలకులు, దరవేషులను నియమించి నియంత్రించే వారెవరు?

అతడిని చూస్తూనే ఉండు, నీకు కనిపించకపోయినా, అతడు చూస్తూనే ఉంటాడు
రా! ఈ ఉన్ని వస్త్రాన్ని ధరించు, నీ స్వచ్ఛతపై ఒక పలచని పొరలా,
స్మరిద్దాం, మననం చేద్దాం, తరిద్దాం ఆ అద్భుత పవిత్ర నామాన్ని
ధికర్–స్మరణం; మురఖబా–ధ్యానం; సమా–వలయ నృత్యాలతో విశేషంగా

ఇస్లాం, ఇమాన్, ఇహసాన్ – విధేయత, విశ్వాసం, పరిపూర్ణ సౌందర్యం
ఓ అద్భుత, సుందర, అలౌకిక ప్రపంచాన్ని సృష్టించే భావనా త్రయం
కనిపించని అతడి ఆశీస్సుల కమనీయ బరకా ప్రవాహం
పూర్ణ చంద్రవదన కాంతి రజబ్, షబన్, రమదాన్ ప్రకాశం

నీ వ్యక్తిత్వం నీది, నీ హృదయం నీది, పరమాత్మ నీవాడు
ఈ వ్యక్తిత్వం అందరిది, హృదయ వేదన అందరిది, పరమాత్మ అందరివాడు
అవన్నీ ద్వారం దాటినాక అందరికీ అందనివాడి రాజ్యానివి
అతడుంటాడు కాని ఉన్నట్లు తెలియదు, చూస్తూనే ఉంటాడు చూపుకందదు.

*****

## 4

ఏమీలేని చోటు నుంచి వచ్చి ఏమీ లేని చోటుకు పోతున్నామా?
అపరిగ్రహ, అనుపాదాన బంధరహిత స్థితి మరణమా, విముక్తమా?
లేక, అన్నీ ఉన్నచోటు నుంచి వచ్చి అన్నీ ఉన్నచోటుకు పోతున్నామా?
అన్నీ ఉన్న చోటున ఉండే సంపాదనలు, బంధాలు శాశ్వతమా?

ఎటు నుంచి వచ్చి, ఎటు నుంచి పోయినా నడుమ కనిపించేది ఏ స్థితి?
దీనికో అంతర్గత విలువ, అర్థం, గమ్యం ఉన్నాయా, ఉంటే ఏమిటవి?
ద్వారం వెలుపల ఏమీలేవు సరే, లోపల అన్నీ ఉంటే దోషమేమిటి?
అన్నీ ఉన్న స్థితి 'మిథ్య' ఎలాంటిది, అన్నీ లేని సంపూర్ణమెలాంటిది?

ఉన్నదే వాస్తవం, కనబడనిదంతా కనికట్టుగా తోచేదేమిటి?
నీ శక్తికి సాధ్యమైనంత, నీ అవసరానికి సరిపడినంత, సరిపోతుందా అందరికీ?
నూరు పుష్పాలు వికసించకుండా, ఒక్క పూవే దిక్కుల్ని కమ్మేస్తుందా?
ఏదీ నీ స్వంతం కానపుడు ఆలోచనలు, ఉద్వేగాలు నీ స్వంతమనేది ఉంటాయా?

అందరిలో ఒకడిగా ఉంటావా? ఒకడివే అందరివీ లాక్కుంటావా?
అందరికీ సమాన హక్కులూ, సమాన అవకాశాలుంటే ఆక్షేపణలెందుకు?
నీ శ్రమ, కలలు ఉమ్మడి సొత్తైతే స్వేచ్ఛ పంజరంలా కనిపిస్తుందా?
భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక స్థలాలను కలిపే దారేదన్నా ఉందా?

*****

## 5

ఆ దారి కేవలం దృక్పథం కాదు, అది దావో పథం
సహజం, శాశ్వతం, నామరహిత, వర్ణనాతీత, అప్రయత్న కృత మార్గం
'తెహ్' శక్తితో చేసే సహజ చర్య, వు-వెయి - ఉద్దేశ రహిత క్రియ
అందరికీ తెలిసిన దారి 'దావో' దారి కాదు, అది కనిపించేదీ కాదు.

ఏమీ చేయకుండా ఏ పరిపాలకుడుండగలడు? అది సాధ్యమేనా?
అద్దంలా కాంతిని ప్రతిఫలిస్తూ నిష్క్రియా పరుడయ్యేవాడెవడు?
ఖాళీ మనోఫలకాన్ని (తబులరస) తమతో తీసుకువచ్చే వారెందరు?
దైవజ్ఞానంతో నిండిన పలకపై మన తలరాతలు వ్రాస్తున్నామా?

స్వచ్ఛత, అమాయకత్వపు 'ఫిత్రా'తో జన్మిస్తాడు ప్రతి మనిషీ.
ఉలి తాకని శిల, కత్తి తగలని కొయ్య, సానబట్టని వజ్రమతడు
కరుణ, పొదుపరితనం, నమ్రత కనిపించని దారిని చేస్తాయి కాంతివంతం
ఏ దారిలో నడిస్తే నీకు సహజంగా అనిపిస్తుందో అదే నీవు నడవాల్సిన దారి

యిన్-యాంగ్ శక్తుల మైత్రి, ప్రకృతితో సమతుల్యత దావో పథం
రెన్, లి, ఝి - దయ, నడవడి, ధర్మబుద్ధి, పెద్దలపై ప్రేమ కన్ఫూషియస్ మతం
బుద్ధం, ధర్మం, సంఘం ల దారిలో దుఃఖాన్ని జయించడం బౌద్ధ ధర్మం
అందరిలో, అన్నిటిలో ఉండి సర్వం నియంత్రించేది సయశ్చాయం పురుషే!

*****

# 11. సయశ్చాయం పురుషే, యశ్చాసావా ఆదిత్యే స ఏకః

## 1

పురుషుడిలోనూ, సూర్యుడిలోనూ, ఉండేవాడు అతడొక్కడే, ఎవరతడు?
అన్నం నుంచి ప్రాణం, మనస్సు, విజ్ఞానం, ద్వారా ఆనందాన్ని చేరుకునేదెవరు?
ఆనందంలో జనించి, జీవించి, లీనమవడమే ఈ జన్మ ఉద్దేశమా?
సచ్చిదానంద స్వరూపుడికి ఆనందమనే గుణాన్ని ఆపాదించగలమా?

ఆనందమనే నీలిపిట్ట హరివిల్లుపై ఎగురుతున్నది
అది మూడు కాళ్ల బంగారు కాకిలా మనముందుకు వచ్చింది
సూర్యుడి లోయలో తూర్పు గడప దగ్గర ఉన్నదో ఎర్ర మల్బెరీ చెట్టు
ఫు సాంగ్ అనే ఆ చెట్టు శాఖలకున్నాయి అసంఖ్యాకమైన నోళ్లు

ఆ చెట్టులో నివసించేను షిహె (Xihe) పది సూర్యుళ్ల తల్లి
ఒక్కొక్క సూరీడు ఒక్కో మూడుకాళ్ల బంగరు కాకి
రోజుకొక్క సూరీడు కాకి వెళ్తుంది తూర్పునుంచి పడమరకి
దిరి, చున్ షెంగ్ అనే శాశ్వతపు గడ్డి రకాలు ఏపుగా పెరిగేను భూమిపై

ఆ గడ్డి ఇష్టపడి నేలపై దిగకుండా, తల్లి కట్టింది కాకుల కళ్లకు గంతలు
ఆకలేసి ఒకప్పుడు పది సూర్యుళ్లొక్కసారిగా నేలమీద వేసాయి గెంతులు
వాటి వేడికి గడ్డీ కాలిపోయింది, గడ్డితోపాటు నేలమీది జీవరాశి
'హౌయియి' విలుకాడు తొమ్మిదింటిని కూల్చి, ఒక్క సూర్యుడినుంచాడు నింగిపై

*****

## 2

పది సూర్యుళ్లు నేలమీద తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు ఒక్కుమ్మడిగా
తొమ్మిది సూర్య కాకుల్ని కూల్చినందుకు హౌవొయికిచ్చారు జీవజలపాత్ర
సాటిలేని విలుకాడు హౌవొయి భార్య అందాల చంద్రిక 'ఛాంగె'
హౌవొయికున్న అనేకురు శిష్యుల్లో పెంగ్‌మింగ్ గురువును ముంచినవాడు

గురువు హవొయి వేటకెళ్లగానే దొంగిలించబోయాడు జీవజల పాత్రను
పెంగ్‌మింగ్ కందకుండా తానే తాగేసింది కొంత జీవజలాన్ని 'ఛాంగె'
ఎవరికీ అందకుండా భారరహితమై దాక్కుంది చంద్రుడి ఇంటిలో,
ఆమెకు తోడున్నదల్లా ఓ చక్కని కుందేలు ఆ చంద్రుడి నేలలో

గురుశిష్యులు హవొయి–పెంగ్‌మింగ్‌ల మధ్య జరిగింది పెద్ద యుద్ధం
విలువిద్యలో ఓడిపోయిన పెంగ్‌మింగ్ చేతబట్టాడు పీచ్ చెట్టు దుడ్డుకర్ర
దారికాచి సూర్యకాకిని కొట్టాడు చావుదెబ్బ గ్రహణంలా పట్టి
ఛాంగె చావగొట్టింది పెంగ్‌మింగ్‌ను, జీవజలంతో బతికించింది హవొయిని.

సాక్షాత్తూ బలిచక్రవర్తి కన్నా పెద్దది వామనుడి మూడో అడుగు
బలి చక్రవర్తిలో ఉన్నది, బడుగు వామనుడిలో ఉన్నదీ అదే వెలుగు
నీవు తొక్కేసిన బలి ఇంటికి నీవే కాపలా కాస్తావు
మూడు కాళ్ల బంగరు కాకిలా ముల్లోకాలకూ వెలుగునిస్తావు.

*****

## 3

విశ్వమూ నేనే విశ్వవిజేతనూ నేనే, నేనే మూడుకాళ్ల సువర్ణ సూర్యకాకిని
నేనే అన్నము, నేనే చేతన, నేనే దృశ్యాదృశ్య జగత్తును
అన్న, ప్రాణ, మనో, విజ్ఞాన, ఆనందమయ రూపుడను
ఓ ప్రభూ, మాపై దయ ఉంచి దైనందిన అన్నాన్ని నీవే ప్రసాదించుము

అన్నములో ఉన్నది, ఆదిత్యుడితో ఉన్నదీ, అన్నిటిలో ఉన్నది నేనే!
అన్నమును ఇతరులకిచ్చువాడిని రక్షిస్తాను, పారవేయువాడిని భక్షిస్తాను
అందరికీ అన్నమిచ్చే దారి కనిపించనిది, రూపరహితమైన రూపం
'వూజి' శూన్యస్థితి నుంచి 'తైజి' ఏకత్వం, దాని నుంచి యిన్-యాంగ్‌లు ద్వైతం

యిన్-చీకటి, యాంగ్-వెలుగు నుంచి ఏర్పడ్డాయి సమస్తం
ముందు ఎంత పెద్దదో వెనకా అంతే, వ్యాధి అనే ద్వారం నుంచి ఆరోగ్యం,
దుఃఖం నుంచి సుఖం, ప్రమాదం నుంచి జనిస్తుంది ఆశీర్వాదం
ఎనిమిది స్తంభాల్లో నాలుగు విరిగిపోయాయి, పైకప్పు కూలితే ప్రమాదం

'నువా'మాత అయిదు రంగురాళ్లను తెచ్చిఅతుకులు వేసింది ఆకాశానికి
మహా కూర్మపు నాలుగు కాళ్లు నరికి నిలబెట్టింది నాలుగు స్తంభాలుగా
సృష్టించింది పసుపు మట్టి నుంచి ప్రభువులను, బురద చుక్కల నుంచి పేదలను,
అన్ని కథలూ అంతే, పురుష సూక్తాలన్నీ ఊహావాక్యాల ఊపిరులే!

*****

## 4

పద్ధెనిమిది వేల సంవత్సరాలు కుతకుత ఉడికింది అవ్యక్త స్థితి
హిరణ్యగర్భుడిలా, కోడిగుడ్డులా 'పాంగు' పగిలిపోతున్న పరిస్థితి
నిర్మల నింగి యాంగ్, బురద యిన్ భూమిగా సరికొత్త రూపాలు
ప్రతిరోజూ నింగి పైకెగసింది పది అడుగుల ఎత్తుకు, పాంగు పదింతలు

నేల పదింతలు మందంగా ప్రతిరోజూ, పద్ధెనిమిది వేల సంవత్సరాల గురుత్వం
ఒకటి రెండై, రెండు మూడై, అయిదై, ఏడుతో హెచ్చింపబడి, తొమ్మిదితో స్థిరత్వం
'పాంగు' ఊపిరి గాలి, మేఘాలుగా, గొంతు పర్జన్య ధ్వనిగా
ఎడమకన్ను సూర్యుడై, కుడికన్ను చంద్రరేఖగా, కాళ్లు చేతులు దిక్కులుగా

రక్తం, ఇంద్రియాలు నదీ జలాలుగా, రక్తనాళాలు నదులుగా
మాంసఖండాలు భూఖండాలుగా, శిరోజాలు వృక్షాలుగా, స్వేదం వర్షంగా
దంతాలు, అస్థికలు – పర్వతాలుగా, ఎముకలలోని మజ్జ విలువైన రాళ్లుగా
'పాంగు' శరీరాన్ని కమ్మిన ధూళి గాలి తగిలి సమస్త జీవజాలంగా

'పాంగు' – విరాట్పురుషుడు – తనను తాను బలిపశువుగా అర్పించినవాడు
తన నుంచి సృష్టిని జనింపచేసి అన్నిటిలో తనను తనలో అన్నిటినీ నింపినవాడు
అంతర్యామి, బహిర్యామి అన్నీ అతడే, అన్ని భావనలకూ ఊపిరి అతడు.
ఏమీలేని దాన్నుంచి, అన్నీ సృజించిన వాడికైనా తానున్న విషయంతెలుసో, లేదో!

*****

## 5

సంపూర్ణ శూన్యస్థితి అనేది అసలున్నదా, దాని నుంచి జనించేదేమిటి?
ఏమీ లేని చోటు నుంచి ఎలా వచ్చిందీ దృశ్యమాన జగతి?
సత్తు, అసత్తులేని చోట విశ్వకర్మ కూర్చున్నదెక్కడ, ఏ విధంగా?
నింగి–నేల, మృత్యువు–అమృతత్వం, రాత్రి–పగలు లేనిచోట ఉన్నదేది?

చీకటిని ఆవరించిన చీకటిలో సృష్టించాలనే కోరిక ఎలా సృష్టించబడింది?
కోరిక నుంచి విశ్వోత్పత్తి సంభవిస్తే ఆ కోరిక ఎవరిలో దాగున్నది?
దేవతలకూ తెలియదు, బ్రహ్మకూ తెలియలేదు తామరతూడులో ఎంత వెదికినా,
నిరాపేక్ష 'వువెయి'తో సృష్టిరచన జరిగిందా? పరమాత్మకైనా తెలుసో లేదో!

ముఖం నుంచి బ్రహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు,
ఊరువుల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు జనించాక
విరాట్పురుషుని ఆవరించిందా సహస్ర పాదాల అంటరానితనం?
విష్ణు పాదోద్భవ గంగ నీటిని శిరసున జల్లుకుంటే పోతుందా మైలతనం?

ఎక్కడో తప్పు జరిగింది, ఎప్పుడో సరిదిద్దాల్సింది ఇంకా అలానే ఉంది.
'పాంగు' పుట్టినచోటున సమాజవాదం పొంగుకు వస్తున్నది.
పురుషసూక్తం పఠించిన గొంతులు మానవత్వాన్ని పలకాలిప్పుడు,
పాదాలు పైకి, తల కిందులైనపుడు పలుకుతుంది పరబ్రహ్మజ్ఞానం– 'అహమస్మి'.

*****

# 12. అహమస్మి పరంబ్రహ్మా పరమ్ పరపరాత్పరమ్

## 1

పిలిస్తే పలికేవాడతడు, ఆవాహనతో అగుపించేవాడతడు
మనసు తెరపై మసలుతాడు, మనిషి మనసు సృజించిన వాడు
చరాచర ప్రకృతికి కారకుడు, చర్చలకసలే దొరకనివాడు
సగుణ పక్షి పండు తింటుంటే, నిర్గుణుడై గమనించే వాడు

సర్వశక్తివంతుడు, సర్వవ్యాపకుడు, కాలాతీతుడు, దయామయుడు
ఏకాత్మ, సులభుడు, నిర్గుణుడు, శాశ్వతుడు, అపాయరహితుడు
తొలి చలనం, తొలి కారణం, ఉనికి, పాళ్లు, ప్రకృతి నియమాల కారకుడు
అతడు నీలో, నాలో, అందరిలో, అన్నిటిలో ఉండీ లేనట్లుండేవాడు

బానిస బిలాల్ ఇబిన్ రబాను ఎండలో మండే ఇసుకపై పడవేసారు,
కాళ్లూ చేతులూ నాలుగు దిక్కులకు లాగి గుంజలకు కట్టారు గట్టిగా
కొరడాలతో కొట్టి, కాలుతున్న బండరాయిని పెట్టారు ఛాతీపై,
అయినా అతడు 'దేవుడొక్కడే, దేవుడొక్కడే' అంటూనే ఉన్నాడు.

ప్రవక్త తొలి అనుయాయుల్లో అతడొకడు, ప్రవక్తను నమ్మినవాడు
అబు బకర్ వచ్చాడు ప్రవక్త పంపగా రుసుము చెల్లించి కొన్నాడు బిలాల్‌ను
'అథాన్'ను చదివేందుకు ప్రవక్తచే నియమించబడినవాడతడు
తొలి 'మువజ్జిన్' ధుని శ్రావ్యంగా వినవస్తూ విస్తరించింది విశ్వమంతా నేడు!

*****

## 2

రా, వలయంగా తిరుగుదాం, అతడి పవిత్ర నామాన్ని ఆవాహన చేస్తూ
పెను తుఫానులో సైతం అలలపై తేలే సీలువేసిన సీసాలా అతడిని స్తుతిస్తూ
పడవలో చేరిన నీరు ముంచుతుంది, పడవ బయట నీరు తేల్చుతుంది,
విశ్వాసపు ఊపిరి నీలో ఉన్నపుడు, ప్రభు సన్నిధిని 'దరవేషు'గా చేరుతావన్నది.

బంధాలను తెంచి, ముక్తిని ప్రసాదిస్తుందా భక్తి?
లేక, బంధాలను పెంచి దుఃఖాన్ని పరిహరిస్తుందా ఆ శక్తి?
మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ భావనలు
ప్రత్యక్ష దైవాలపై నీ ప్రేమానురాగాలే దేవుని చేరే ప్రార్థనలు

ప్రహ్లాదుడి ప్రశాంత భక్తి, హనుమంతుడి దాస్యభక్తి,
అర్జునుడి సఖ్య భక్తి, రాధాదేవి మధుర భక్తి,
యశోద వాత్సల్య భక్తి, ఒకే సముద్రం, అయిదు తరంగాల మహామాయి
తనకొక్కమాటా చెప్పకుండా వెళ్లిన ఆ నల్లనివాడిని వెదుకుతున్నది మీరాబాయి

ఎన్నిసార్లు, ఎంతకాలం, ఏ ప్రార్థనలు నివేదిస్తావన్నది కాదు ముఖ్యం
పంజరంలో నిర్బంధించబడినావు, నీ వేదనను ఎలా చెబుతున్నావు నిత్యం?
గులాబీలు, చేమంతులు, తులిప్ పూలమధ్య బుల్‌బుల్ పాడేది ఏ పాట?
ప్రేమ ఫలాన్ని తింటున్న పక్షినసలు గమనిస్తుందా రెండో పక్షి ఈ పూట!

*****

## 3

అదొక మాట్లాడే కాకి, తొమ్మిది తరాల మానవ పూర్ణాయుర్దాయం దానికి
కాకికి నాలుగింతలు జింక జీవితం, దానికి మూడురెట్లు బొంత కాకికి,
బొంతకాకికి తొమ్మిదింతలు ఫీనిక్స్ సుదీర్ఘ జీవనాలయం
దాని కనుల నుంచి మార్మిక కాంతి, తలచుట్టూ దివ్య వలయం.

టిరియన్ ఊదా ఎరుపు రంగు కాళ్లు, నీలి ఈకలపై బంగరుపొడి తళుకులా
బంగరు పసుపు ఊదా ఎరుపు కలిసి, సూర్యకాంతిలో మెరిసే చక్కటి ఈకలు
జెఫిర్ పశ్చిమ గాలికన్నా వేగంగా పోతుంది, సూర్య కిరణాలతో కలిసిపోతుంది
గరుడపక్షిలా కానవచ్చి అరేబియా గుగ్గిల పరిమళాలను వెదజల్లుతుంది.

తన కాలం ముగిసాక పేర్చుకుంటుంది సుగంధ మూలికలతో చితి
సూర్యకిరణాలతో మంటను రగిల్చి కాలి బూడిదగా పొందేను సద్గతి.
ఆశ్చర్యం! ఆ బూడిద నుంచి వెలువడుతుంది నవజాత ఫీనిక్స్ ప్రత్యంగం!
ఎండ తగలగానే మారుతుంది క్షణాల్లో పెద్దగా ఆ అద్భుత విహంగం

మరణం ఒక ముగింపు కాదు, అది పునరుత్థానానికి చిహ్నం
స్వర్గం నుంచి అరేబియా మీదుగా ఫొనిషియా చేరింది అగ్ని విహంగం
దాల్చిన చెక్కల చితి, గుగ్గిలపు గోళం, సూర్యకిరణ జ్వాలలు
ఆత్మకు మరణం లేదు, సగుణ భక్తి, నిర్గుణజ్ఞానం సచ్చిదానందం.

*****

## 4

కాలాంతపు అంచున ఉన్నది 'ఒమేగా' పాయింట్ అనేది
నిర్జీవ, జీవ ప్రపంచాల్లా విస్తరించిన మనో ప్రపంచపు పోకడ
సృష్టి పరిణామం అక్కడ ఆగిపోతుంది, చేతన స్తబ్ధమవుతుంది
ఆల్ఫా నుంచి ఒమేగాకు కాలం చేరుకున్నాక క్రీస్తు రెండవ రాకడ!

మెదడును కంప్యూటరైజ్ చేసి మేధస్సును శాశ్వత బందీ చేయగలమా?
జీవజలంలో మెదడును భద్రపరచి మనసును శోధించగలమా?
సైబొర్గ్‌లతో, అవయవ మార్పిడిలతో ఆయుర్దాయాన్ని పొడిగించగలమా?
డిజిటల్ శాశ్వతత్వంతో కొత్త శాశ్వత అవతారాన్ని సృష్టించగలమా?

నవీన మానవుడు అన్ని భాగాలూ కొత్తగా అమర్చబడిన థెసియస్ నౌక.
నిద్రిస్తున్న బాటసారిని చుట్టుముట్టాయి రెండు పిశాచాలో అర్ధరాత్రి
ఒకటి అతడి అంగాల్ని విరిచి పారేస్తుంటే, రెండవది నవ్వుతున్నది
పక్కనే ఉన్న శవపు అంగాలతో ప్రతి భాగాన్ని పునర్నిర్మించింది.

తెల్లవారే నిద్రలేచిన బాటసారికి అంతా గందరగోళమే,
తనది కాని దేహంలో తానెట్లా ఉన్నానంటే నవ్వవా మహాభూతాలు!
గణేశుడూ, దక్షుడూ ముందు గాభరాపడి ఉంటారు కాసేపు
కాలాంతపు అంచు నుంచి వెనక్కి వచ్చి తత్కాలపు జ్ఞానాన్ని పొందేవరకూ!

*****

## 5

అల్ఫా, ఒమేగా ఆద్యంతాల మధ్య అక్షరాలు ఇరవై నాలుగు
నేనే ఆల్ఫాను, నేనే ఒమేగాను, మధ్యలో ఉన్నదీ నేనే!
నేనే అల్-అవ్వల్, నేనే అల్-ఆఖర్‌ను, అన్నీ నేనే!
నేనే ఆత్మను, పరమాత్మను, పరబ్రహ్మ పరమ్‌పర పరాత్పరుడిని!

ఎవ్వని అవసరమూ లేనివాడు, శాశ్వతుడు, ప్రేమ స్వరూపుడు,
కరుణామయుడు, పవిత్రుడు, అసమానుడు, స్థిరుడు,
బాధలకతీతుడు, పాపకర్మలంటనివాడు, అర్థం కానివాడు,
దేహరహితుడు, అనంతుడు, ప్రేమాస్పదుడు, ప్రేమ స్వరూపుడు

అవతార పురుషుడు, శాశ్వత రహస్య దీప్తుడు, సర్వశక్తిమంతుడు
సర్వ వ్యాపకుడు, సర్వజ్ఞుడు, ఏకాత్ముడు, విధి రూపుడు,
న్యాయమూర్తి, సాధారణుడు, చక్రవర్తి, కాల ప్రదేశాతీతుడు
త్రిమూర్తి, సత్యరూపుడు, ప్రళయాగ్రహ స్వరూపుడు- అన్నీ నేనే!

జాగృత్, స్వప్న, సుషుప్తి, తురీయానందస్థితుల కావల పరబ్రహ్మం
అంతిమ వాస్తవం, ప్రేమ తాదాత్మ్యత, సచ్చిదానంద స్వరూపం
సత్య జ్ఞాన అనంతపు అపురూప బ్రహ్మానంద అనుభవం
నేనే ఆ పరబ్రహ్మ, పరాత్పర, పరంజ్యోతి – 'వేదశాస్త్ర గురుతత్'

*****

# 13. వేదశాస్త్ర గురుతత్ స్వయమానంద లక్షణం

**1**

నా శాస్త్రాలు, అస్త్రశస్త్రాలు నావి, నీ మతం కాదు నాకు సమ్మతం
పాచిక లాడేప్పుడు, కుత్తుకలు కోసేప్పుడు పనికిరాదు పరాచికం
సాలభంజికల స్థానంలో కాలభంజికలు నిలబడతాయి
విక్రమాదిత్యుడి సింహాసనం దగ్గర భోజనరాజుల నాపుతాయి.

ఏ నిర్వేద శాస్త్రాలు, వేదనాభరితేతిహాస్యాలూ నాకక్కరలేదు
ఈ పురాణ రణాల నుంచి నిరాశోపనిషత్తులింకా వెలిగించలేను,
మానవ స్పృహ లేని స్మృతులతో మనసును మృతి కానివ్వను
లయమైన అనురాగ తానం పల్లవులతో కులశ్రుతిలో ఫలశ్రుతి పల్లవించదు

వాళ్లు అగ్నిపూలను, అరణ్యకాల గుండెల్లో నింపుకున్నారు
పాదాలకు కరుణానేత్రాలను తొడిగి పేదరికంతో భాషించారు
అక్షరాల వెలివాడల్లో ఒంటరి దేవుళ్లను పరామర్శించారు
కళ్లూ బొటనవేళ్లూ ఆదిగురువులకిచ్చి దర్శనాలను తిరస్కరించారు

కత్తి, కొడవలి, సుత్తి, దాగలి, కన్నీళ్లు, ఆకలి ఎర్రదనాన్ని చూసారు
అందరూ సమానంగా ఉండబోయే భూతల స్వర్గాన్ని కలగన్నారు
అంతా డిజిటలైజేషన్ అవుతుంటే వాళ్లు అబాకస్‌తో లెక్కలేసారు
చట్టపు చేతివేళ్ల పొడుగెక్కువ, తుపాకి గుళ్లకు తొందరెక్కువ.

*****

## 2

నా దేశపు సామ్యవాదం నాది, నీ దేశపు వంటగది నీది
ఆ దేశపు తిరగలిలో ప్రజల్ని పిండిచేసి పెట్టుబడి పెడతాను నేను
సందేశపు రోకలితో ఆశల రోలులో శ్రమకారం దంచుతావు నీవు
మతప్రదేశపు గుట్టలపైన శిలువల్ని, నెలవంకల్ని నిలబెడతాడతడు.

ఇన్ని మోడర్నైజ్డు కిచెన్లున్నా రొట్టెకు ఆకలి సరిపోదు
నీళ్లల్లో అణుధార్మికతను గుమ్మరించి దాహాన్ని స్కాన్ చేస్తున్నాడు
మానవ రక్తమెప్పుడో బ్లడ్ గ్రూపులుగా కుల విడిపోయింది
ఎవరి ఎజెండా కింద వాళ్లని పాతిపెట్టేందుకు స్థలం సరిపోవడం లేదు

కంప్యూటర్ విరాట్పురుషుడి తల నుంచి కృత్రిమ మేధస్సుతో భూసురులు,
అణుభుజాల్నుంచి పరమాణు కవచకుండల మిస్సైల్స్‌తో నవక్షత్రియులు
కార్పొరేట్ పొట్ట, తొడల్నుంచి వైరస్ ఊర్వశీకరణ విశ్వవైశ్యులు
వెలివేసిన పాదాల కంటిన ధూళినుంచి పేదరికపు ఏకవర్ణ శూద్రులు

పేరులో నిజమున్న వాదాల బళ్లూ సారథులు రిపేర్లకు పోతున్నారు
స్పార్టకస్, చెగువేరాలు టీషర్టులపై చేస్తున్నారు కవాతులు
గాంధీ, అంబేద్కర్, మార్క్స్, మావోలు మాటలుగా మిగిలారు
ఎక్కడ వేసిన గొంగళి కక్కడే, ఎవరో పరువు కత్తి రక్తాన్ని తుడుస్తున్నారు.

*****

## 3

మొదటి పాపం ఆదాం–ఈవ్‌లు చేసారు తినకూడనిది తిని,
మొదటి హత్య కెయిన్ చేసాడు అబెల్ అనే తన సోదరుడిని.
ఆదాం–ఈవ్‌ల మూడవ కొడుకు సెత్ ఎనిమిదవ తరం వాడు 'నోవా'
జలప్రళయంలో బతికిన 'నోవా'కు ముగ్గురు పుత్రులు– షెమ్, హామ్, జఫెత్‌లు

తాగిన మైకంలో నగ్నంగా పడి ఉన్న తండ్రిని చూసి నవ్వినాడు హామ్
షెమ్, జఫెత్‌లు నోవాపై వస్త్రం కప్పారు తండ్రివేపు చూడకుండానే
కానాన్ తండ్రి హామ్, నోవా శాపంతో బానిసలయ్యారు కాననైట్లు
షమ్ వంశీకులు ఇజ్రాయెలీలై సాధించారు రాజ్యార్హత.

హామ్ కొడుకులు– కుష్, మిజ్రయిమ్ (ఈజిప్టు), ఫుట్, కానాన్‌లు
కుష్ కుమారుడు నిమ్రాద్–భూమిపైన తొలి యోధుడు, వేటగాడు
షెమ్ వంశపు ఎనిమిదవ తరం వాడు తెరాహ్, అతడి కుమారుడు అబ్రహామ్
బండ్లు ఓడలై బానిస నిమ్రాద్ రాజై, తెరాహ్ అతడికి సేవకుడైనాడు.

ఆకాశాన కొత్త తార వెలిగితే రాజుకు పట్టుకుంటుంది పదవీగండ భయం
పుట్టిన మగపిల్లలందరూ కత్తికెరైనా, తెరాహ్ కొడుకొక్కడే గుహలో పెరిగినాడు
అతడు అబ్రహాం, ఎదిరించాడు అగ్ని ఆరాధకుడైన 'నిమ్రాదు'ను
ఆ అగ్ని మంటల్లోంచి నడచి వచ్చాడు అబ్రహాం కసుగందకుండా.

*****

## 4

ఇద్దరు విశ్వాసులు, ఇద్దరు అవిశ్వాసులు పరిపాలించారీ ప్రపంచాన్ని
సులేమాన్, ధు అల్-ఖర్నయాన్‌లు దేవుని విశ్వాసులు
ఇద్దరు దైవ వ్యతిరేకులు నెబుఛాద్ నెజ్జర్, నిమ్రాద్‌లు
మహా గోపురాన్ని నిర్మించి దేవునికే సవాలు విసిరాడు నిమ్రాద్

పక్షుల రథమెక్కి పరమాత్మతోనే తలపడాలనుకున్నాడతడు
దేవుడు చూసాడు నిమ్రాదు మొండితనాన్ని, ఉక్రోషంతో నిండిన కోపాన్ని
పనివాళ్ల భాషల్లో గందరగోళం రేపి కూల్చేయించాడా బాబెల్ గోపురాన్ని
మరింత కోపంతో మండిపడినాడు నిమ్రాదు కొరకరాని కొయ్యగా మారిన అబ్రహాంపై

అసంఖ్యాక సైన్యంతో తరలివచ్చాడు నిమ్రాదు, అణచివెయ్యాలని అబ్రహాంను
ఎక్కడి నుంచి వచ్చాయో దోమలు దాడిచేసాయి నిమ్రాద్ సైన్యంపై నల్లమబ్బుల్లా
నిమ్రాద్ ముక్కులోంచో, చెవిలో నుంచో దూరిందో దోమ, అతడి మెదడులోకి
గోడకేసి కొట్టుకున్నాడు తల, నుదుటిపై బాదుకున్నాడు సుత్తితో!

నలభయ్యవ రోజున తలపగిలి బయటపడింది ఇంత రక్తపు గడ్డలా,
చిన్న దోమ పావురమంత పెరిగి ఎగిరిపోయింది పాపపు బిడ్డలా!
యదువంశపు కథల్లోను, నిమ్రాదు లాంటి కంసుడు కనిపిస్తాడు,
అబ్రహాంలా కృష్ణుడు ఆ తరవాత మహా యుద్ధకథ నడిపిస్తాడు.

*****

## 5

మూడు మతాల కక్కడ మూలపురుషుడైనాడు అబ్రహామ్
మూడు మతాలున్న దేశంలో విరాట్ పురుషుడైనాడు నీలమేఘశ్యామ్.
ప్రవక్తలు ప్రవచిస్తారు దశాజ్ఞలు, పవిత్ర పుస్తకాలు, శాసనాలు
జగద్గురువు బోధిస్తాడు యుద్ధం ముందు గీతా ప్రవచనాలు.

ఎవరి తోటలు వారివి, ఎవరి పూలు వారివి, ఎవరి ఫలాలు వారివి.
ఎవరి పుస్తకంలో పేజీలు వారివి, అహంకారపు పేచీలతోనే తలకొరివి
గులాబీలు, చేమంతులు, తులిప్ పూలు, బుల్‌బుల్ పాటల తోట ఒకటి
లిల్లీపూలు, డఫొడిల్స్, ఫాషన్ ఫ్లవర్స్, గులాబీ, ఫీనిక్స్‌ల వనం మరొహటి

మూడు నుంచి ముప్పైమూడు కోట్ల దేవతలున్నా ఒక్కడే పరమాత్మ
పారిజాతాలు, తామరపూలు, మల్లెలు, మామిడిచిగుర్లు, కోయిలలతో జీవాత్మ
గుల్‌మొహర్, పలాశ, మోదుగుపూల అగ్నివర్ణంతో ఎర్రటి అరణ్యం
ఆత్మలు, పరమాత్మలు లేని మానవ శ్రమ అక్కడ శరణ్యం

ఎవరి జ్ఞానం వారిది, ఎవరి అనుభవం వారిది, ఎవరి ఆనందం వారిది,
ఈ తోటలు, వనాలు, దీవులు, సముద్రాల మధ్య కట్టగలమా వారధి?
ఆవేశపరులు తగిలించుకుంటున్నారు మందుగుండు నింపిన కోటు ప్రస్తుతం
రక్తపు మడుగును కడుగు, స్వయమానందపు అడుగు 'సర్వభూతస్థితం'!

*****

# 14. సర్వ భూత స్థితం బ్రహ్మ

## 1

అడుగున ఇప్పుడు అనంత ఖాళీస్థలం, అదే, దారిద్ర్యపు రేఖ అడుగున
ఎవర్ని అడగాలో తెలీదు, అన్నీ పంచుకున్నవాళ్ల దగ్గర ఆధార పత్రాలు
ఏమీలేని వాళ్ల కోసం రాజ్యాంగ పత్రాలున్నా వాటిలో ఏమీ లేదు
పనిచేయని వాడి కింద పనిచేసేవాళ్లకు గ్రీన్‌కార్డులిస్తారు.

అదుగో న్యాయదేవత, దిగువ నుంచి ఎగువ వరకు ఆమెకోసం గోపురాలు
న్యాయభాష అందరికీ రాదు, 'లా' వొక్కింతయూ లేదు.
ఆమె వెనుక హిమాలయ పర్వతాల కన్నా ఎత్తుగా పేరుకున్న కేసులు
వాదోపవాదాల కాగితపు జల్లెడ నిండా అవినీతి చెదలు చేసిన రంధ్రాలు

న్యాయదేవత ఎడమచేతిలో అత్యంత సున్నితమైన త్రాసు
కుడిచేతిలో న్యాయఖడ్గం, నిష్పాక్షికత కోసం కళ్లకు గంతలు
శరీరాన్నంతా కప్పే విశిష్టవస్త్రం 'టొగా', ప్రశాంత రూపురేఖలు
ఆర్డర్, ఆర్డర్, ఆర్డర్! మోగుతున్నది కొయ్యసుత్తి శబ్దం నిరంతరాయంగా

ఎవరో దోచుకుపోయారు, సమానత్వాన్ని, మానవత్వాన్ని, స్వేచ్ఛను
నాకు చెందినది నాకిప్పించండి అని సగటు మనిషి గగ్గోలు
ఆమె రెండు చేతులూ బిజీగా ఉన్నాయి, కంటిలో నలుసు తీసేవారు లేరు
న్యాయం బ్రహ్మపదార్థమైనపుడు, నలక కనిపించకుండా పెడుతుంది బాధ.

*****

## 2

‘ఇది అన్యాయం’ – అన్నది ఇనాన్నా, ఎంకి దేవుడితో
‘అందరికీ అన్నీ ఇచ్చావు. మరి నా రాజ్యం ఏది, నేనెవర్ని?’
ఎంకి అన్నాడు– ‘నీవు స్వర్గ, భూలోకాలకు రాణివి,
అంతా నీదైనపుడు పాతాళం కూడా కావాలనడమే అన్యాయం’

‘ఇనాన్నా’కు నచ్చింది ఉరుక్, అక్కడ తోటలో నాటింది ‘హులుప్పు’ వృక్షం
చెట్టు పెరిగేసరికి తిష్ఠవేసాయి మంత్రాలకు లొంగని సర్పం, అంజుపక్షి, లిలిత్ భూతం
గిల్గామేష్ దెబ్బకు పారిపోయాయవి, చేసాడా చెట్టు కొయ్యలతో
ఇనాన్నాకు శయ్య, సింహాసనం, పిక్కు–మిక్కు అనే ఢంకా, ఢంకా కర్రలు

పాతాళలోకపు మార్మిక ఫలం తిన్నాక ‘ఇనాన్నా’కు తెలిసింది శృంగార రహస్యం
రైతు ‘ఎంకిముడి’ కన్నా గొర్రెలకాపరి దుముజుడు నచ్చాడామెకు
ఎబిహ్ పర్వతాన్ని వంచి, తనను బలాత్కరించిన ‘సుకలెతుదు’డిని చంపింది
పాతాళలోకాన్ని కూడా జయించాలని, సోదరి ఎరిష్కగెల్ దగ్గరకు వెళ్లింది.

ఏడు ద్వారాల వద్ద తన ఏడు శక్తులు కోల్పోయి నగ్నంగా కూర్చుంది పాతాళ గద్దెపై
ఏడుగురు పాతాళ న్యాయమూర్తులు– ఆమెను శవంగా మార్చి తగిలించారు కొక్కేనికి
ఎంకిదేవుడు తన గోళ్ల అడుగున మట్టినుంచి చేసాడు రెండు భూతాల్ని
పాతాళాన్నుంచి ఇనాన్నాను బతికించి తీసుకువెళ్తుంటే వెంటబడ్డాయి గల్లా పిశాచాలు

*****

## 3

‘నీకు బదులుగా ఇక్కడ ఎవరో ఒకరుండాలి’ –అరిచింది ఎరిష్కగల్
లేకుంటే నా ‘గల్లా’ పిశాచాలు కునుకు రానియ్యవు నీ కంటిపై
ఇనాన్నా వచ్చింది భూలోకానికి, ఎవర్ని పంపాలి పాతాళానికి?
కనిపించాడు ‘దుముజ్’, గద్దెపై కుర్చున్నాడు దుఃఖఛాయలు లేకుండా!

‘గల్లా’ పిశాచాల కప్పచెప్పింది ‘దుముజ్’ను – ‘తీసుకుపొండి ఈ కృతఘ్నుడిని’–
అడ్డు వచ్చిన దుముజ్ సోదరి గెస్తినన్నాకు పాతాళవాసం సంవత్సరానికి ఆర్నెల్లు
గెస్తినన్నా, దుముజ్‌ల తల్లి సిర్తుర్ దుఃఖాన్నెవరు శాంతింపచేయగలరు?
కోపం తగ్గాక ఇనాన్నా కూడా కుమిలి కుమిలి ఏడ్చింది ‘దుముజ్’కోసం

దుముజ్ పాతాళంలో ఉన్నంతకాలం భూమిపై శీతాకాలం
అతడు భువికి రాగానే మొదలవుతుంది వసంతకాలపు కోలాహలం
సుఖానికి దుఃఖానికి మధ్య ఆగ్రహపు గోడ ఉందంటే ఉంది, లేదంటే లేదు
స్వర్గానికి, పాతాళానికి మధ్య భూమి బతుకు, ఉందంటే ఉంది, లేదంటే లేదు.

అక్కడ ఉత్తర దిక్కున మొదలయ్యింది అంతిమయుద్ధం ‘రాగ్నరొక్’
నార్స్ దేవతలకది సంధ్యాసమయం, కూస్తున్నాయి మూడు కోడిపుంజులు
‘గ్నిపా హెల్లిర్’ గుహ ముందు గర్మర్ శునకం అరుస్తున్నది భీకరంగా;
కొడుకు పేగులతో బంధించబడిన ‘లోకి’ ముఖంపై విషం బొట్లుబొట్లుగా!

*****

## 4

చచ్చినవాళ్ల గోళ్లతో చేయబడిన 'నగల్‌ఫర్' నౌక కదిలింది వేగంగా
'ఫెన్‌రిర్' తోడేలు నోరు నేలకంటేలా తెరుచుకుని వస్తున్నది భయంకరంగా
ఆకాశం రెండుగా చీలి వస్తున్నారు మస్పెల్ అగ్నిపుత్రులు 'సుర్తర్' నాయకత్వాన
ఊగిసలాడుతూ విరిగిపోతున్నది ఫెళఫెళమంటూ ఇంద్రధనుస్సు వంతెన

మహాజ్ఞాని, వీరుడు ఒంటికన్ను ఒదిన్‌ను మింగేసింది ఫెన్రిర్ తోడేలు
'థొర్'ను చుట్టుముట్టింది జొర్మున్‌గండ్ సర్పం, వేసింది కాటు మీద కాటు
సుర్తర్ ఖడ్గానికి బలైనాడు ఫ్రెయిర్, టయర్‌ను చంపి చచ్చింది గర్మర్ శునకం
మనుషుల లోకంలో మిగిలిన తోలుముక్కలతో చేసిన చెప్పులు తొడిగాడు విదర్

తండ్రి ఒదిన్‌ను మింగిన తోడేలు ఫెన్రిర్ కింది దవడను తొక్కి చీల్చి చంపాడు;
గోళ్ల పడవలో వచ్చిన 'లోకి', 'హిమ్‌దాల్'తో తలపడగా ఇద్దరూ నేలకూలారు
అగ్నిపుత్రుడు 'సుర్తర్' భూమిని మంటల్లో తగలబెట్టాడు
దేవుళ్లు, మానవులు మసైనాక మిగిలింది ఎవరు, ఎక్కడ, ఎలా?

అగ్నిలో కాలి సముద్రంలో మునిగి మరల బయటపడింది నేల
ఒదిన్ పుత్రులు విదర్, వలి, థొర్ పుత్రులు మొడి, మాగ్నిలు,
పాతాళం నుంచి బాల్డర్, హొదర్‌లు కనుగొన్నారు మానవ జంటను
'హద్ మిమిస్ హొల్ట్' అడవుల్లో, దేవతల రక్షణలో లైఫ్, లైఫ్‌థ్రాశిరులు

*****

## 5

మరో కొత్త ప్రపంచం సృష్టించబడుతుంది, అందరూ సమానమే అక్కడ
పడవ ఆగుతుంది సునామీ అలలపై తేలివచ్చి పర్వతా శిఖరాగ్రాన
ప్రకృతికి, దేవుడికి, మనిషికి మధ్య జరుగుతాయి కొత్త ఒప్పందాలు
లైఫ్, లైఫ్ థ్రాసిర్‌ల జీవితంలో యమ-యమి సంవాదాలు.

ఈడెన్ ఉద్యానవన లోకంలోకి సాతాను సర్పంలా వస్తాడు 'లోకి'
ఈశిర్లు, వానిర్లు, మహాకాయులు, మరుగుజ్జులు, మనుషులు
పంపకాలు చేసుకుని వెళ్లిపోతారు వాళ్లవాళ్ల వాటాల్లోకి
మరల సరిహద్దుల దగ్గర మొదలవుతాయి ఘర్షణలు, శషభిషలు

విశ్వవృక్షానికి తలకిందులుగా వేలాడి, కన్ను పోగొట్టుకున్నాకే 'ఒదిన్'కు వస్తుంది జ్ఞానం
ఎంతకూ తరగని యక్ష ప్రశ్నలతో కాలానికి అన్నివేపులా చేయాలి ప్రయాణం
నిత్య, నైమిత్తిక, ప్రాకృతిక, అత్యంతిక ప్రళయాలతో వణుకుతుంది జీవాత్మ
సరస్సు నీటిలోని తామరాకుపై నీటిబొట్టు, రెండూ ఒకే ప్రత్యగాత్మ

మహాసముద్రపు అలలపై మర్రి ఆకుపై పవ్వళించి ఉంటాడు ఆ జగత్ శిశువు
విశ్వ విష్ణువు, వినీలాకాశపు పాలపుంత బొడ్డుతాడులోని పద్మంలో బ్రహ్మ,
అతడు సృష్టించిన జీవుల మాతృగర్భాల మాయ, బొడ్డుతాడు చివర మరో శిశువు
అటు విష్ణువు ఇటు శిశువు ఇద్దరికీ మధ్య జగన్మిధ్య – తత్త్వస్య ప్రాణోహం అస్మి

*****

# 15. తత్త్వస్య ప్రాణోహం అస్మి

## 1

ఆ వాస్తవమేమిటి? అవాస్తవమేమిటి? తత్త్వ విచారణ తత్త్వమేమిటి?
చేతనుడైన పురుషుడు, భౌతిక ప్రకృతి ద్వైత భావనల రూపమేమిటి?
అయిదు శుద్ధ, ఏడు శుద్ధాశుద్ధ, ఇరవై నాలుగు అశుద్ధతత్త్వ శైవతత్త్వ నిరూపణలా!
కృష్ణ, విష్ణు, శక్తి, జీవ, శివ, మహత్ తత్త్వ వైష్ణవ తత్త్వ కిరణాలా!

ఆకాశ, వాయు, తేజస్సు, జల, పృథ్వీ పంచతత్త్వ భావనలా?
అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు తన్మాత్రలు
నాలుగు అంతఃకరణాలు, దశనాడులు, ఏడు చక్రాలు, ఏడు ధాతువులు
పది వాయువులు, పంచకోశాలు, నవద్వారాలు, ఎనిమిది వికారాలు.

మూడు మండలాలు, మూడు దోషాలు, మూడు గుణాలు, మూడు మలాలు
అయిదు అవస్థలు, ఇవన్నీ తొంభై ఆరు మానవ శరీర తత్త్వాలు
అయ్యవళి - గురుమార్గం - ప్రవచించేను, దేహపు లక్షణాలు
అకిలత్తురత్తు అమ్మనయి తత్త్వాలు అయ్యవైకుందర్ అవతార విశేషాలు

ఎవరి తత్త్వం వారిది, నాలుగు తన్నులు తగిలాక బోధపడ్తుంది జీవతత్త్వం
తత్త్వాలన్నీ తారుమారవుతాయి, పంచప్రాణాలకు ప్రమాదం వస్తే,
తమది తాము లాక్కుపోవాలని పంచభూతాలు ఎదురుచూస్తున్నట్లు
చివరకు ఏమీ మిగలదు, అన్నీ అదృశ్యమైపోతాయి కృష్ణబిలాల్లోకి.

*****

## 2

వాళ్లు అమెరికాను కనుక్కుంటారు, అణువులను కనుక్కుంటారు
అణుమాన సూత్రాలతో శీతల యుద్ధాల్ని గడ్డకట్టించి కరిగిస్తారు
వాళ్లు వైరసులను కనుక్కుంటారు, గబ్బిలాలను బిలాల్లో వెతుక్కుంటారు
అనుమాన నేత్రాలతో మందులూ, వాక్సీనులు ముందే అమ్మకానికి తయారుచేస్తారు.

కాలం గడ్డకడ్తుంది రెండు మూడేళ్లపాటు మాస్కులు, తాళాల వెనుక
చేతులు కాలినాక వెంటిలేటర్లు ఐసొలేషన్లు మరచిపోతారు
ఆర్థిక ఆక్సిజన్ అందినాక రియల్ ఎస్టేట్ రివ్వున దూసుకుపోతుంది
వలస పక్షులన్నీ దారిద్ర్యరేఖ కింద సందులేక పైకెగిరిపోతాయి

ప్రపంచ మేధావులు సోది చెబుతుంటారు చేట బియ్యంలో చెయ్యిపెట్టి
ఆగిపోయిన విమానాలను లాగడానికి అశ్వశక్తిసరిపడా లేదు
కామన్‌సెన్స్ చౌరస్తాలో సైన్సూ, వేదాంతం కొట్టుకు చస్తూంటాయి
ఆఫ్ఘనిస్తాన్ గంజాయిని ఎవరికమ్మాలో తెలియక లాహోర్ లబలబలాడ్తుంది.

ఒకే చైనా అంటే అందరూ ఊకొడతారు, ఒకే భారత్ అంటే ఉలిక్కిపడతారు
రామాలయాలు, ఏపిల్ తోటలు, అరుణాచల్, నాగాలాండ్‌లో ఏవో పడగ నీడలు
తాత్త్విక చింతనను డిలిట్ చేసి, దారుణ మేళాలను ప్రమోట్ చేస్తారు
ఎక్కడ నుంచో అణుయుద్ధపు వాసన, మృత్యుదూతల అడుగుజాడలు

*****

## 3

కుందేలుపై గెలిచిన ఊపులో ఉన్నది తాబేలు తర్కపు ఒలింపిక్స్‌లో
శాంతి జెండా కప్పు పట్టుకుని తాబేలు నడుస్తున్నది కాలపు వీధిలో
ట్రాయ్ యుద్ధంలో హెక్టార్‌ను ఓడించిన ఎఖిలీస్ ఎదురుపడినాడు
యుద్ధమన్నా, పరుగుపందెమన్నా 'సై' అంటాడు కాని కాస్తైనా ఆలోచించడు.

తాబేలు నడకను చూసి పకపకా నవ్వాడు ఎఖిలీస్,
'అన్ని దారులూ యుద్ధ నగరానికి; నీవేమిటి శాంతిగ్రామం పోతున్నావు?'
'ఒక లాజిక్ ప్రకారం నీవు నన్నెప్పుడూ అందుకోలేవు' అన్నది తాబేలు.
'కొట్టానంటే డిప్ప పగుల్తుంది, నేనేమీ చెవులపిల్లిని కాదు' –ఎఖిలీస్ అన్నాడు.

'కొత్త నిబంధన నీకు తెలుసా, నా డిప్పపైనున్నవన్నీ శిలువ గుర్తులే' అన్నది తాబేలు
'నాకు దేవతలు తెలుసు, అమెజాన్లు తెలుసు, గెలవడం తెలుసు' అన్నాడు ఎఖిలీస్.
'నీవు తాబేలువి. నాకంటే ముందు సగం దూరం పోయినా నాదే గెలుపు'
తాబేలు అన్నది– 'నేను పరిగెత్తిన దూరంలో సగం దగ్గర ఆగాలి,

మరల నేను కదిలినాకే నీవు నీ పరుగు మొదలెట్టాలి, సరేనా!'
పరుగుపందెం మొదలయ్యింది. కుందేళ్లు, పక్షులు పర్యవేక్షిస్తున్నాయి.
ఎప్పటికప్పుడు శాంతి తాబేలు కదిలిన దూరంలో సగం దగ్గర ఆగాలి ఎఖిలీస్
యుద్ధ పతాక చేతబట్టిన ఎఖిలీస్ ఎప్పటికీ నెగ్గలేదు ఈ పందాన్ని.

*****

## 4

తాబేలు గెలిచిందా, ఎఖిలీస్ గెలిచాడా అనేది కాదు ముఖ్యం,
శాంతి-యుద్ధాల పరుగుపందేలలో తర్కం గెలిపిస్తుంది శాంతిని.
ఎఖిలీస్ చీలమండ గురించి పారిస్ బాణాలకు బాగా తెలుసు
శాంతి అనుకూలవతియైన భార్య, యుద్ధం మత్తెక్కించే ప్రియురాలు

వాళ్లు ప్రేమను సజీవంగా సమాధి చేసి చాలాకాలమయ్యింది
కామపు మృగతృష్ణలను వేటాడుతూ ద్వేషపు ఎడారిలో అన్వేషణ
పరశువేది, ఫిలాసఫర్ స్టోన్, మిదాస్ టచ్ కావాలి అందరికీ
గూగుల్లో, డాట్ కాముల్లో, వీకీ శోధకులై నెట్టింట్లో వెదుకుతారు.

ప్రేమ ప్రస్తుతం అందుబాటులో లేదు - అవుటాఫ్ కవరేజ్ ఏరియా
జి.పి.యస్ ఆగిపోయింది ఆ గులాబితోట దగ్గర
వసంతకాలపు రాజుదా తోట, అతడి కుమార్తె అందాల గులాబి
పడమటి గాలి కబురు తెచ్చింది, బుల్‌బుల్ గానం గురించి.

ప్రేమను భిక్ష అడిగే బుల్‌బుల్‌ను అంగీకరిస్తుందా గులాబీ కన్య?
పాట హృదయాన్ని గాయపరచింది పరిమళం తన ముల్లుతో
వసంతరాజుపై దండెత్తాయి వరుసగా గ్రీష్మ, శరత్, శిశిరాలు.
మరల వసంతం గెలిచాక ప్రేమలో మునిగాయి బుల్‌బుల్, గులాబీలు.

*****

## 5

తాబేలు గెలిచింది, ఎఖిలీస్ గీతదాటి కలిసిపోయాడు కాలరేఖలో
యుద్ధం ముగియాలంటే ట్రోజన్ హార్స్ కావాలి, దొంగదెబ్బ తీయాలి.
నీళ్లలో దాక్కున్న వాడిని బయటకు లాగి తొడలు విరగగొట్టాలి
తొడలు విరిగి కూలిన దుర్యోధనుడికి ప్రియంబు చేయాలనుకున్నాడు అశ్వత్థామ

నిద్రపోతున్న ద్రౌపదీ పుత్రుల శిరస్సులు ఖండించి తెచ్చి సమర్పించి
లోకమంతయు న పాండవంబయ్యెడు బ్రహ్మాస్త్రం ప్రయోగించగా
నారాయణుడి ఆనతితో నరుడు ప్రయోగించాడు మరో బ్రహ్మాస్త్రం.
రెండిటి వేడికి త్రిభువన త్రాసంబు కాగా నరుడుపసంహరించె రెండిటినీ.

అప్పటికీ, ఇప్పటికీ పెద్ద తేడా కనబడదు యుద్ధ వ్యూహాలలో,
సంహారమే గాని ఉపసంహారం తెలియనివాళ్లు నేటి అశ్వత్థామలు
ఏ కృష్ణుడో వచ్చి చక్రం అడ్డువేస్తేనే ఉత్తర గర్భం నిలబడుతుంది.
పరీక్షిత్తు, జనమేజయుల కాలం నుంచి జనమే జయం అనే కాలం వస్తుంది.

ధర్మగో వృషభాల్ని తన్నిన కలిపురుషుడిని నిగ్రహించాడు పరీక్షిన్మహరాజు
ప్రాణి వధ, స్త్రీ హింస, ద్యూతం, మధుపానమున్న స్థానాలలో ఉండమన్నాడు.
తండ్రిని కాటువేసి చంపిన తక్షకుడిపై పగ తీర్చుకోదలిచాడు జనమేజయుడు
సమస్త నాగనాశ సర్పయాగం, అగ్నిలో, మంత్రజలంతో 'అపంచ ప్రాణోహం!'

*****

# 16. అపంచ ప్రాణోహం అస్మి
# తేజస్వ ప్రాణోహం అస్మి

**1**

ఎఖిలీస్‌కు ఎడమకాలి చీలమండ, దుర్యోధనుడికి ఊరువులు,
శ్రీకృష్ణుడికి కాలి బొటనవేలు మరణ మర్మస్థానాలు.
త్రేతాయుగపు బాణపు ములికి ద్వాపరంలో గుచ్చుకుంటుంది.
అవతారం ముగిసేప్పుడు ఆక్రందన నింగినంటుకుంటుంది.

దేవుడిలో మనిషిని చూడడానికి పెద్దగా కష్టపడనక్కరలేదు
మనిషిలో దేవుడిని చూడడానికి చాలాదూరం నడవాలి
రామాయణంలో రాక్షసుల కన్నీరు, సర్పయాగంలో నాగుల అసహాయత
జయ, విజయ గాథల్లో వెదుక్కోవాలి జాగ్రత్తగా భూతద్దాలతో

కొత్త ప్రపంచంలో జరిగిన నరమేధాలు లెక్కలకందవు,
ఆర్యపుత్రుల యూదు యాగాల్లో బతికిన వాళ్లెందరు?
అన్ని విభజన రేఖల దగ్గరా కపాలపురాల కూడికలు
శాంతి పర్వం కన్నా యుద్ధగీతాలపై మక్కువ చూపుతారు.

నీరు, అగ్ని, నేల, ఆకాశం, గాలి పంచభూతాలకు శ్వాస ఆడడం లేదు.
కరోనా సోకినట్లు ముఖాన మాస్కులతో, లాక్‌డవున్లో దాక్కున్నాయవి
అందరూ పోట్లాడుకుని మానవత్వాన్ని ఐసొలేషన్‌లో ఉంచారు.
ఎత్తుకు పైఎత్తులతో వాక్సీను తాయెత్తులు కట్టుకుంటున్నారు.

*****

## 2

ఎవరి కోసం మోగుతున్నాయా మరణ మృదంగాలు?
యముడి మహిషపు గంటల చప్పుడు ఆగకుండా వినిపిస్తున్నదెందుకు?
రహదారిపై అంబులెన్సు సైరన్ కేకలు క్షణం తీరిక లేకుండా,
అక్కడ వైతరణి దాటించే పడవ నెక్కేందుకు పెద్ద 'క్యూ'లైన్లు.

ద్వేషపు నది 'స్టిక్స్'ను దాటే ముందు దేవతకు దణ్ణం పెట్టు,
ఇది 'ఎఖెరాన్' – బాధల నది ఈ రెండు నదుల్ని దాటాలి 'కారాన్' పడవలో
అదుగో 'లెథె' – మరపు ప్రవాహం, దాని నీటిని తాకే బూరుగు శాఖ
ఆ శాఖను ముట్టుకుంటే అన్నీ మరచిపోయేంత నిద్ర.

అగ్నిప్రవాహం 'ఫ్లెగెతాన్' – దానిలో పరిశుద్ధమవుతుంది ఆత్మ
ఇది 'కొసిటర్స్' రోదనల నది – ఇది దాటితే ఏడుపులు వినిపించవు
ప్రపంచం చుట్టూరా ఉండేది ఓసియానస్ – అదే భూమికి అంచు
తెచ్చుకున్నావా నోట్లోనో, అరచేతుల్లోనో కనీసం ఒక్క నాణెం?

లేకుంటే ఎక్కనివ్వడు పడవ, సరంగు కారాన్ బహు నిరంకుశుడు
అగ్నిగోళాల్లా కళ్లు, మురికి దుస్తులు, వంకర ముక్కు, చింపిరిజుట్టు గడ్డం
అంత్యక్రియలు సరిగా చేయబడని ఆత్మలను తరిమివేస్తాడు.
తార్తారస్ నరకద్వారం ముందు మూడు తలలకుక్క సెర్బెరస్‌ను ఉసిగొలుపుతాడు.

*****

## 3

పోలీసు కుక్కలా వాసన పట్టేస్తుందా భయంకర జాగిలం.
సింగిల్ జడ్జి, బెంచ్, జ్యూరీ ఇవన్నీ దేశాన్ని బట్టి మారతాయి.
సగటు మనిషికి అస్ఫోడెల్ మైదానాలలో కేటాయిస్తారు భూమి
ప్రేమ ఫలించని వాళ్లు తిరుగుతుంటారు దుఃఖపు వనాల్లో.

స్వర్గ సుఖాలన్నీ పుణ్యమూర్తులకు 'ఎలిషయం'లో శ్రమ కానరాని చోటున
నరకలోకమంతా 'ఒన్‌వే ట్రాఫిక్' – వెళ్లడమే, వెనక్కి రావడం అరుదు.
పాము కరిచి 'యురిడైస్' చనిపోతే ఆమెను వెదుక్కుంటూ ఆర్ఫియస్–
నరకాధిపతి హేడ్స్ వరమిచ్చాడు అతడి గంధర్వ గానానికి ముగ్ధుడై

'తీసుకువెళ్లు నీ భార్యను, నరకం దాటేవరకూ వెనక్కి తిరిగి చూడకు'–
తాను నరకద్వారం దాటగానే వెనక్కి చూసాడు, ఆమె ఇంకా దాటలేదు.
అంతే, యూరిడైస్ కాంతిపుంజం నరకపు చీకటిలో కలిసిపోయింది
దైవశాసనాలు, రాజాజ్ఞ, పెద్దల మాటలు పైపైన విని ఆచరించేది కావు.

సావిత్రి మాత్రమే తన భర్త సత్యవంతుడిని తెచ్చుకోగలిగింది సజీవంగా!
పాము కరచి చనిపోయింది ప్రమద్వర, ఆమె భర్త 'రురు'డు
'రురు' తన ఆయుర్దాయంలో సగమిచ్చి బతికించుకున్నాడు ప్రియురాలిని.
కనిపించిన పామునల్లా చంపుతూ పోయాడా తరువాత చాలాకాలం!

*****

## 4

ఆఖరి కుమారుడు అగ్ని-కగుత్శుచిని ప్రసవిస్తూ కాలిపోయింది ఇజనామి.
అంతులేని దుఃఖంతో ఆమె భర్త 'ఇజనాగి' వెళ్లాడు 'యోమి' పాతాళం
పాతాళపు నీడల్లో నీడలా కనిపించలేదామె, వినిపించింది స్వరం
'నేను రాలేను, ఇప్పటికే తిన్నాను మృతుల లోకపు ఆహారం'-

ఆమెను చూడాలన్న కోరిక చావక వెలిగించాడు చిరుదివ్వెను,
చూసాడతడు, పురుగులు పట్టి దుర్వాసనతో కుళ్లుతున్న మాంసం ముద్దను;
అంతే వెనుదిరిగి చూడకుండా వేగంగా పరిగెత్తాడు ద్వారం వద్దకు.
వెంటబడింది ఇజనామి- 'రా, పెనిమిటీ, నన్ను కౌగలించుకో'-

ఆమె అరుపులు, ఉరుములు, మెరుపులు, పాతాళ పిశాచాలు, పొగలు
ఆగలేదతడు బయటకు వచ్చి నరక ద్వారాన్ని మూసాడు పెద్ద బండరాతితో.
ఆమె రోదనలు, కేకలు వినిపిస్తూనే ఉంటాయి అన్ని స్మశానాలలో,
పవిత్ర స్నానం చేసి సూర్య చంద్రులను తుఫాను దేవుడిని సృష్టించాడు ఇజనాగి

సూర్యుడు ఉదయించే దేశం - నిహాన్, నిప్పాన్, అదే జపాన్
అన్ని ప్రాక్కథలూ ఎక్కడో ఒకచోట ఒక్కలానే ఉంటాయి.
సమాధుల్ని కెల్లగించి చూస్తుంది మూలాల అన్వేషణలో నవీన శాస్త్రం
ప్రతి కంకాళం వెనుక కానవస్తుంది అస్పష్టంగా ఆనాటి జీవన యానం.

*****

## 5

నిర్మల నిశీథి నింగిలో పాలపుంతలా కానవస్తుంది నైలునది.
మళ్లీ బతకాలన్న ఆశతో ఫారోలు కట్టించుకున్నారు పిరమిడ్లు
ఈజిప్టు దేవతలందరూ దైవీకరించబడిన జీవన ప్రతీకలు
సూర్యుడి రాత్రి ప్రయాణంతో మృతుల ఆత్మలకు ముడిపెట్టుకున్నారు.

సూర్యనౌకలు రెండు, పగటి నౌక–మాందెజెత్–మిలియన్ల సంవత్సరాల నౌక
సాయంకాలపు నౌక మెసెత్‌తెత్ – సూర్యుడితో పాటు మృతాత్మలు,
నలభై రెండుమంది న్యాయాధిపతులు, వాంగ్మూలం వాళ్లముందు
మృతుడి గుండె తూయబడుతుంది, 'మాత్' సత్యపు పక్షి ఈకతో

బరువెక్కువున్న పాపపు గుండెను భక్షిస్తుంది అమ్మిత్ రాక్షసి
మంచివాళ్ల గుండెలు మాత్ ఈక కంటే తేలికగా ఉంటాయి.
ఆ ఆత్మలు 'ఆరు' రెల్లుపొలాల్లో హాయిగా కాలం గడుపుతాయి.
మృతుల లోకంలో ప్రవేశించిన తొలి మానవుడు ఒసిరిస్ అయినాడు న్యాయమూర్తి

యముడూ అంతే సూర్యుని కుమారుడు, మరణించిన తొలి మానవుడు
అన్ని కథల్లోనూ కానవస్తాయి నరకలోకపు శిక్షలు, చిత్రగుప్తుడి లెక్కలు
పాపపుణ్యాల బేరీజు వేసేందుకు 'తుల'లు, సున్నితపు త్రాసులు
పుణ్యలోకపు మోనాటనీ కన్నా పాపద్వీపపు గాలి, వాయోశ్చ ప్రణోహం!

*****

# 17. వాయోశ్చ ప్రాణోహం అస్మి ఆకాశస్య ప్రాణోహం అస్మి

**1**

నేల, నీరు, నిప్పు, గాలి, నింగిల జ్ఞానమే, నీ గురించి నీవు తెలుసుకోవడం!
వాటి గురించి తెలుసుకున్నావు కాని, నీ గురించి తెలుసుకునే తీరిక లేదు.
జీవన ప్రదేశం మిష మీద ఎండమావుల్ని వెంటాడే మిషన్లే అన్నీ!
విశ్వాంతరాళాల్లోకి చూస్తావు కాని హృదయంలోకి తొంగి చూడవు.

అంతా పదివేలేళ్ల ప్రాపంచిక జ్ఞానం, ఆరువేలేళ్ల అక్షర విజ్ఞానం
మరణానంతర జీవనంపై మహాశ్రద్ధ, బతుకు కన్నీటిపై కొరడా దెబ్బ
మేధో మథనాలలో కురిసిన ప్రేమవర్షాలు తక్కువ, ద్వేషపు తుఫానులే అన్నీ
అప్పుడు వాళ్లు క్షీరసముద్రాన్ని చిలికి సాధించాలనుకున్నారు అమృతాన్ని.

చిలకడం బాగా వచ్చు వాళ్లకు, పాలల్లోంచి చిలుకుతున్నారు కలల్ని
మందర పర్వతం కవ్వంగా, వాసుకి సర్పం తరితాడు కాగా,
దేవతలు, దానవులు ఉమ్మడిగా చేసిన ఏకైక ఘనకార్యమిది
దానవులది మొండిపట్టు, దేవతలకు రివర్స్ సైకాలజి తెలుసు.

తుచ్ఛమైన తోకను వదిలేసి స్వచ్ఛమైన తలవేపు పట్టుకున్నారు దానవులు
మందర పర్వతం అడుగున ఆధారంగా ఉన్న మహాకూర్మం నవ్వుకున్నది.
వాసుకి తల కక్కిన, విషం దెబ్బకు తలలు పట్టుకున్నారు దేవదానవులు
లోకహితార్థం హాలాహలాన్ని మింగాడు ఆదిదేవుడు, ఇప్పటికీ మింగుతూనే ఉన్నాడు.

*****

## 2

ప్రకృతిని చిలకడమనేది పెద్ద పరిశ్రమ, పెట్టుబడి, లాభాలు
తెల్లటి ఏనుగుల్ని ఇంద్రుడు, తెల్లటి గుర్రాల్ని 'బలి' తీసుకున్నారు
కామధేనువు బ్రహ్మకు, లక్ష్మి విష్ణువుకు, రంభాది అప్సరసలు గంధర్వులకు
అసురులకు వారుణి, అదితికి చెవిపోగులు, శంఖ సారంగాలు శ్రీహరికి.

శివుడికి ముట్టిందల్లా మింగిన హాలాహలం, తలపైన నెలవంక
అమృత పాత్రతో ధన్వంతరి పుట్టాక మొదలైంది అసలు గొడవ.
ధన్వంతరి చేతిలోని అమృత కుంభాన్ని లాక్కుని దానవులు తీసారు పరుగులు
చావులేని మందు చక్కగా మనకబ్బెనని సంతోషిస్తున్నారా దనుజులు

అప్పుడు ప్రత్యక్షమయ్యింది కపట యువతీరత్నం జగన్మోహిని
అంతా కార్పొరేట్ స్టైలు, షేర్లు, డివిడెండ్లు, బోనస్‌ల వాగ్దానాలు,
అస్మదీయులందరికీ పంపకాలయ్యేసరికి అమృతభాండం ఖాళీ
తస్మదీయులు మరల తలలు పట్టుకుని దిగారు కయ్యానికి

గుక్కెడు అమృతం తాగిన స్వర్భానుడనే దానవుడి తల తెగింది.
తన గురించి చెప్పిన సూర్యచంద్రుల్ని గ్రహణంలా మింగే రాహుకేతువులయ్యింది
ఈసారి దేవాసుర యుద్ధంలో అమృతం తాగిన దేవతలు గెలిచారు.
బలి చక్రవర్తి ఇంద్రుడి గద్దె వదిలి పశ్చిమానికి తరలిపోయాడు.

*****

## 3

అలా పశ్చిమానికి తరలిపోయిన వాళ్లది కొత్త ప్రపంచం కావచ్చు
కేతుమాలా ద్వీపంలో అనేక తెగలుగా బతుకుతూ ఉండవచ్చు
ఉత్తర దక్షిణ ధృవాల మధ్య నడుస్తూ పోవడానికెంత కాలం పట్టిందో.
ఇరవై నాలుగు వేలేళ్ల క్రితం అమెరికాలలో మనుషులు లేరంటే నమ్మలేం.

ఓ మనిషీ తిరిగి చూడు! రెండు లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికా
డెబ్భైవేల ఏళ్లక్రితం అరేబియా, అరవై అయిదు వేలేళ్లప్పుడు ఇండియా
ఇండొనేషియా, ఆస్ట్రేలియా, నలభై అయిదువేలేళ్ల క్రితం మంగోలియా, చైనా
యూరప్, ఇరవై వేలేళ్ల క్రితం అమెరికాలో నీవు లేవన్నదే నిజం.

ఆఫ్రికాలో పుట్టి, అరేబియాలో ఆగి, ఇండియాలో పెరిగి,
యూరప్, మంగోలియా, చైనాల నుంచి చెల్లాచెదురై
బేరింగ్, ఇండొనేషియా నేల, జల మార్గాల ద్వారా
సుదూరం అమెరికా, ఆస్ట్రేలియాలకు మనిషిని నడిపించినదే శక్తి?

ముందుకు పోవడాలు, వెనక్కి రావడాలు, వలస సముద్రాల ఆటుపోట్లు
అనాది ప్రజల ముఖాలన్నీ ఇంచుమించు ఒకేలా ఉంటాయి.
ఆరువేల సంవత్సరాల క్రితం నుంచి ఆలోచనలెక్కువయ్యాయి.
కొందరు ఆగిపోయి ఊరులయ్యారు, కొందరు ప్రవహించే ఏరులయ్యారు.

*****

## 4

ఊరు ఊరుకోనివ్వదు, ఉన్నచోటనే ఉరుకులు పరుగులు పెట్టిస్తుంది
దాచుకోవడం మొదలయ్యాక దోచుకోవడం ధర్మమవుతుంది.
గీతలు, కంచెలై, కోటగోడలై బతుకుల్లోనూ గోడలేర్పడతాయి.
ధైర్యము, బలమున్న వాడికి తొలి అనుభవపు హక్కులొస్తాయి.

రాజులు, పూజారులు, పశువుల కాపరులు, పనివాళ్లు, బానిసలు;
దేవుళ్లకు మనుషులవసరం, మనిషికి దేవుళ్ల అవసరం పడిన రోజులు
దేవతల శ్రమ సంచుల్ని మోయడానికి గోపురాలు కట్టడానికి మనుషులు
మనుషుల పనులు చేయడానికి బానిసలు, బానిసల కోసం యుద్ధాలు.

ఏరు ఏరుకోనివ్వదు, ఆగకుండా పరిగెడ్తూనే ఉండాలి ఆకలి వెంట
తీరాల వెంబడి దోనెల్లోనో, బల్లకట్టుల్లోనో అలల మీద స్వారీ
మంచుయుగపు చలికి, భూమధ్య రేఖ వేడికి మధ్య పరుగు,
మోనార్క్ సీతాకోకచిలుకలు, సాల్మన్ చేపలు, వలస పక్షుల్లా!

సంచార జీవనులకు సరిహద్దులుండవు, నీదీ నాదన్న జ్ఞానముండదు
ఇక్కడ ఇబ్బందులొస్తే ఇంకాస్త ముందుకు, ఇలా దిగంతాల వరకూ-
ఊరుబుద్ధి వాళ్లు ఊళ్లు కట్టుకుంటారు, ఊరుకోలేక కొట్టుకుంటారు
ఏరుబుద్ధి వాళ్లు వెళ్లిపోతూనే ఉంటారు, పాదాలకు పడవలో, చక్రాలో కట్టుకుంటారు.

*****

## 5

ఊరువాళ్లకు గ్రామదేవతలు, నగర రక్షక దేవతలు, స్థానిక ధర్మ న్యాయాలు
సంచారులకు విశ్వదేవతలు, ప్రకృతి భూతాలు, భయం భక్తి రూపాలు
వాళ్లూ వీళ్లూ కలిసినచోట నాగరీకులది పైచేయవుతుంది
గెలిచినవాళ్ల శిలాశాసనాల అక్షరాలలో పరాజితుల కన్నీళ్లుంటాయి.

ఉరు, ఉరుక్, వేయివాకిళ్ల వావిలోనియా, నిప్పూర్, లగాష్, కుష్
అస్సిరియా, అమరెట్లు, రా-రవి, సూర్య చంద్ర వంశాలు, పిరమిడ్లు
మరణానంతర జీవనాలు, జలప్రళయాలు, ఖండాంతర ప్రణయాలు
కల్పవృక్షాలు, కామధేనువులు, అతీంద్రియ శక్తులు ప్రాక్కథలవుతాయి.

గవేషణలు అన్వేషణలై, అశ్వమేధ, నరమేధాలతో కురుక్షేత్రాలు
గోగ్రహణాలతో అజ్ఞాతవాసాలు, గ్రహణ విముక్తులు, కొత్త సవాళ్లు
పాచికలాటతో మొదలై పిండాకూళ్లతో ముగిసే సమరాలు
అందరూ రక్త సంబంధీకులే, రక్తం కళ్లచూడకుండా బతకలేరు.

వార్ అంటేనే వెర్రి, వేయి విధాలుగా వేధించి చంపుతుంది.
వీరగాథలు వింటానికి బాగానే ఉంటాయి, చూస్తే జుగుప్స కలుగుతుంది.
గెలిచినవాళ్లు ఓడినవాళ్లను బానిసలుగా చేసుకునే ముందు ఓ ప్రక్రియ ఉంటుంది
ఆ కన్నీటి స్త్రీ పర్వపు మానభంగ ఘట్టంలో తలలు వంచడం పూర్తిగా- త్రిగుణస్య!

*****

# 18. త్రిగుణస్య ప్రాణోహం అస్మి

## 1

గుణనం నుంచి వచ్చింది 'గుణ', ద్విగుణ, త్రిగుణాల వర్ణన
సత్వ, రజో, తమో గుణాల పాళ్లను బట్టి ఉంటుంది జీవి స్పందన
మార్పును తెచ్చే శక్తి రజస్సు, సమతుల్యతను సమీకరించేది సత్వం,
ప్రక్రియను ఆపడమో, ముగించడమో నిర్ణయిస్తుంది తమస్సు.

మార్పును తెచ్చి ఇచ్చే ప్రక్రియలో రజస్సును కొంత కోల్పోతుంది స్త్రీ, ప్రకృతి
అమ్మలగన్న అమ్మ స్థానం నుంచి ఆమెను పాదదాసిగా లాగడమొక రాజకీయం
శక్తిస్వరూపిణిని సంపదగా పరిగణించడమొక కుటిల సాంప్రదాయం
మాట్లాడే హక్కు, ఓటుహక్కు, జీవించే హక్కును హరించడమేమి న్యాయం?

ట్రాయ్ పతనమైంది, కత్తి పట్టిన ప్రతి మగవాడూ కత్తి కెరైనాడు
ఆడవాళ్లను, బంగరు వెండి పాత్రలను, ఒకచోట కుప్పగా నిలబెట్టారు
కేటాయింపులు మొదలయ్యాయి, నిన్నటి మహరాణి హెకుబా నేడు ఒడిస్యూస్‌కు బానిస
హెక్టార్ భార్య ఏండ్రొమాఖీ తన భర్తను చంపిన ఎఖిలీస్ కుమారుడికి దక్కింది.

-'ఏండ్రోమాఖీ, నీ కుమారుడిని కోట బురుజు మీద నుంచి కిందకు పడవేసి చంపారు తల్లీ!'
-'అవును, నేనిప్పుడు పడుకోవాలి, నా ప్రియ భర్తను, కొడుకును చంపిన వాడి పక్కలో'-
హెకూబారాణీ, నీ కుమార్తె పూజారిణి కాసాండ్రా, ఆగమెమ్నాన్‌కు రేరాణి.
హెలెన్ భవిష్యత్తు కాలం నిర్ణయిస్తుంది, ట్రాయ్ నగరం మంటల్లో కాలిపోతున్నది.

*****

## 2

అక్కడ హెకుబా, ఇక్కడ గాంధారి ఇద్దరూ మహరాణులే!
గాంధారికి తాత్కాలిక దివ్యదృష్టి కలిగింది సంగర తలాన్ని చూసేందుకు.
ఎక్కడ చూసినా నర, అశ్వ, గజ మృతదేహాల కుప్పల కుప్పలు.
శోణిత పంక్త దిగ్ధాంగులైన భూపతుల శరీరాలపై కాకులు గ్రద్దలు.

ఎవరు మిగిలారు? నేతికుండల్లో పెట్టి బతికించుకుంటే నేడు నేలపాలయ్యారు
ఒక్కతరం కక్షలకు రెండు తరాల జనులు సర్వనాశనమయ్యారు
గాంధారి, కుంతి, ద్రౌపది, హిడింబి, సుభద్ర, ఉత్తరాది అసంఖ్యాక స్త్రీలు,
రోదించని వారెవరు? పద్ధెనిమిది అక్షౌహిణీల మగవాళ్ల మరణాలు

డెబ్బై ఆరు కోట్ల నలభైనాలుగు వేల మూడువందల ఇరవై మంది మృతులు
పద్ధెనిమిది రోజుల యుద్ధంలో బతికి బయటపడింది- పన్నెండుగురు
ధర్మరాజు, భీమ, అర్జున, నకుల, సహదేవులు, సాత్యకి, యుయుత్సుడు,
కృతవర్మ, వృషకేతు, కృపాచార్య, అశ్వత్థామ - జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణుడు

గాంధారి తిట్ల వలనో, శాపం వలనో కొట్టుకు చచ్చారు యాదవులు
దుఃఖసాగరములో మునిగిపోయారు వాళ్ల వధూజనములు
అన్నీ తెలిసినవాడు అవతారం చాలించాడు ద్వాపర యుగాంతాన
మహాప్రస్థాన ఘట్టం తరువాత మరో భారత కథ మొదలవుతుంది.

*****

## 3

ధర్మజుడు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది
వారిని అనుసరించి విడువక ఓ మహాశునకం నడుస్తున్నది
మేరు సమీప భూమినమేదిని బడినది ద్రౌపది – ఆమె అర్జున పక్షపాతి,
ఆ తరువాత, తాను ప్రాజ్ఞుడనన్న భావమున్న సహదేవుడు,

రూపాతిశయ అహంకృతిచే నకులుడు, విలువిద్యా గర్వముతో అర్జునుడు
భోజన ప్రియత్వం వలన భీముడు కూలినారు ఒకరివెనుక ఒకరు.
తనతో వచ్చిన శునకం లేకుండా తాను స్వర్గానికి రానన్నాడు ధర్మజుడు
అందరూ నిన్ను విడిచిపోయినా ఆఖరి వరకూ నీతోనే ఉండేది ధర్మం.

తన కుమారుడి ధర్మబుద్ధికి మెచ్చి స్వస్వరూపాన ప్రత్యక్షమైనాడు యముడు
స్వర్గ నరకాలలో బంధుమిత్రుల్ని చూసి చలించాడు ధర్మనందనుడు
ఇంద్రుడి కుక్క 'సరమ'తో మొదలై యముడు శునకరూపంతో ముగింపు
భూత వర్తమాన భవిష్యత్ సంఘటనలన్నీ భారతంలో కనబడడమే ముక్తాయింపు.

ఇరవై ఏళ్ల తరువాత ఇంటికి వచ్చిన ఒడిస్యూస్‌ను గుర్తుపట్టింది
'ఆర్గాస్' అనే ఆ కుక్క తోకాడిస్తూ అతడి పాదాల వద్ద కన్ను మూసింది
నరకలోక ద్వారం ముందు ఉన్నా, మన ఇంటి గుమ్మం వద్ద ఉన్నా
మనిషికి మంచి స్నేహితుడు శునకం, మనిషికా గుణం ఉన్నా, లేకున్నా!

*****

## 4

పున్నామ నరకంలో పడకుండా పుత్రకామేష్ఠి యాగాల జోరు,
అదృశ్యమైన వంద మిలియన్ల ఆడపిల్లలకు జవాబుదారీ ఎవరు?
భయాన్ని, బానిసత్వాన్ని ఉగ్గుపాలలో కలిపి ఆడపిల్లలకు తాగిస్తారు.
ధైర్యాన్ని, పెత్తనాన్ని బుర్రలోకెక్కించి మగపిల్లలను నడిపిస్తారు.

ఎవరింటికి వారు ఏక తాలిబన్‌లా ఉండాలనుకుంటారు
వంటింటి రాజ్యం, ఖాళీ నిధుల పెట్టె తాళాలప్పగిస్తారు
మగ భావాల సూత్రానికి నీతుల ముత్యాలను గుచ్చుతారు
కచ్చుడాలను కట్టి, కాపలాలు కాసి రాళ్లతో సిద్ధంగా ఉంటారు

అందానికి విలువను సృష్టించాక ఆమె దేహమో ప్రయోగశాల
శృంగారపు విఫణిలో గడియారపు ముళ్లమధ్య అద్దె కొంప
అన్ని కత్తెరలూ, పౌడర్లూ అంటకాగే ప్రపంచ అందాల పోటీ ఆవరణ
స్వేచ్ఛా నగ్నత్వం, కట్టుబాటు బురఖాల మధ్య కత్తిసాము అఖాడా

సహస్రాబ్దాల చెరసాలల పునాదులు బాగా లోతైనవి
ఆచారపు పంజరాలు అత్యంత కఠిన లోహ నిర్మితమైనవి.
జరా, రోగ, మరణ దాడుల కన్నా నిర్బంధపు దాడి పదునైనది
అమ్మతనం అమ్మకాల రోజుల్లో కన్నీళ్లను కోల్పోయిన కాయమైనది.

*****

# 5

ఎక్కడి ఆడపిల్లలక్కడే గుప్‌చుప్, ఒంటిస్తంభపు మేడల్లో,
యుద్ధాలు, వేటదారుల్లో మగవాళ్లు దాటుతారు సముద్రాలు
స్థానిక మగవాళ్లను నిశ్శేషం చేసి మహిళలను పంచుకుంటారు
మంగోలులైనా, సుల్తానులైనా, సీజర్లైనా, సికిందర్లైనా దృశ్యం మారదు

తమ సోదరుడిని తామే చంపుకున్నందుకు కోపం వచ్చింది ధర్మరాజుకు
–'భవదీయ మంత్ర కార్యగోపనం వల్ల జరిగింది ఈ గొడవంతా
ఇక నుంచి అంగనా జనమ్ములకు రహస్య రక్షణంబునందలి శక్తి
మనంబులందు కలుగ కుండెడు మెల్లలోకముల' – శపించాడతడు.

తాను నిర్గుణుడు, దుర్గుణుడైనా సహచరి సద్గుణ బ్రహ్మ కావాలి
తామస ప్రకృతి తనకున్నా నోరుమెదపని సాత్విక అర్ధాంగి రావాలి
సగం దేహం, సగం ఆకాశాన్ని, రంగుటద్దాలలో చూపిస్తారు
భూమిని నూరుశాతం ఆక్రమించుకోడానికి పవిత్ర యుద్ధాలు చేస్తారు.

యిన్–యాంగ్, ప్రకృతి–పురుషుడు మధ్య సమతుల్యత అవసరం
ఘటాలు, ఘట్టాలలో మార్పున్నా జనన మార్గం, సుఖప్రాప్తి దారి ఒక్కటే
ఆదిదంపతుల రూప వివేచన, అర్ధనారీశ్వరతత్వం, అమ్మ శబ్దం
త్రిగుణాత్మకమైన మహా ప్రణవ నాదాంతర్గత స్త్రీశక్తి స్వరూపం– 'సర్వోహం'

*****

# 19. సర్వోహం సర్వాత్మా కోహం

## 1

–అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః–
అతడు సర్వావృత్తులలో ఉన్నాడన్నాడు ప్రహ్లాద కుమారుడు,
ఎందును లేడు, లేడన్నాడు తండ్రి దైత్యేంద్రుడు హిరణ్యకశిపుడు
– 'నానా జంగమ స్థావరోత్కర గర్భంబులనన్ని దేశములో ఉన్నాడు'

వరాలిచ్చే వాళ్లుంటే మనమేదైనా అడుగుతాం, ముఖ్యంగా మృత్యువు లేని జీవనం.
గాలిలో, నేల మీద, అగ్నిలో, నీళ్లలో, నింగిలో, పగలు, రేయి వేళలలో
మృగ వ్యాళాదిత్య నరాది జంతువులతో, సమస్త అస్త్ర శస్త్రావళితో
దేనితోనూ నాకు చావు రాకుండా చేయమని బ్రహ్మను అడిగాడతడు.

మనమెన్ని తిప్పలు పడినా, ఎక్కడ దాక్కున్నా వదలదు మృత్యువు.
మనిషి–జంతువు కాని నరసింహ రూపంలో, పగలూ రేయీ కాని సంధ్యాసమయంలో
ఇంటా బయటా కాని గుమ్మం మీద, నింగీ నేలా కాని తన తొడల మధ్యంబున
ప్రాణముండీ లేనట్టి చేతిగోళ్లతో పొట్ట చీల్చి చంపాడు శ్రీనృసింహ దేవుడు

నానా కష్టాలు పడి గిల్గామేష్, సంపాదించుకున్నాడు మృత్యులతను.
జలప్రళయం నుంచి బతికి అమరుడైన 'ఉత్నాపిస్తిమ్' మాట అర్థం కాలేదు
ఎక్కడి నుంచి వచ్చిందో పాము ఎత్తుకుపోయింది ఆ వనమూలికను
కుబుసాన్ని విడవడం పునర్జన్మ, కాని ఆ కాసేపూ అనుభవించాలి నరక యాతన

*****

## 2

సముద్రంపై వీచేగాలిని నేను, మహోధృత తరంగాన్ని నేను
ఆకుల గుసగుసను నేను, సూర్యకిరణ బాణాలను నేను
వెన్నెలను నేను, నక్షత్రకాంతిని నేను, నింగిని చుంబించే వృక్షశక్తిని నేను
అగ్నిజ్వాలను నేను, మొగ్గగా పుట్టి పూవుగా వికసించే ఆలోచన నేను.

సత్యకాంతిని, ప్రేమాగ్నిని, కోప సముద్రాన్ని, ప్రశాంతతా సరోవరాన్ని నేను
మానవ పాపాల పెనుతుఫానును, దుఃఖ హృదయపు ఆశా సమీరాన్ని నేను
ప్రాపంచిక కోర్కెల పొడి ధూళిని, కరుణా ఫలాలనిచ్చే తడినేలను నేను
చరాచర జీవుల ప్రకటిత అప్రకటిత భాషను, భావాన్ని నేను.

అన్ని చోట్లా నీవే వుంటే అలవైకుంఠపురం నుండి పరిగెత్తుకు వచ్చావెందుకు?
అన్నీ నీవే అయితే నీమీదనే నీ చక్రప్రయోగాలెందుకు?
ప్రశ్నను ఆశ్చర్యార్థకంగా మార్చి అతిశయోక్తుల మీద పయనమెందుకు?
సర్వశక్తిమంతుడికి ఇన్ని అవతారాలూ, ఇంత కాలవ్యయమెందుకు?

కుక్కగాని కుక్కగా, స్త్రీగాని స్త్రీకి, ఉనికిలేని ఇంట్లో పుట్టిందెవరు?
స్త్రీగాని స్త్రీకి భర్త మనిషి కాని మనిషెవరు? కుక్కగాని కుక్కను పెంచినదెవరు?
పసిపాపగాని పసిపాప, ఆ కుక్కగాని కుక్క చావాలేదు బతికీ లేదెందుకు?
పురుగు కాని పురుగును మింగిందతడి తల్లి గర్భం; అతడి తండ్రే అతడి మేనమామ ఎలా!

*****

## 3

పొడుపు కథలన్నీ ఇట్లాగే పొడుస్తూనే ఉంటాయి విప్పేదాకా,
ఇది ఐరిష్ వీరుడు కు-కులన్ (కులన్ కుక్క) - అనే శతాంతుడి కథ
శతాంతుడి తల్లి దీక్తిని, ఆమె అల్‌స్టర్ దేశపు కంకొబార్ సోదరి
ఆమె రథ సారథ్యం అల్‌స్టర్ దేశమంతా ప్రసిద్ధికెక్కింది.

మాయాపక్షుల్ని వేటాడుతూ దారితప్పారు అన్నాచెల్లెళ్లు, సైనికులు
మంచు తుఫానులో చిక్కుకున్నప్పుడు వారికికనిపించిందో ఇల్లు.
అర్ధరాత్రి ఆ యింటి యజమానురాలు ప్రసవించింది మగశిశువును
ఆడగుర్రమొకటి కన్నది రెండు అందమైన గుర్రపు పిల్లలను

తెల్లవారే సరికి అక్కడ ఇల్లూలేదు, ఇల్లాలూ లేదు; శిశువులు తప్ప
దీక్తిని పెంచింది వాళ్లని, కాని, మగశిశువు చనిపోయాడు జబ్బుచేసి
అప్పటికే 'దీక్తిని'కి నిశ్చితార్థం జరిగింది 'సువాల్తమ్' వీరుడితో
లోకం కోడై కూస్తున్నదప్పటికే ఆ చనిపోయిన శిశువు గురించి.

ప్రేమదేవుడి పేరు లగ్ (లువ్, లవ్), చనిపోయిన శిశువును చేర్చాడు దీక్తిని గర్భంలోకి
అన్నాచెల్లెళ్ల అక్రమ సంబంధమో, సువాల్తమ్ సుఖ బంధమో,
లగ్ దేవుడి ఆశీస్సులో, దీక్తినికి తెలుసు తనకు పుట్టిన శతాంతుడి జన్మరహస్యం
'కులన్' అనేవాడి కుక్కను చంపి దానికి బదులు కుక్కగా కాపలా కాసాడు శతాంతుడు.

*****

## 4

కులన్ కుక్క కుకులన్‌గా ప్రసిద్ధికెక్కిన శతాంతుడు
ఒంటిచేత్తో ఓడించాడు రాణి మావె సైన్యాన్ని గోగ్రహణమప్పుడు
యుద్ధోన్మాదంతో అతడు దూసుకువస్తుంటే స్వపరభేదం తెలీదు
కుకులన్‌తో పెరిగిన జంట గుర్రాల రథం, రథసారథి లియగ్‌తో అతడజేయుడు

కుకులన్ ఇష్టపడ్డాడు 'ఇమెర్'ను, ఇమెర్ తండ్రికితడిష్టం లేదు.
–'పోయి స్కతాచి వీరవనిత దగ్గర యుద్ధ విద్యలు నేర్చుకునిరా!'
కుకులన్ వెళ్లాడు 'నీడల దుర్గం'లోని స్కతాచి దగ్గరకు
స్కతాచి సోదరి అయోఫిని ఓడించి ఆమెతో కన్నాడు 'కాన్లా'ను.

ఎనిమిదేళ్ల తరువాత తండ్రీ కొడుకుల మధ్య భీకర సమరం
తండ్రిని గుర్తించి 'కాన్లా', గురి తప్పిస్తాడు బల్లేన్ని ఆఖరిక్షణంలో
తాను చనిపోతూ తండ్రికి వెల్లడిస్తాడు చేదు నిజం
రుస్తుం–సొహరాబ్‌ల కథలా మన గుండెల్ని పిండేస్తుందీ వృత్తాంతం.

అనేక యుద్ధ విజయాలు, ప్రేమగాథల నాయకుడికి అల్పాయుష్షు
శత్రువులందరూ కలిసి సిద్ధం చేసారు మూడు మంత్రించిన బల్లేలను
ఒకటి సారథిని, రెండోది గుర్రాలను, మూడోది కుకులన్‌ను కూల్చాయి
శత్రువుల ముందు నేలపై పడకుండా, రాతిస్తంభానికి బంధించుకున్నాడు కుకులన్.

*****

## 5

కుకులన్ తల నరికిన లుగయిడ్ చేతిని నరికింది కుకులన్ కుడిచేయి
చావులోనూ చావని, కుక్కగాని కుక్క, కన్ను మూయకుండానే కన్ను మూసాడు
క్రీస్తుశకం తొలి సంవత్సరంలో చనిపోయిన వీరుడు కుకులన్
ప్రేమదేవుడి కుమారుడు యుద్ధోన్మాద స్థితికి బలైనాడు.

మూడు పాయల శిరోజాలు, పైన స్వర్ణం, మధ్యన రక్తవర్ణం, చివర గోధుమరంగు
బంగరు రంగు ముంగురులు, వంకీలు తిరిగి అలల్లా భుజాలపై కురులు
బుగ్గలపై నాలుగు చొట్టలు, మణుల్లాంటి నేత్రాలలో సప్తవర్ణ కనుపాపలు
పాదాలకు, చేతులకు ఏడేసి వేళ్లు, గ్రిఫాన్ పక్షికున్నట్లు పదునైన గోళ్లు

అతడి ఖండిత శిరస్సును చూసి కలవరపడిపోయారు శత్రువులు
అవి చెప్పే కథలన్నీ ఆనాటి వరకున్న జ్ఞాన ప్రవంతి కథారూపాలు
పాతాళంలో యురిడైసిని పోగొట్టుకుని, కాంతి కన్యలను తిరస్కరించాడు ఆర్ఫియస్
అతడి తల నరికి హెబ్రస్ నదిలో పడవేస్తే, అది లెస్బాస్ దీవికి చేరింది గానం చేస్తూనే.

మిమిర్ దేవుడి తల విశ్వవృక్షపు బావి దగ్గర ఒదిన్‌కు బోధించింది జ్ఞానాన్ని
క్రైస్తవ సాధువుల సమాధుల 'తలవేపు మొలకెత్తేవి పవిత్ర వృక్షాలు–
భూతవైద్యులూ, దువాలియర్‌లు సంప్రదించే 'వూడూ' కపాలం
బర్బరీకుడి ఖండిత శిరస్సు, అరవణన్ తెగిన తల చెబుతాయి భారత యుద్ధసర్వం

*****

# 20. సర్వం ఖల్విదం బ్రహ్మా

**1**

అంతా బ్రహ్మమే, సృష్టి స్థితి లయలు జరిగేది అతడి నుంచే.
అతడు మనోమయుడు, ప్రాణ శరీరుడు, సర్వకర్మశాలి, సర్వకామి
చైతన్య స్వరూపుడు, సత్య నిరతుడు, సర్వగంధ, సర్వరస, సర్వవ్యాపి
ఈ సృష్టి స్థితి లయ కార్యమంతా ఓ మహా క్రతువు. మానవుడూ అంతే!

'ఈ ప్రపంచానికి మూలసూత్రం 'ఇచ్ఛ' అన్నాడు షోపెన్ హోవర్
ఇచ్ఛ అంటే కోరిక వల్ల దుఃఖం; దానితో లోకమవుతుంది శోకమయం
'నీ సంకల్పం ఎలా అయినా ఉండనీ పాతదేవుడు చనిపోయాడన్నాడు' నీషే
అంతా బ్రహ్మమే - అంటే ఏది నీవు కాదో అదే దైవం, అదే ఆదర్శం.

'దేవుడే చనిపోయాడని నేనంటే నమ్మవేమిటి?' అన్నాడు నీషే
కొత్త జరాతుష్ట్రుడి మాటలు ఎవరూ వినలేదు, పైపెచ్చు వెలివేసారు.
మెదడును కాల్చివేస్తున్న ప్రజ్ఞానంతో అతడు పిచ్చాసుపత్రిలో కన్నుమూసాడు
నీషే అధిమానవ వాదం నాజీలకు అభిమాన నాదమైంది.

ఈ భవమయ ప్రపంచాన్నుంచి వాస్తవంలోకి రావాలి ముందు
మనుగడను నిర్ణయించేది జీవన విధానపు చైతన్యశక్తిశీలత.
నిరాశావాదపు మనో వ్యాపారాన్నుంచి ఆశావాదం వేపు మార్చడం
అదనపు విలువ అందరికి అందితే స్వర్గతుల్యమవుతుంది సమాజం.

*****

## 2

ఒకే కొక్కేనికి అనేక లోలకాలు వేలాడుతూ ఊగుతున్నాయి
మార్క్స్ అనుకున్న వర్గరహిత సమాజమింకా ఊగిసలాటలోనే ఉన్నది.
రామ రాజ్యానిదొక దారి, కాలిఫేట్‌లదొకదారి, శిలువ దారి వేరేది
పోతపోసిన కుల, వర్ణ, మత వస్త్రాలు అతుక్కుపోయాయి వంటికి, మనసుకు.

కలలు కను, కాని, వాస్తవంలో బతుకు ఇప్పుడు, ఇక్కడే!
ఇది వాస్తవవాదం, ప్రాగ్మాటిజం, ఫలితాత్మికవాదం.
మన మనుగడకు ఉపయోగపడుతుందా, ఫలితమిస్తుందా,
ఆచరణ సాధ్యమేనా, లేకుంటే ఆలోచించకు, అవతల పారేయి!

అదేం కాదు, అంతా భౌతికమైతే మేధస్సును చూపించు,
అంతా పూర్వ నిర్ణయమూ కాదు, అది సృజనాత్మక పరిణామం
తాను మారకుండా మార్పునకు కారణమయ్యే ప్రాణశక్తి దీనికి కారణం
దానితోనే కళాకారులు సృజనలు చేస్తారు; కలాన్ని జయిస్తారు.

కవిత్వ గోపురాల్లోంచి సమసమాజ పురాల్లోకి రావడమంత సులభం కాదు!
సత్యం, శివం, సుందరం భావనలకు అసంబద్ధ ప్రపంచంలో తావున్నదా?
ప్రతిరోజూ పరిణామం చెందే మానవ స్వభావానికి స్థిరస్థితి ఎక్కడిది?
తన కొరకు తాను, తనలోపల తాను, ఇతరులలోనూ తానుగా ఉండగలమా?

*****

## 3

రెండువేల అయిదు వందల సంవత్సరాల ఆలోచనలు,
పదివేల సంవత్సరాల ప్రళయాలు, నిత్య యుద్ధాలు, పరిణామాలు
దుఃఖం కలిగినప్పుడల్లా, మనం ఎవరు, ఎటుపోతున్నాం అనుకుంటాం.
ప్రసూతి వైరాగ్యాలు ఉపశమించాక మొదలు, మళ్లీ పడక యుద్ధాలు.

ముందు మనుషుల్ని విడదీయాలి మనమంతా మనం, వాళ్లు వేరేవాళ్లు
ఇది మన గుర్తు, మన రంగు, మన నమ్మకం, మన పుస్తకం, మన స్మృతి.
మనం మనుషులం - వాళ్లు బానిసలు, విషప్పురుగులు, చీడపీడలు
మనకోసం ప్రాణాలర్పించే వీరపుత్రుల్ని తయారు చేసుకుందాం,

మన సిద్ధాంతాలెంత గొప్పవో బాకాలూది మరీ చెబుదాం
కలుపుమొక్కల్ని, విషక్రిముల్ని కనిపెట్టి వేరుచేసి నిర్మూలిద్దాం
వాళ్లను ఏరివేయడం తప్పుకాదు, అది నీ ప్రధాన లక్ష్యం
ఇది తప్పని ఏనాడూ ఒప్పుకోవద్దు, ఎత్తిన తల దించవద్దు.

వాళ్లన్నారు– 'సహనానికీ ఓ పరిమితి ఉంటుంది. మీరది దాటుతున్నారు'–
మనమన్నాం– ఆ మాట మీరన్నారంటే మీలోనే పెరుగుతున్నది అసహనం!
రెండు పక్షాలూ సరిహద్దులదగ్గర మానవత్వాన్ని పాతిపెట్టారు.
సహనాన్ని చంపేందుకు అసహన తీవ్రవాదుల్ని అర్ధరాత్రి పంపుతున్నారు.

*****

## 4

ఏపిల్ తోటలూ, కుంకుమపువ్వూ, గాల్వాన్ లోయలూ గాయపడ్డాయి.
ఒకరు గీసిన రేఖను మరొకరు చెరిపేస్తూండడమే శిఖరాగ్ర చర్చ
మనమూ, వాళ్లూ అనే విషయాలు బుల్లెట్లకూ, బాంబులకూ తెలియదు.
నీలోనూ, నాలోనూ ఉండే బ్రహ్మపదార్థం ఎప్పుడు పేలుతుందో చెప్పలేవు.

నాగరికత ఊయలలూగిన చోటే నరమేధాలకు ఆస్కారమెక్కువ.
వాళ్ల దిబ్బలమీద వీళ్ల దిబ్బల మీద ఇంకొకళ్ల దిబ్బలమీద అనంతంగా
దిబ్బల మీద దిబ్బలా, ఎవడు అధికారంలో ఉంటే వాడు కొడతాడు దెబ్బ!
మానవ రక్తం పోసి పెంచిన ద్వేషపు చెట్లు ప్రేమ ఫలాలను కాస్తాయా?

పాలు, తేనె పొంగాల్సిన రాజ్యంలో పాలస్తీనా, ఇజ్రాయెల్‌లింకా సర్దుకోలేదు.
కొలంబస్ కొత్త ప్రపంచంలో తెలుపు నలుపుల మధ్య ఎరుపు ఆచూకీ లేదు.
ఒకే చైనా, ఒకే భారత్, గ్రేటర్ ఇజ్రాయెల్, ఖలిస్తాన్, తమిళగం
వాస్తవాధీన రేఖల వద్ద కలలు గనడం ఆగిపోలేదు.

అన్నీ అన్నదమ్ముల తగాదాలే, ఎవడి దమ్ము వాడిది ఆస్తి పంపకాలప్పుడు
అందరం వలస వచ్చినవాళ్లమే అన్నదెవరికీ గుర్తుండదు
నమ్మిన పతాక కింద నిలబడి సర్వేజనా స్సుఖినోభవత్ అంటూ
పాత కత్తులకు పదునుబెట్టి వసుధైక కుటుంబ కుత్తుకలను కత్తిరించడం

*****

## 5

జీవితాన్ని క్రెడిట్, డెబిట్, ఆధార్ కార్డులుగా మార్చుకున్నాక
భవిష్యత్తును కుదువబెట్టి, వర్తమాన భంగపర్వంలో భూతవైద్యం
నెట్టింట్లో కూర్చుని ప్రపంచ సాలెపురుగు అల్లిన దారాల గూడుపై
అసత్య జీవన సంగీతాన్ని నిత్య ఇలవరసల్లో ట్వీట్ చేయడం.

నీ ఫేస్‌బుక్ ముఖ పుస్తక వదనం ముడతలపై లైకులెన్ని, స్కేరులెన్ని?
నీ బ్లాగోతాన్ని ఎందరు కామెంటు చేసి కండూతి తీర్చుకున్నారు?
నీ టిక్‌టాక్ డాన్సును చూసి మూర్ఛపోయి మంచమెక్కిన వాళ్లెందరు?
నీ వెబ్ పేజీలో కవిత్వానికి వచ్చిన పూలగుత్తులెన్ని, రాళ్లెన్ని?

కర్కశ కరాళ దృక్కులతో కరోనా దేవత నిన్ను కావలించుకుందా?
ఐసొలేషన్ ఘడియల్లో నీ కులపోళ్లు నీకిచ్చిన కన్సొలేషనెంత?
లాక్‌డవున్‌లో నేర్చుకున్న పాఠాలను ఏ మాస్కు వెనక వదిలేసావు?
మానవత్వం వెంటిలేటర్ మీద ఉన్నపుడు ఆక్సిజన్ అమ్ముకున్నదెవరు?

పట్టు వదలని విక్రమార్కుడు పేదరికపు శవాన్ని మోస్తూనే ఉన్నాడు,
సగటు మనిషి భేతాళ ప్రశ్నలకు నోరు విప్పక తప్పని పరిస్థితి,
ఆఖరు కథ తరువాత తల నరకడానికి ద్వేషమాంత్రికుడు నూరుతున్నాడు కత్తి
గడ్డం మీసాలు పెంచిన రాజు ఆలయం దగ్గర అంటున్నాడు- 'ఏ తద్ వై తత్'

*****

# 21. ఏ తద్ వై తత్

**1**

ఇదే దారి, అదే ఇది. సర్వం బ్రహ్మమే, లోనా, బయటా విహారాలు
సత్యమొక్కటే, వ్యాఖ్యాతలు, వ్యాఖ్యానాలు శత సహస్రాలు
విక్రమార్కుడి కథనిండా అక్రమార్కుల దురాగతాలు
శకకర్తల జీవితాలలో నమ్మశక్యం కాని అద్భుతాలు, విచిత్రాలు

ముప్పై రెండు సుగుణాల కథలను చెబుతాయి ముప్పైరెండు సాలభంజికలు
దేవుళ్లు, బుద్ధుడు, విక్రమార్కుడు, విగ్రహాలకు విశిష్ట కొలమానాలు
ప్రవక్తల దేహాలపై పుట్టుమచ్చలో, ధర్మచక్రాలో ముద్రలుగా ఉంటాయి
ఎవరి శకాలు వారివి, ఎవరి కాలెండర్లు వారివి, ఎవరి దేవుళ్లు వారివి.

క్రీస్తుపూర్వం అయిదు వేలేళ్లక్రితం ప్రపంచ జనాభా యాభైలక్షలు
అక్కడ నుంచి మొదలయ్యింది జనాభా విస్ఫోటనం
బుద్ధుడి కాలానికి పదికోట్లు, క్రీస్తు కాలానికి పదిహేడు కోట్లు
ప్రవక్త మహమ్మదు కాలానికి ఇరవై కోట్లు, ప్రస్తుతం ఏడు వందల డెబ్బైకోట్లు.

రెండువేల సంవత్సరాలకు పూర్వం అమెరికాలో మనుషులు లేరంటే నమ్మలేం.
మనుషులనేవారు ఇప్పుడు ఎక్కడా లేరు, అందరూ వ్యాపారస్తులే!
డెబ్బైవేల ఏళ్ల క్రితం మనుషుల సంఖ్య పదిహేను వేలని ఓ అంచనా
వెనక్కి తవ్వుకుంటూ వెళ్తే ఆదాము – అవ్వల దగ్గర ఆగిపోతాం.

*****

## 2

చాలాచోట్ల ఆడ ప్రపంచం ఆకాశంలో సగం కన్నా తక్కువ
ఏడుకోట్ల ఆధిక్యతతో ఎగుర్తున్నది పురుష పతాక.
అయిదున్నర కోట్ల ఇండియన్, మూడున్నర కోట్ల చైనా మగవాళ్లకు
కోటి స్త్రీజనమెక్కువ ఉన్న రష్యా విసరగలదా సవాల్.

జనాభాను బట్టి వలసలు, ఆడ మగ తేడాల్నిబట్టి ఉద్యోగాలు,
మానవ రవాణాలు, మాయమయ్యే మానవి, మానవత్వాలు
ఒకప్పుడు మలయాళ మహిళలు దేశమంతటా విస్తరించారు.
ఇప్పుడు రష్యా, బర్మా, నేపాల్ నుంచి చీకటి పాలవుతున్నారు.

ఇరవై లక్షల సంవత్సరాల క్రితం నిటారుగా నిలబడ్డాడు మనిషి
రెండు లక్షల సంవత్సరాల క్రితం అబ్బింది కాస్త తెలివి.
నిలబడడం నేర్చుకున్నాక ఉన్నచోట ఆగదు పసిపాపైనా
నడక నేర్చుకున్నాక మొదలవుతుంది అన్నపానాలకై వలస.

కొత్తనీరు వచ్చి పాత నీటిని నెట్టేస్తుంది, లేదా కలుపుకుంటుంది
స్థానిక స్త్రీలు, వలస వచ్చిన మగవాళ్లతో మిశ్రమ జాతులు పుడతాయి
ఆచారాలు, పంటలు, వ్యాధులు, దేవుళ్ల పరస్పర మార్పిడి
గెలిచిన వాళ్ల దేవుళ్లు, మనుషుల కింద, ఓడినవాళ్లు ఊడిగం చేస్తారు.

*****

## 3

అస్తిత్వ పోరాటాలలో వాస్తవాధీన రేఖలను అసలు గుర్తించం
సమ సమాజం కావాలని అందరికీ ఉంటుంది మన సంపద పోనంతవరకూ,
ప్రపంచం దగ్గర్నుంచి మన కంచం వరకూ ఏదో ఒక ఆధిపత్యం
'నోర్మయ్' శబ్దం ఓంకారం కన్నా ఎక్కువగా మోగుతుంది ప్రతినిత్యం

గంజాయి పీలుస్తూ, సోమరసం సేవిస్తూ, పుగాకు చప్పరిస్తూ
సాంబ్రాణి, గుగ్గిలం, అయాహువాస్కా పొగల మధ్య గాలిలో నడుస్తూ
మంత్రోచ్చాటనల మధ్య, బాకాలు, డప్పులు, గంటల చప్పుళ్ల మధ్య
ఆత్మా ప్రక్షాళనం, రంగురంగు ముగ్గుల మధ్య ఆత్మను తాడుపెట్టి లాగడం.

ఇదుగో, నీ దేహం నుంచి దుష్టాత్మను వెళ్లగొట్టి శుద్ధి చేసాను నీ ఆత్మను
అవిగో, శుద్ధాత్మలు వస్తున్నాయి సుడిగుండాల్లా నీలోకి,
ఎన్నిక చేసుకో ఏది కావాలో నీకు, అది నీలో తిరుగుతుంది వేగంగా,
'ఇకారొ' నిన్ను కుదిపేసి ప్రతి అణువును కదిపేసి నీకు ఊర్ధ్వ గమనాన్నిస్తుంది.

ఇవిగో వన భూతాలు, ఇవి జల పిశాచాలు, ఇవి వాయు ఆత్మలు
నీ శరీరమొక అనకొండా దేహం, నీ దేహమొక తిమింగల శరీరం
నీ దేహమొక పెద్ద పడవ, అనకొండా కన్నా, తిమింగలం కన్నా,
అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా, యూరప్, ఆఫ్రికాలలో నీవే రా కన్నా!

*****

## 4

అమెజాన్ వర్షారణ్యాలలో చెట్టు నుంచి చెట్టుకెగుర్తున్నదో 'కాంబొ' కప్ప!
పోయి పట్టుకురా దానిని. దాని చర్మంతో చేస్తాను మంత్ర థక్క.
చేయి చాపు! ఇది సూది, అది కప్ప చర్మంపై సజీవగ్రంధి.
ఈ రసాన్ని నీలో కెక్కిస్తాను, ఎగిరిపో ఈ చెట్టు నుంచి ఆ చెట్టుకు.

కెఛువా మంత్రగాడు యాచకుడు, అన్నీ తెలిసినవాడు.
అతడి నాసికా ద్రవాల్లో దాగి ఉంటుంది మారిరి భూతం
శిష్యుడా, గ్రహించు అరచేతి నుంచో, పుగాకు గొట్టం పొగనుంచో
దుష్టాత్మను వెళ్లగొట్టి పరిశుద్ధ పరచు కాంతి తగ్గిన జీవాత్మను.

హైతీ ద్వీపాల్లో 'ఇవా' భూతాలు; వేడి రాడా, శీతల పెట్వొలు,
పిలుచుకురా పూజారి జాంగన్ లేదా మాన్‌బొ పూజారిణిలను,
బాన్ దియు మంచిదేవుడు, పాపా లెగ్బా, మరస కవలలు,
అగ్వె-సైలిని సముద్ర కవలలు; సొగ్బొ మెరుపు – బదెగాలి

దుంలల్లా సర్పం, అందరు రక్షక దేవతలు నిన్ను కాపాడుదురు గాక!
పాటలు, కేకలు, ఢంకా చప్పుళ్లు, ప్రార్థనలు, బలులు, పూనకాలు
హవున్‌ఫొ వూడూ దేవాలయం ఉన్నదెంతో సందడి సందడిగా
పాత కొత్త దేవుళ్లు, భయం భక్తి కలిసి మంచీ చెడుల చేతబడులుగా!

*****

## 5

తలలు మాట్లాడతాయి, తలపులు మాట్లాడిస్తాయి తలుపు తీస్తే,
అడవికి వెళ్లాడు ఓ వేటగాడు, అతడి కాలికి తగిలి ఎగిరిపడింది ఓ పుర్రె.
–'నాదీ మీ ఊరే, మా అమ్మానాన్నా ఎలా ఉన్నారో కనుక్కురా,
లేకపోతే నిన్ను శపిస్తాను, ముందుచూపు లేని వెధవా' అన్నదా కపాలం.

భయమేసిన వేటగాడు పరిగెత్తి పరిగెత్తి రొప్పుకుంటూ వచ్చాడు రాజు కొలువులోకి
రాజన్నాడు– 'నా తల్లిదండ్రులు నన్ను కన్నప్పటి నుంచి నేను వినలేదు,
ఇటువంటి చిత్రం, పుర్రె మాట్లాడమేమిటి?' అని మథనపడినాడు కాసేపు.
వేటగాడి వెంట భటుల్ని పంపినాడు, నిజమేమిటో తెలుసుకు రమ్మని.

'వీడు చెప్పింది అబద్ధమయితే అక్కడికక్కడే శిరచ్ఛేదం చేయండి'–
అడవిలోకి వచ్చారు భటులు, వేటగాడు; కపాలమక్కడే ఉన్నది.
'నీవు నాతో మాట్లాడావు కదా ఇందాక, నిజం చెప్పు వీళ్లకు!'
ఎంత బతిమలాడినా, పుర్రెక్కడయినా మాట్లాడ్తుందా, మాట్లాడలేదు.

విసిగిపోయిన భటులు వేటగాడి తలనరికి వెళ్లిపోయారు వేగంగా
భటులు వెళ్లిపోయాక కపాలం అడిగింది వేటగాడి తలను–
'ఎవరు నిన్నిక్కడకు తీసుకువచ్చారు, ఇందాక నేను ధ్యానంలో ఉన్నపుడు?'
'మాట్లాడడం తీసుకువచ్చింది' –అన్నది వేటగాడి శిరస్సు– 'ఏకం ఏవాద్వితీయం'

*****

# 22. ఏకం ఏవాద్వితీయం బ్రహ్మ

## 1

సత్యజ్ఞానానంద పరిపూర్ణం సనాతనం ఏకం అద్వితీయం బ్రహ్మ.
బ్రహ్మంలో మూలప్రకృతి, దాగి ఉంటుంది మృత్యులోయలో జీవజలంలా
తెలుపు, ఎరుపు, నలుపు వర్ణాలు సత్వ, రజో, తమోగుణాలు
అవ్యక్తావరణలో ప్రతిబింబించిన పరబ్రహ్మమే ఈశ్వర చైతన్యం

ఆసక్తి-అనాసక్తి, సుఖలాలస-నిర్లిప్తతల మధ్య తిరుగుతూ ఉంటుంది తల.
తల్లీ, గురువు మాటలు తలకెక్కవు, పధ్నాలుగేళ్లకే రాజువయితే
తల వంపుల శృంగారాలు, అంతఃపుర కుట్రలు తల్లినే బలిచేస్తాయి,
తల్లి అగ్రిప్పినాను చంపించినవాడు గురువు సెనెకాను చంపలేడా?

రోమ్ నగరం తగలడుతుంటే ఫిడేలు వాయిస్తూ కూర్చున్న నీరో
గర్భవతి-భార్య పొప్పాయియాను కాలితో పొట్టలో తన్ని చంపేసాడు.
ఆమెలానే ఉన్న స్పొరస్ అనే కుర్రాడి జననాంగాలు కత్తిరించి పెళ్లిచేసుకున్నాడు.
సెనెట్ కూడా ఎదురు తిరిగేసరికి ఎక్కడా దాక్కోవడానికి చోటు దొరకలేదు.

ముప్ఫై ఏళ్ల వయసుకే ముదనష్టపు పనులన్నీ చేసినా
ఆడ మగ తేడా లేకుండా ఆటవిక శృంగారం వెలగబెట్టినా, 'నీరో'
ఆత్మహత్య చేసుకోడానికి ధైర్యం చాలకపోతే, పక్కవాడితో పొడిపించుకున్నాడు
'ఎటువంటి కళాకారుడు నాలో చనిపోతున్నాడం'టూ కన్నుమూసాడు.

*****

## 2

నీరో ఆజ్ఞాపించాడు తన గురువు సెనెకాను 'ఆత్మహత్య చేసుకో'మని
పిసోనియన్ కుట్రలో సెనెకా భాగస్వామి అని అనుమానం
నిర్లిప్తతను బోధించినవాడు, నూట ఇరవై నాలుగు లేఖల రచయిత
మరణాన్ని కూడ అనాసక్తంగానే కౌగిలించుకోడానికి సిద్ధమైనాడు.

అందరూ చూస్తుండగానే అతడి కత్తి కోసింది చేతి రక్తనాళాల్ని
అతడి భార్య పౌలినా అనుసరించింది తన భర్త విధానాన్ని.
నీరో చక్రవర్తి ఆజ్ఞలతో ఆమె చేతికి కట్టుకట్టి బతికించారు.
సెనెకా గాయాల నుంచి రక్తం సెలయేరులా ప్రవహిస్తోంది, కాని మెల్లగా!

రాజభటులు తొందరపెడ్తున్నారు, చచ్చేదేదో తొందరగా చావమని,
అసలే అనుమానం మనిషి నీరో, సెనెకా చావకపోతే చావు సైనికులకు–
రక్తం కారుతూనే ఉంది, విషం తెప్పించుకు తాగాడు, అదీ పనిచేయలేదు.
ఉడుకు నీళ్లలో పడవేయమన్నాడు, ఆవిరి పొగలలో అస్తమించాడతడు.

మరణంలా జీవించడం వేరు, జీవితంలా మరణించడం వేరు
అనాయాస మరణాన్ని కోరుకుంటారు మరణవేదనను చూసినవారు–
అనాసక్త మరణాన్ని తామరాకుపై నీటిబొట్టు నిర్లిప్తతతో చూసేదెందరు?
పులినోటబడ్డ లేడిపిల్ల కన్నులలోని బ్రతుకాశ గమనించేవారెవరు?

*****

## 3

–‘బానిసకెందుకురా చదువూ తత్త్వవిచారం, బుద్ధిలేనివాడా?’–
అన్నాడా యజమాని, ఎపిక్టెటిస్ కాలు మెలిపెడుతూ–
–‘అయ్యా! మరింత మెలిపెడితే విరిగిపోతుంది కాలు’
కాలు విరిగింది, జీవితాంతం కుంటివాడిగా బతికాడతడు.

ఇటువంటి యజమాని గొంతులు వినిపిస్తూనే ఉంటాయి ఇండియాలో
–‘మీకెందుకురా చదువులు ఉద్యోగాలు, కులవృత్తులు చేసుకోక’–
చదువుతో తలపైకెత్తినవాడు కులం పేరు వినగానే కుంగిపోతాడు.
ఎప్పుడో గుండెలో దిగిన ముల్లు మరింత లోతుకు దిగుతుంది.

భూదేవత దిమాత్ర, ఆమె కుమార్తె పెర్సిఫొనిల ఇల్యూసినియన్
ద్రాక్షాది వృక్ష లతల దయనైసిస్‌ను పూజించే ఆర్ఫియస్
థెలిస్, పైథాగరస్, హెరాక్లిటస్, పర్మెనెడిస్, జినోలు
ఎంపిడొక్లిస్, ఎనగ్జాగరస్, డెమొక్రటిస్, ప్రొటాగరస్‌లు–

అనేక ఆలోచనలు – ఒకే నదిలో రెండుసార్లు చేయలేవు స్నానం
అని ఒకరంటే, ‘ఏదీ మారదని’ – ఇంకొకరు, అంతా అభాస, రసాభాసలు,
విరోధాభాసలు – వదిలిన బాణం కదలదనే తర్క ఘోషలు
అప్పుడు ప్రొటాగరస్ – అన్నాడు – మానవుడే అన్నిటికీ కొలమానం.

*****

## 4

‘ఎవరు నీవు’ –అని అడిగింది డెల్ఫి పూజారిణి సోక్రటీస్‌ను
–‘నాకు తెలిసిందొకటే నాకేమీ తెలియదని’ –అన్నాడతడు
‘నిన్ను నీవు తెలుసుకో’ –అన్నదామె ‘అందుకే నీవు మహాజ్ఞానివి’
సోక్రటీస్ జోరీగ – ‘టో టి’ – ఏమిటి? అంటూ కుట్టేవాడందరినీ!

‘నోరు మూసుకుని పడి వుండు లేదా నోరుతెరిచి విషం తాగు’
నా ఏథెన్స్ నగర ప్రజలే నన్ను భరించలేకపోతే ఇంకెవరు భరిస్తారు’
అతడు ఆరోజున విషం తాగాడు, మనం ఇంకా తాగుతూనే ఉన్నాం
మన ప్రశ్నోపనిషత్తునెవరూ పట్టించుకోవడం లేదిప్పుడు.

ప్లేటో ఆదర్శరాజ్యంలో స్వంత ఆస్థి లేదు, కవులకు చోటులేదు,
సత్యం, శివం, సుందరంలో ‘శివ’మనేదే అత్యంత మంచితనం.
ప్రపంచమంతా ప్లేటోగుహలో ధనానికి కట్టివేయబడి ఉంది
అసలైన అదనపు విలువ గుహ బయట ఉన్నదంటే లోనున్నవారు నమ్మరు.

ప్లేటో శిష్యుడు అరిస్టాటిల్ – లైసియంతోటలో చెప్పేవాడు పాఠాలు
అతడి శిష్యుడు అలెగ్జాండర్– ‘నీవు జగజ్జేతవు, దేవుడివి’ అన్నారందరూ
–‘నీవేమైనా కావచ్చు దేవుడివి కాదన్నాడు’ – కాలిస్తెనీస్ కఠినంగా
కాలిస్తెనీస్‌ను ఉరిదీయించినా దేవుడు కాలేకపోయాడు అల్జెగాండర్.

*****

## 5

మార్పుకు కారణాలు - భౌతిక, ఆకృతిక, నిమిత్త, అంతిమాలు–
భౌతిక కారణమే స్థాణువు – నిశ్చల చాలకుడు – కదలకుండా కదిలించేవాడు
అతడు ఆలోచనను ఆలోచిస్తున్న ఆలోచన' - అన్నాడు అరిస్టాటిల్.
అందుకే ప్లేటోను తిరస్కరించి కవులను అంగీకరించాడు.

'మనుషులు శునకాల్లా బతకాలి' అంటారు 'సినిక్'లు
ఈ మాట అన్న డయోజినిస్‌ను చూడాలని వచ్చాడు అలెగ్జాండర్
–'ఎందుకు ఈ తొట్టెలో పడుకుంటావు, నీకేం కావాలో కోరుకో' అన్నాడు దర్పంగా
'ఎండకు అడ్డం వస్తున్నావు, తప్పుకో' –అన్నాడు డయోజినిస్.

ఇండియా నుంచి వస్తూ కలాణుడనే నాగసాధువును తెచ్చాడు అలెగ్జాండర్
'సుసా' వద్ద అగ్నిలో స్వచ్ఛంద మరణం చేస్తూ– 'బాబిలోన్‌లో కలుద్దాం' అన్నాడు సాధువు.
బాబిలోన్‌లో అస్వస్థుడైన అలెగ్జాండర్ అన్నాడు తనవాళ్లతో
– 'నా అరచేతులు బయటకు ఉంచి, శవపేటికను వైద్యులతో మోయించండి!'

ఎపిక్టటిస్ లాంటివాడే మార్కస్ అరీలియస్ చక్రవర్తి
అయిదుగురు మంచి చక్రవర్తులలో ఒకడు, దయగల మహరాజు
ఆశా పరిత్యాగం, నిర్లిప్తతా నిధనం, మనశ్శాంతిని నమ్మిన రాజర్షి
రణభూమిలో నూనె ప్రమిద కాంతిలో రచనను చేసిన యసౌ సోహం హంస.

*****

# 23. యసౌ సోహం హంస సోహం హస్మి

**1**

హంస ఒక్కటే రెండోది లేదు. సోహం అస్మి – హంస, సోహం అన్నీ నేనే!
'మనం జపిస్తూనే ఉంటాం నిరంతరాయంగా సోహం మంత్రం'–
'హమ్'తో నిశ్వాసం, 'స'తో ఉచ్ఛాసం – మన ఊపిరి హంస'–
హంస ఎగిరిపోతే ఏ తత్త్వమూ మిగలదు, మానస సరోవరమూ కానరాదు.

భైరవుడు భైరవికి ఉపదేశించిన నూట పన్నెండు తాంత్రిక యుక్తులు
అభినవగుప్తుడి విజ్ఞాన భైరవతంత్ర – శివజ్ఞాన ఉపనిషత్తు సూక్తులు
భైరవి శక్తిస్వరూపిణి, భైరవుడు శూన్యస్థితి, హంస, ప్రాణశక్తి వాహనం
సాధారణ చేతనకు ఆవల ఉండే ధ్యానస్థితిని హంసతో చేరుకోవడం.

క్షీర నీర న్యాయం తెలిసినది, నల దమయంతుల రాయబారి హంస
జ్ఞాన దండానికి, దుడ్డుకర్రకు తేడా తెలిసినవాడు పరమహంస.
హంస ఓ అభయముద్ర, తెరచిన అరచేయి పాంచభౌతిక చిహ్నం
దుష్ట దృష్టి నివారణకు తాయెత్తు; ఊపిరి, శ్వాస, ప్రాణ రహస్యం

ఎవరో చెప్పారని ప్రతిదీ నమ్మాలని లేదు, ఏదీ సార్వత్రిక సత్యం కాదు.
అరిస్టాటిల్ చెప్పింది, పాత గ్రంథాల్లో చెప్పిందే చెప్పడం వల్ల సత్యం తెలియదు.
బుద్ధి, తర్కం, వివేచన ద్వారా సమాచారాన్ని వర్గీకరించి నిజం రాబట్టాలి'
అన్నాడు– విజ్ఞాని, ప్రతిభాశాలి, నీచుడు, మిత్ర ఘాతకుడు ఫ్రాన్సిస్ బేకన్.

*****

## 2

మానవ పురోగతికి అవరోధం కలిగించేవి నాలుగు విగ్రహాలు
జాతి పూజించే అపోహాలు, వ్యక్తిగత మనోగృహ గ్రహాలు,
విపణి వీధి వచనాలు, రంగస్థల తత్త్వ విచారణా ఆగ్రహ నిగ్రహాలు
వీటిని తొలగించో, సంస్కరించో సత్యాన్ని కొత్తగా కనుక్కోవాలన్నాడు బేకన్.

రాజ్యవ్యవస్థ అనే తిమింగలం – లెవియథాన్ గొప్పదన్నాడు హాబ్స్
'నేను ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాను' –అన్నాడు రెని డెకార్తె
చలి పడని డెకార్తె స్వీడన్ రాణి క్రిస్టినా ఆహ్వానాన్ని అంగీకరించాడు
నాలుగయిదు నెలల్లోనే న్యుమోనియా సోకి 'హంస లేచిపోతున్నది' అంటూ వెళ్లిపోయాడు.

కోహం – ఎవరు నేను? సోహం – నేనే అది; ఆ హంసను నేనే
సచ్చిదానందాన్ని సందర్శించాడు స్పినొజా; జగమంతా శక్తిస్వరూపమన్న లిబ్నిజ్
డెకార్తె, స్పినొజా, లిబ్నిజ్‌ల బుద్ధివాదానికి అడ్డువచ్చాడు అనుభూతివాది జాన్‌లాక్
–'పుట్టినపుడు మన మనసొక తెల్లకాగితం, ఖాళీ పలక (తబులరస)–

మనసు అనుభవంలోకి వచ్చిందీ యాదార్థ్యమన్నాడు – బర్క్లీ
మనసు మన అనుభూతిలోకి రాదు కాబట్టి మనసే లేదన్నాడు – హ్యూమ్
స్వేచ్ఛాజీవిగా పుట్టిన మనిషికిప్పుడు ఎక్కడ చూసినా సంకెళ్లే – అన్నాడు రూసో
నీ మాటను నేనంగీకరించను, నీ మాట్లాడే హక్కును సమర్థిస్తాను' –అంటాడు వొల్టెయిర్.

*****

## 3

తనలో తానుండే వస్తువేది? అనుభూతి, అవగాహనలకతీతమేది?
దేనికా త్రివిక్రమ శక్తి? ఆ మూడోపాదం పెట్టేదెక్కడ?
నిరపేక్ష కర్తవ్యం, నిష్కామ కర్మను నిర్దేశించినదెవరు?
సర్వాతీత ప్రయోజన రహిత ప్రయోజనాత్మకత సౌందర్యమేది?

రాతిస్తంభాన్ని బద్దలు గొడితే కప్ప దూకవచ్చు లేక నరసింహుడే రావచ్చు
ఇమ్మాన్యుయెల్ కాంట్ మనసుకు కనబడింది మనకు కనబడకపోవచ్చు
-'ఒక్క ముక్కలో మీ సిద్ధాంతం చెప్పమంటే పది పుస్తకాలు వ్రాసిన హేతువాది 'హెగెల్'
'ప్రపంచం నా భావం' -అని నిరాశావాదంలో నడిచాడు షోపెన్ హూవర్

పాత దేవుడిని చంపేసిన నీషే, అస్తిత్వవాది కీర్క్‌గార్డ్ మహాశయుడు
సమాజ చరిత్రను వర్గ సంఘర్షణ చరిత్రగా వర్ణించిన మార్క్స్, ఎంగెల్స్
ఫలితాలే ముఖ్యమన్న ప్రాగ్మాటిజపు చైతన్య స్రవంతులు జేమ్స్, బెర్గ్‌సన్
తత్త్వశాస్త్రాన్ని హెడెల్ జటిలం చేస్తే, దానిని సరళంగా చెప్పిన బెర్ట్రాండ్ రస్సెల్

చీకటిలో చీలుదారుల మధ్య ఏకాకిగా కేకలు వేసే మానవుడా,
నీ అంతరాళపు చీకటి మూలల్లో నిన్ను నీవు వెదుక్కో -అన్నాడు సార్త్రె
ఈ అనంతపు చీకటి దారులనిండా అసంఖ్యాక దీపస్తంభాలు
యసౌ సోహం హంస సోహం అస్మి – లోని హంసకై వెదికారు అందరూ.

*****

## 4

నెత్తిమీద తాబేలు పడి ఎస్కిలస్, పడవ ప్రమాదంలో ప్రొటగొరాస్
ఎట్నా అగ్ని పర్వతబిలంలోకి దూకి ఎంపిడోక్లిస్, విషం తాగి సొక్రటీస్
పుట్టినరోజున థ్రాసియన్ యువతి వేణుగానం వింటూ నిద్రలోనే ప్లాటో
ఆకలికి మాడి ఐసొక్రెటిస్, పచ్చి ఆక్టొపస్‌ను తిని డయొజినస్

రోట్లో తలపెట్టి రోకలితో దంచబడి అనాస్కర్కస్,
కాలి బొటనవేలు విరిగితే ఊపిరి బిగబట్టి జెనొ
రోమన్ సైనికుడి కత్తికి ఆర్కిమెడిస్, విరగబడి నవ్వుతూ క్రైసిప్పస్
బలవంతపు ఆత్మహత్యతో రక్తనాళాలు కోసుకుని సెనెకా,

వాండల్స్ చేతిలో సెయింట్ ఆగస్టిన్, గొంతు పిసకబడి బొధియస్
పుచ్చకాయ పొట్ట పగిలేలా తిని జాన్ ఆర్గిరొపొలిస్, తల నరకబడి థామస్ మోర్
అగ్నిమంటల్లో కాల్చివేయబడి బ్రునొ, ల్యుసిల్లొ వానినిలు,
న్యుమోనియాతో బేకన్, చలిజ్వరంతో రెనె డెకార్తె,

సిలికోసిస్‌తో స్పినొజా, గౌట్‌తో లిబ్‌నిజ్, ఉన్మాదంతో నిషె
మంచుగొడ్డలితో హత్యకు గురై ట్రాట్‌స్కి, న్యుమోనియాతో బెర్గ్‌సన్
పిస్టల్‌తో కాల్చబడి మహాత్మాగాంధి, కారు ప్రమాదంలో కామస్
'ఫ్లూ'తో రస్సెల్, శ్వాసకోశ వ్యాధితో సార్త్రె – హంసలెగిరిపోయిన వేదాంతులు.

*****

## 5

హంస తన దుఃఖాన్ని వెల్లడిస్తున్నది గద్గద విషాద స్వరంతో
గుండెల్ని పిండివేసే హంసగీతం, కన్నీటి అక్షరాల అంతిమగీతం
మృత్యుదేవతా, రా, మూసివేయి నా కనురెప్పలను నీ చల్లని చేతులతో
క్షీర నీర న్యాయంతో తత్త్వాన్ని శోధించి అలిసి ముగిసింది నా జీవితం

హృదయపు అష్టదళ పద్మంలో అనాహత స్వరంతో హంస
అగ్నిసోములు రెక్కలుగా, ఓంకారము శిరస్సుగా, అనుస్వరం కన్ను ముక్కుగా,
రుద్ర, రుద్రాణిలు పాదాలుగా, అగ్ని కుడివేపున, కాలం ఎడమవేపున
ఆ పక్షికి పైచూపే, దిగువన లేదే గృహమూ దానికి.

హంస ఎగిరిపోతున్నది, వరుసగా వినవస్తున్నవి దశధ్వనులు
చిని, చిని చిని, చిరుగంట, శంఖ, తంత్రీ, చప్పట్ల ధుని,
వేణువు, భేరీ, మృదంగ, ఉరుములనే నాదాలు కుడి చెవిలో
సాధకుడా, గమనించుము ఉరుము శబ్దం, అదే హంసధ్వని.

ఆ వలసపక్షి 'హంస' నీ జననమప్పుడు లోనికి ప్రవేశిస్తుంది
కొయ్యలోని అగ్నిలా, నువ్వుల విత్తనంలో నూనెలా,
దాగి ఉండి లోతైన లోతులో నివసిస్తుంది
కనిపించని ఆ హంస నీలో ఉన్నది – సర్వోహం విముక్తోహం!

# 24. సర్వోహం విముక్తోహం

## 1

శ్వాస, ఊపిరి, ప్రాణం, ఆత్మ, బ్రహ్మం, మిథ్య, మాయా అన్నీ తానే!
బ్రహ్మ, సరస్వతి, గాయత్రి, విశ్వకర్మల వాహనం హంస
అన్ని లోయలూ దాటిన హంసలన్నీ కలిసిన ఛాయ పరమహంస
సత్యవ్రతుడు, సప్తర్షులతో మేరుపర్వతం దగ్గర ఆగింది, అన్నీ తానే అయి నౌక!

టో-టి ఏమిటీ? అంటావు సోక్రటీస్‌లా! ఏం తెలుసు నీకు?
'ఏమీ తెలియదని నాకు తెలుసు' -అంటావు నీవు, నీతోనే నీవు
'నిన్ను నీవు తెలుసుకున్నావు, ఇంక తెలుసుకోవాల్సిందేమీ లేదు'
తెలిసింది ఏమీలేదని తెలుసుకోవడం తెలుసుకోవడం కాదా?

మాటల గారడీలా ఉంటుంది తత్త్వ విచారం, అదొక మృగతృష్ణ,
యముడు-యమి, లేక ఆదాం-అవ్వలతో మొదలైన నడక ఆగదు
నిత్యం పరిణామం చెందుతూ ఉంటుంది కొలమానం, మనోయానం
లోలకంలా రెండు అగోచర బిందువుల మధ్య అదొక మహాయానం

నీకు అవసరం పడినపుడు ఈజిప్టు వెళతావు పంజరంలోకి,
ఉక్కిరిబిక్కిరయ్యాక మూకుమ్మడి వలస, మహాభినిష్క్రమణం
పాలు తేనెలూరే ప్రాంతాన్ని వెదుక్కుంటూ ఎడారిలో ఎడతెగని సంచారం
రాకపోకల మధ్య భీకర యుద్ధాలు చేసి చివరకిదంతా వృథా అని మహాప్రస్థానం.

*****

## 2

నౌక బయల్దేరింది తనను తాను తెలుసుకోవాలని హంసగా, గోవుగా, పడవగా
అవిగో దీపస్తంభాలు, దీపాలు – వేదాలు, ఉపనిషత్తుల విశిష్ట కాంతులు
అదే ఇది, ఇదే అది అంటూనే 'నేతి నేతి' ఇదికాదు, ఇది కాదు అనుకోవడం
మధ్యమధ్యలో లోకాయత చార్వాక భౌతికవాద రేవుల వద్ద లంగరు వేయడం

నాలుగు దృశ్యాలు చూసి చలించి బోధిచెట్టు నీడన ప్రజ్వలించినవాడు
నాలుగు సత్యాలతో అష్టాంగ మార్గాన్ని, అనాత్మను ప్రబోధించినాడు బుద్ధుడు.
ఈ ప్రపంచమంతా జీవమయం, అనంతకోటి ఆత్మల మయం
అజీవం నుంచి జీవం విముక్తి పొందడం మోక్షమన్నాడు మహావీరుడు.

నౌక బయల్దేరి షడ్దర్శన దీవులను సందర్శించింది సత్యాన్వేషణలో
కపిలుడు, పతంజలి, కణాదుడు, గౌతముడు, జైమిని, బాదరాయణులు
సాంఖ్య, యోగ, వైశేషిక, న్యాయ, మీమాంస, వేదాంత కాంతుల్ని వెదజల్లుతున్నారు
అథాతో బ్రహ్మ జిజ్ఞాసా – తెలుసుకున్నవారికి తెలుసుకున్నంత.

వినవస్తున్నది దేవునిపాట, భగవద్గీత, నిష్కామకర్మను బోధిస్తూ
గెలుపుకు పద్ధెనిమిది మెట్లు చూపించి నరుడిని నడిపించాడు శ్రీకృష్ణుడు
పూర్ణానదిలో మొసలి పట్టుకున్నది శంకరుడనే ఎనిమిదేళ్ల బాలుడి కాలు
ముప్ఫై రెండేళ్లకే 'ముని'గా బోధించాడు బ్రహ్మసత్యం జగన్మిథ్య – అద్వైత తత్వాలు

*****

## 3

శంకరుడిని సందర్శించాక నావికులకు సందేహం వటవృక్షమయ్యింది.
ఇంతకీ ఈ నౌక సగుణమా, నిర్గుణమా? ఈ ప్రయాణం మాయా, వాస్తవమా?
తరువాత మజిలీలలో నాయనార్లు, ఆళ్వార్లు కానవచ్చారు వాదులాడుకుంటూ
రామానుజుడు, మధ్వాచార్యుడు, నింబార్కుడు, వల్లభుడు, శ్రీకృష్ణచైతన్యుడు

వామదేవుడు, తుకారాం, కబీరు, తులసీదాసు, మీరా, లీలాశుక, జయదేవులు
విద్యావతి, చండీదేవుడు, రామదాసు, త్యాగయ్య భక్తి ప్రపంచ వెలుగు దివ్వెలు
అటు శైవం, పాశుపత కాపాలిక శాక్తేయ, వామాచార భావాల వెలిగింది
కాలానుగుణ కర్మకాండలతో భక్తి, భయాలతో చెలరేగింది.

సముద్ర తీరాన వ్యాపారస్తులతో మొదలైన అరబ్బు మతం
పన్నెండు వందలేళ్లు అనాది మతాన్ని కావించింది సంక్షుభితం
ఏకేశ్వరోపాసనతో, ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ స్థిరపడిన పాలకులతో
కొత్త భాష, కొత్త పతాక, కొత్త బానిసత్వం, కొత్త వేదాంత వీచికలు.

ఇంకొక పెనుతరంగంలా వచ్చి మీదపడింది శ్వేత వ్యాపార ప్రపంచం
విభజించి పాలిస్తూ మూడు వందలేళ్లలో ముంచేసిందో నాగరికతను
మరల కొత్త భాష, కొత్త పతాక, కొత్త బానిసత్వం, కొత్త వేదాంత వీచికలు
'టో–టి ఏమిటి? అంటావు సోక్రటీస్‌లా; నీకేమీ తెలియదని తెలుస్తుంది నీకు'.

*****

## 4

అదుగో చితిమీద కాలిపోతున్నది చనిపోయిన పతితో సజీవంగా ఓ సతి,
రామమోహనారాయ్, వెళ్లు, ఆపు, ఆ దురాచారాన్ని; స్థాపించు బ్రహ్మసమాజాన్ని.
ఇదుగో దయానంద సరస్వతి – వేదాల దగ్గరకు వెళదాం – అంటున్నాడు ఆర్యసమాజంతో–
అతడు రామకృష్ణ పరమహంస, అతడి శిష్యుడు స్వామి వివేకానంద

నీవు వెళ్లే నౌక షికాగోలో ఆగుతుందా? డబ్బులు లేని ప్రయాణం సాగుతుందా?
బోస్టన్ రైలు, సిఫార్సు ఉత్తరం, అన్నీ పోతాయి, ఆకలి ఆగుతుందా?
అమెరికా సోదర సోదరీమణులారా అని పిలుస్తుంది ఆప్యాయంగా ఆ గొంతు
ప్రపంచం ఆశ్చర్యపోయింది, ఆ వేదాంత భేరి నిరంతరం మోగుతూనే ఉంది.

నీవో రహస్య సిద్ధాంతం చదువుతావు, నాస్తికత్వం నుంచి ఆస్తికత్వంలోకి వస్తావు.
అనీబిసెంట్‌గా మదాంబ్లావట్ స్కీ దివ్యజ్ఞాన సమాజంలో చేరతావు
అతడో తీవ్రవాది, ఆంగ్లపాలనకు అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అరవిందుడు,
కర్మయోగి, అతడి జన్మదినం ఇండియాకు స్వతంత్రం వచ్చిన ఆగష్టు పదిహేను.

అరవిందం తరువాత విరబూసిన మరో విశ్వ కుసుమం రబీంద్రనాథ్ టాగోర్.
శాంతినికేతనంలో మార్మిక కవిత్వ, ఏకేశ్వర భావకేతనాన్ని ఎగరవేసాడు
సత్యం, అహింస, ధర్మాగ్రహాలతో సత్యమే దేవుడన్నాడు మహాత్మాగాంధి.
నిత్య సత్యాన్వేషి జిడ్డు కృష్ణమూర్తి, అణగారినవర్గాల అన్నంకుండ అంబేద్కర్.

## 5

ఆనంద సామ్రాజ్యపు తాళపు చెవి ఎవరిదగ్గరో దాగి ఉండదు.
తాళమూ నీవే, తాళంచెవీ నీవే, ఆనంద సామ్రాజ్యమూ, ఆనందమూ నీవే!
తత్త్వమసిలోని తత్త్వం, అహం బ్రహ్మాస్మిలోని అహం నీదే!
సోహంలోని హంసవు, హంసలోని సోహానివి అన్నీ నీవే, నీవే నేను.

ఆత్మ, అనాత్మల మధ్య ప్రయాణం చేస్తుంది థెసియస్ నౌక
తనదేదీ మిగలని తనువున్న బయొనిక్ భైరవశక్తి పతాక
తన రెండు కళ్లనూ తీసి నిలబెట్టింది మాయాక్షితిజరేఖపై
వాటి రెటినాలపై లాస్య, తాండవం చేస్తున్నది అర్ధనారీశ్వర ప్రతీక

అంతిమ ఆనందాన్ని నేను, పరమహంసను నేను, సత్యాన్ని నేను.
స్వేచ్ఛను నేను, సమానత్వాన్ని నేను, ప్రేమను నేను, శాంతిని నేను.
అద్భుతాన్ని నేను, సాధారణ సంఘటనను నేను, కదలకుండా కదిలించేది నేను
అనంత దుఃఖాన్ని, అమేయ సుఖాన్ని నేను, కాలాన్ని, కాలాతీతాన్ని నేను.

హంసలు గానం చేస్తున్నాయి అద్భుతంగా, పారవశ్యంగా, విషాదంగా
మానవుడు ఇచ్చేసాడు వాటి వీణను, పాటను సరస్సును, స్వేచ్ఛను
నడక మొదలైన చోటుకే తిరిగి రమ్మంటున్నది ఆత్మ, అనాత్మ హంసగీతం,
ఖాళీ పలకపై కొత్త అక్షరాలను వ్రాయడమే జీవితం, నేను, అహం.

*****

# తాతగారి గొడుగు

తాతయ్య తాను వెళ్లిపోయేప్పుడు మనకిచ్చాడో గొడుగు,
పైగుడ్డ చిరిగిపోతే కొత్తది వేయించాడు కొడుకు,
ఊచలు విరిగిపోతే సరికొత్తవి బిగించాడు మనవడు,
గొడుగు కర్ర ముక్కలయితే కొత్త కర్ర పెట్టించాడు మునిమనవడు!

ఇప్పుడా గొడుగులోదేదీ తాతయ్య గొడుగులోది కాదు,
మరిప్పుడిది తాతయ్య గొడుగా లేక కొత్త గొడుగా, అడుగు!
థెసియస్ నౌకలాంటిదే మన దేహమనే తొడుగు,
అన్నీ కొత్తవే నౌకలోవి, మరి, థెసియస్ నౌక థెసియస్‌ది కాదా?

కాదనలేనిదీ ఔననలేనిదేదో ఉన్నదా? ఉంటే అదెక్కడ ఉన్నది?
నౌకను నడిపే ఇంధనమేదో కనిపించీ కనిపించనిదున్నదా?
నడక మొదలయ్యింది కనుక్కునేందుకు, ప్రవక్త లొక్కొక్కరే కదిలారు.
అగ్ని నుంచి, శిలువ నుంచి, మక్కా-మదీనా నుంచి నడక, నడక

వేదాల నుంచి వర్ణ, కుల, లింగ, మత, భాషా నిర్వేదాల వరకూ వెతల 'కత'
కాదనలేనిది, ఔననలేనిదేదన్నా ఉంటే అదే ఇది, వివక్షత
ఆత్మ, అనాత్మలకన్నా ఉపరితల చర్చలకన్నా ముందు, రావాల్సింది సమానత
వాస్తవం మాయ కాదు, మాయ చేసేవాళ్లు దాచెయ్యాలని ప్రయత్నించే మానవత!

*****

**సత్యమేవ జయతే నానృతమ్**
**సత్యేన పంథావితతో దేవయానః**

– ముండకోపనిషత్ (3.1-6)

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

– బృహదారణ్యోకపనిషత్ (1-3-28)

**ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోప జాయతే**
**ప్రసన్న చేత సోహ్యాశు బుద్ధిః పర్య వతిష్ఠతే**

– భగవద్గీత (2-65)

**మనసే మహాకావ్యం;**
**మనమే మహావాక్యం**

– ప్రసాద్



# Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S. GENERAL SURGERY
M.Ch. CARDIOTHORACIC SURGERY
Fellow in VASCULAR SURGERY
Post graduate Diplomate in Human Rights
Post graduate Diplomate in Television Production
Cell animation Specialist- Heart Animation Academy
Computer Animation Specialist- Pentafour- Chennai
Web Engineer and Web Designer- Web City- Hyderabad
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

## I. తెలుగు కవిత్వం – Poetry (Telugu)

1. ఆల్కెమీ – Alchemy
2. వానమబ్బుల కాంతిఖడ్గం – Vaana Mabbula Kanthi Khadgam
3. టీకప్పులో తుఫాన్ – Tea Kappulo Toofan
4. తంగేటి జున్ను – Tangeti Junnu
5. కర్కాటకం – Karakatakam (Cancer)
6. ఒక సరస్సు–అనేక హంసలు – Oka Sarassu – Aneka Hamsalu
7. మరణశాసనం – Marana Saasanam
8. శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం – Sri Lalitha Sahasranama Stotram
9. కుయ్యో–మొర్రో శతకం – Kuyyo – Morro Satakam
10. భైరవ శతకం – Bhairava Satakam
11. కోవిడ్–19 ప్యారడీలు – Covid-19 Parodies
12. గాయపడిన జింక పిలుపు – Gayapadina Jinka Pilupu
13. మహావాక్యం – Mahavaakyam
14. కుంకుమ భరిణె – Kukum Bharine

## II. Poetry (English)

1. Shades
2. The Twilight Zone
3. My Poem is My Birth Certificate
4. The Pendulum Clock, The Gramophone, the pen and the type writer
5. The Vigilance Whistle!
6. How to Cook a Delicious Poem
7. Windows and Apples
8. The Guerdon of Poesy
9. The Haste Land

10. Bees Need No Invitation When Flowers Bloom...
11. Poetravelogue
12. Wow- Supercalifragilisticexpialidocious
13. The Lost Songs of a Lone Traveler!
14. Che Guevara
15. Coffee - Poems
16. The Tortured Artist
17. Yuddhopanishad (The Upanishad of War)
18. The Making of Mahatma - (Collector's Edition)
19. An Epic of Kashmir
20. The Legend of Lady Yang Guifei- China
21. Tjukurpa- (Australian aboriginal stories- poetry)
    Dream Time - Every When)
22. Trident (Love, War and Peace) along with
    Maria Miraglia, Ayubkhawar
23. Journey to Manasa Sarovar
24. Prima ballerina- Roberta di Lara
25. The Casket of Vermilion- The legend of Sammakka- Sarakka
26. Penning with Penguins (Antarctica)

**III. కథలు-నవలలు-వ్యాసాలు (తెలుగు) - Stories, Novels, Essays... (Telugu)**

1. కత్తి అంచుపై - నాయిర్ కథలు - Katti Anchupai (Noir Stories)
2. కరోనా కత్తిఅంచుపై - నాయిర్ కథలు (Noir Stories)
3. ఛుప్ కె ఛుప్ కె - స్త్రీల వ్యాధుల కథలు (Woman Diseases)
4. కథలు-కవితలు - Kathalu – kavitalu
5. ప్రపంచ ప్రసిద్ధ కథలు - World Famous Stories
6. అక్షరార్చన - Akshararchana (philosophical essays)
7. దీప నిర్వాణ గంధం (మృత్యువు) - Deepa Nirvana Gandham (Death)
8. స్వప్నశాస్త్రం-1 - Swapna Sastram (Dreams-1)
9. స్వప్నశాస్త్రం-2 -కలలు-పీడకలలు - Kalalu-PeedaKalalu (Dreams-2)
10. సంఖ్యాశాస్త్రం - Sankhya Sastram (Numerology)
11. డాక్టర్ జయదేవ్ కార్టూన్లు - Dr. Jayadev Cartoons
12. సత్యాన్వేషణలో - నవల - In Search of Truth (Novel)
13. జీనోమ్ - నవల - Genome (Biotechnology Novel)
14. కోవిడ్-19 - నవల - COVID-19 - Biotechnology Novel
15. వైరసులు-వాక్సీనులు - నవల - VIRUSES – VACCINES
16. అయిదో అశ్వికుడు - నవల - The fifth horseman

17. డాక్టర్ విక్రమార్క-కరోనా బేతాళ కథలు (Corona Stories)
18. ప్రపంచ రాజకీయ సింహాసన ద్వాత్రింశిక - 32 కథలు
19. ప్రపంచతంత్ర కథలు - Prapanchatanthra Kathalu

## IV. అనువాదాలు - ఇంగ్లీషు నుంచి తెలుగులోకి Classics (English to Telugu)

**గ్రీకు సాహిత్యం (Greek Literature)**

1. ఇలియాడ్ - Iliad (Homer)
2. ఒడిస్సీ - Odyssey (Homer)-
3. ఎపిక్ సైకిల్ - Epic Cycle (Homer
4. ఎడిపస్ రెక్స్ - Oedipus Rex- Sophocles
5. ఏంటిగోని - Antigone-- Sophocles-
6. ది ట్రోజన్ విమెన్ - The Trojan Women- Euripides
7. శాఫో కవిత్వం - The Poems of Sappho-
8. ఇది విలువైనది - The Axion Esti (Odysseus Elytis)
9. సెంచరీ ఆఫ్ లవ్ - Century of Love (Roula Pollard)

**లాటిన్ సాహిత్యం (Latin Literature)**

1. ఈనీడ్-వర్జిల్ - Aeneid (Virgil)
2. డివైన్ కామెడీ - డాంటే - Divine Comedy (Dante)

**జర్మన్ సాహిత్యం (German Literature)**

1. ఆత్మను అమ్మిన మానవుడు - Faust - Goethe
2. కాలి నడకన ఆర్కాడియాకు - Barefoot to Arcadia - Aprilia Zank

**నార్డిక్ సాహిత్యం (Nordic Literature)**

1. పెద్దవ్వ చెప్పిన కథలు - Poetic Eddas

**సుమేరియన్ సాహిత్యం (Sumerian Literature)**

1. గిల్గామేష్ చరిత్ర - The Epic of Gilgamesh
2. ఇనాన్నా - Inanna

**ఫ్రెంచి సాహిత్యం (French Literature)**

1. ఫ్రెంచి కవిత్వం - French Poetry
2. కంటక పుష్పాలు - Le Flures du Mal-- Charles Baudelaire

**పర్షియన్ సాహిత్యం (Persian Literature)**

1. జరాతుష్ట్రుడి గాథలు - Zoroster- Gathas
2. మస్నవి-1 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
3. మస్నవి-2 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi

4. మస్నవి–3 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
5. మస్నవి–4 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
6. మస్నవి–5 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
7. మస్నవి–6 జలాలుద్దీన్ రూమి - Masnavi- Rumi
8. పక్షుల సభ – ఫరీదుద్దీన్ అత్తర్ – Birds Conference - Attar
9. మధుశాల – రుబాయిలు – Omar Khayyam

**రష్యన్ సాహిత్యం (Russian Literature)**

1. రసధుని – Russian Poetry

**మెక్సికన్ సాహిత్యం (Mexican Literature)**

1. మెక్సికన్ సాహిత్యం – Mexican Poetry

**లాటిన్ అమెరికన్ సాహిత్యం (Latin American Literature)**

1. లాటిన్ అమెరికన్ కవిత్వం – Latin American Poetry - Part-1

**స్పానిష్ సాహిత్యం (Spanish Literature)**

1. పాబ్లో నెరుడా కవిత్వం – Pablo Neruda Poetry
2. ప్రేమ–మృత్యువు – Love-Death - Frederick Garcia Lorca

**టర్కీ సాహిత్యం (Turkey Literature)**

1. టర్కీ కవిత్వం – దివాన్ కవిత్వం – Turkish Poetry
2. బోనులో సింహం – నజీమ్ హిక్మెత్ – Nazim Hikmet Poetry

**తమిళ సాహిత్యం (Tamil Literature)**

1. శిలప్పదికారం – Silappadikaram - Illango Adigal
2. మణిమేఖల – Manimekhala - Sattanar
3. తమిళ సరస్వతి అందెల రవళి – Sangam Poetry

**కాశ్మీరీ సాహిత్యం (Kashmir Literature)**

1. లల్లాదేవి వాక్కులు – Lal Ded - Vakhs

**హిందీ సాహిత్యం (Hindi Literature)**

1. మధుశాల – Madhusala- Harivams Roy Bachchan

**ఉర్దూ సాహిత్యం (Urdu Literature)**

1. గాలిబ్ గీతమాలిక – Ghalib Ghazals

**పోలండ్ సాహిత్యం (Poland Literature)**

1. పోలండ్ కవిత్వం – Ten Color Rainbow - The Poems from Poland (Bilingual)
2. తొలి వాన కురిసిన తరువాత.... Jak Ziemia Po PierwszymDeszezu

3. క్షణాలు – Moments - AlicjaKubreska
4. అంతరించిన దీపాల ప్రపంచం – The World of Extinct Lamps - Izabela Zubko
5. పవిత్ర త్రిమూర్తిత్వం – Izabela Zubko - The Holy Trinity
6. హైకూలు – Krzysztof Kokot - Around the Haiku
7. జీవిత రహస్యాలు – Juliusz Erazm Bolek - The Secrets of Life - A Calendar in verse
8. అయిదవ ఋతువు – Agnieszka Jarzebowska - The Fifth Season
9. నీలి నిరీక్షణ – Bozena Helena Mazur-Nowak's - Blue Longing
10. (కాదు) నా కవిత – Alicja Kuberska's (Not) My Poem (Telugu)
11. సంచార గాయని – I am a Troubador - Renata Cygan

**చైనా సాహిత్యం (China Literature)**

1. మూడు రంగుల కుంచె – China Classical Poetry
2. యాంగ్ గ్యుఫీ కథ – The Legend of Lady Yang Guifei

**తైవాన్ సాహిత్యం (Taiwan Literature)**

1. తైవాన్ ఆడపడుచు – Tayouan Pai Pai- Yaw-Chin Fang

**ఈజిప్ట్ సాహిత్యం (Egypt Literature)**

1. ప్రాచీన ఈజిప్ట్ గాథలు – Ancient Egypt Stories
2. పరమాత్మునిలో ఐక్యమవుదాం – Lets be one in The One - George Onsy

**ఫిలిప్పీన్స్ సాహిత్యం (Philippines Literature)**

1. పదివేల పంక్తులు – Ten Thousand Lines - Edwin Cordevilla
2. ఈడెన్ పూల వికాసం – Eden Blooms- Eden S. Trinidad
3. ఫిలిప్పీన్స్ జానపద గాథలు – Philippines Folk Tales

**ఆస్ట్రేలియా సాహిత్యం (Australia Literature)**

1. చిరుగాలి నా ప్రేమికుడు – The Wind My Lover- Ade C. Manila
2. నా లోపలి నిరీక్షణ – The Inner Quiet - Deepa Chandran Ram

**ఘనా సాహిత్యం (Ghana Literature)**

1. జీవితానికి అసలైన అర్థం – The Real Meaning of Life - Dr. Rashid Pelpuo

**మొరాకో సాహిత్యం (Morocco Literature)**

1. దీర్ఘ రెక్కల శ్వాస – The Long-Winged Breath- Oulaya Drissiel Bouzadi

**లెబనాన్ సాహిత్యం (Lebanon Literature)**

1. నాజీనామన్ కవిత్వం – Naji Naaman Poetry

**బ్రూనై సాహిత్యం (Brunei Literature)**

1. సున్నిత హస్తాలు – Smooth Hands- Sosonjan A. Khan

**మలేషియా సాహిత్యం (Malaysia Literature)**

1. ఆణిముత్యాలు – Pearls of Wisdom- Pramila Khadun

**కెనడా సాహిత్యం (Canada Literature)**

1. అలలపై స్వారీ – Riding the Tide- Ashok Bhargava

**ఇటాలియన్ సాహిత్యం (Italian Literature)**

1. గులాబీ మేఘాల గ్రహలోకం – The Planet of Pink Clouds - Sergio Camellini
2. నాట్యం చేసే గాలులు – Dancing Winds- Maria Miraglia

**నేపాల్ సాహిత్యం (Nepal Literature)**

1. సూర్యరశ్మి – Sun Shower- Krishna Prasai

**పాకిస్తాన్ సాహిత్యం (Pakistan Literature)**

1. స్వర సమ్మేళనం – Symphony and Other Poems - Ayub Khawar

**ఆంగ్ల సాహిత్యం (English Literature)**

1. పారడైస్ లాస్ట్ – Paradise Lost - John Milton
2. పారడైస్ రిగెయిన్డ్ – Paradise Regained - John Milton
3. తీర్థయాత్రికుని ప్రగతి – Pilgrim's Progress - John Bunyan
4. జీవితం – Emily Dickinson Poetry - Part I
5. ప్రేమ – Emily Dickinson Poetry - Part II
6. ప్రకృతి – Emily Dickinson Poetry - Part III
7. కాలము – శాశ్వతత్వము – Emily Dickinson Poetry - Part IV
8. ఒంటరి జాగిలం – Emily Dickinson Poetry - Part V
9. విలియం బ్లేక్ కవిత్వం – William Blake Poetry
10. టి.ఎస్. ఎలియట్ కవిత్వం – T.S. Eliot Poetry
11. నాందేవ్ ధసాల్ కవిత్వం – NamdeoDhasal Poetry
12. జలపాతం – Jalapatam (Eighteen English Poets)
13. డబ్బు మనిషి – DabbuManishi (Money Poetry)
14. శాంతియుద్ధం – Santi Yuddham (War-Peace)
15. మధుశాల – Rubaiyat- Edward Fitzgerald
16. సౌగంధిక – Sougandhika (Master Poems in English-1)
17. తూర్పు–పడమర (Master Poems in English-2)
18. ప్రేమ కురిసిన వేళలో... (Master Poems in English-3)
19. వాళ్ళు ముగ్గురూ (Master Poems in English-4)
20. అలనాటి కొత్తగాలి (Master Poems in English-5)

21. మంచు తుఫాన్ (Master Poems in English-6)
22. ఎండా–వానా (Master Poems in English-7)
23. పిల్లనగ్రోవి పిలుపు (Master Poems in English-8)
24. అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె (Master Poems in English-9)
25. నాలుగు దిక్కులు (Master Poems in English-10)
26. దివ్య వస్త్రాల కోసం(Master Poems in English-11)
27. ఒక మధుశాల (Master Poems in English-12)
28. క్రీస్తు అద్భుత గీతాలు (ChristuAdbhutaGeethalu)
29. క్రీస్తు నడిచిన దారిలో (The Path of Christ)
30. అలింద సంగీతం - Chamber Music - James Joyce
31. మార్మిక నావికుడు - The Mystic Mariner- Madan Gandhi
32. శతరూప - Sataroopa- A.K. Khanna
33. వాసుదేవ్ చక్రవర్తి కవిత్వం - Basudeb Chakraborti
34. జ్వాలలతో పోరాటం - Fighting the Flames- Dr. Jernail S. Anand
35. వెన్నెల అలలు - Rippling Moonbeams- Lily Swarn

**V. Translations (From Telugu to English)**

1. The Great Battle (Suprasanna) - సాంపరాయం – కోవెల సుప్రసన్నాచార్య కవిత్వం
2. The Tree of Fire (AnumandlaBhoomaiah) - అగ్నివృక్షం – భూమయ్య కవిత్వం
3. The Poems of Kuppam (Seeta Ram) - కుప్పం కవితలు – సీతారామ్ కవిత్వం
4. We Need a Language (Sudhakar) - మాకూ ఒక భాష కావాలి – తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
5. The Broken Grammar (Sudhakar) - దళిత వ్యాకరణం – తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
6. The Voice of Telangana (Madiraju Ranga Rao) - తెలంగాణా స్వరం – మాదిరాజు రంగారావు
7. Fire and Ice (Rama Chandramouli) - రామా చంద్రమౌళి కవిత్వం
8. This is no Streaking (Stories - K.K. Menon) - కె.కె. మీనన్ కథలు
9. The Pool of Blood (Naveen) - రక్త కాసారం – అంపశయ్య నవీన్ నవల
10. The Enraged Voice- Ravi Maruth - ఉద్రిక్త స్వరం – రవి మారుత్ కవిత్వం
11. To Whomsoever it may concern -Prasen - ఎవరికీ వర్తిస్తే వారికి – ప్రసేన్ కవిత్వం
12. Bouquet of Telugu Songs and Poems - ప్రసిద్ధ తెలుగు పద్యాలు, పాటలు

**VI. Miscellaneous- English)**

1. Potana's Bhagavatam
2. Soundarya Lahari - Sankaracharya's Soundarya Lahari
3. Modern Bhagavadgita
4. The Songs of Annamayya
5. In Search of Truth (Novel)
6. How to be happy (Philosophy)

**VII. Books translated into Multiple Languages**

1. The Casket of Vermilion- English - Dr. Lanka Siva Rama Prasad
   i. The Casket of Vermilion -Telugu - Dr. Lanka Siva Rama Prasad
   ii. The Casket of Vermilion -Telugu - పాతూరి రఘురామయ్య, సుప్రసన్నాచార్య
   iii. The Casket of Vermilion - Urdu- JawaidNaseem
   iv. The Casket of Vermilion - Punjabi- Prof. Joginder Singh Jogi
   v. The Casket of Vermilion - Malayalam - Sarala Ram Kamal
   vi. The Casket of Vermilion- Marathi- Narayana Mudgalkar, Neelima Mudgalkar
   vii. The Casket of Vermilion - German - Sabine Stiglmayr, Aprilia Zank
   viii. The Casket of Vermilion - Polish - Alicja Kubreska
   ix. The Casket of Vermilion - Philippines- Eden.S. Trinidad
   x. The Casket of Vermilion - Chinese- Tian yu
   xi. OchrowaSzkatutka - Polish - Alicja Kubreska
2. Trident- English, Telugu, Italian, Urdu
3. The Legend of Lady Yang Guifei- English, Telugu, Malayalam, Mandarin

**He won many awards nationally and internationally-**
**He is the recipient of**

1. T.S. Eliot award- 2017,
2. Global poet Award - CANADA-WIN - 2017,
3. Life time achievement Award - Ghana- 2017,
4. Kibatek medal -Turkey - 2017
5. Rauel international Award - 2017
6. Poet Laureate Award - Delhi - 2017
7. SahitiRajahamsa award - Vizag - 2017
8. Poet Laureate-Kazakhstan - 2017
9. Pentasi-B Life Time Achievement Award-2017
10. Naji Naaman Poet Laureate Award - Lebanon -2018
11. Poet Laureate Award - China - 2019
12. Sophy Chen - Award - China - 2019
13. Master of Metaphor and Trans Creative Surgery- 2019 and many more….

He was the host, sponsor of World poetree Festival- 2017 under the banner of Pentasi-B India World Poetry Festival. Attended many International Poetry Festivals in India and abroad- China, Morocco, Ghana, Singapore, Australia, Greece, Poland, Italy, and Philippines as guest of honor.

More than hundred books are available in his free website-

**www.anuvaadham.com**

**www.prosetry.in**